RNI-TGBIL/25/A1275

ప్రజా తెలుగు శక్తి

www.prajatelugushakthi.com

TELUGU DAILY

TV15

A Voice Of Truth.....

సంపుటి (Volume) :01 సంచిక (Issue) :256 ఎడిటర్ : SDతాజ్ బాబా పేజిలు : 08, వెల. 5రూ/ సోమవారం-02- అక్టోంబర్ - 2026

అమెరికా కోర్టులో

ట్రంప్‌కు ఎదురుదెబ్బ



★ఎప్ స్టీన్‌కు ట్రంప్ అశ్లీల లేఖ రాశారంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రముఖంగా కథనాన్ని ప్రచురించింది.

★ భవిష్యత్తులో తిరిగి దాఖలు చేయడానికి లేదా సవరించడానికి వీలులేకుండా తుది ఉత్తర్వులు జారీ చేశారు.

వివాదాస్పద లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్ స్టీన్‌కు పుట్టినరోజు లేఖ రాశారంటూ వచ్చిన కథనంపై

జ్ఞానేశ్ కచ్చితంగా జైలుకే- ఆయన లేకుంటే

మోదీ, షాకు పదవులే లేవు!

- రైతులు, యువత, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు.
- వారి హక్కులను నిరాకరిస్తున్నారని, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఆయన ఆరోపించారు.



ఢిల్లి : దేశంలో ఎన్నికల వ్యవస్థను నాశనం చేసినందుకు భవిష్యత్తులో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించి, దేశద్రోహం కింద జైలుకు పంపుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోదీ, అమిత్ షాలు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేశారు. దిల్లీలోని రామ్ లీలా మైదాన్‌లో జరిగిన ఇండీ కూటమి భారీ ర్యాలీలో ఈ మేరకు ప్రసంగించారు. దిల్లీ సభకు వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే, ప్రధాని, హోంమంత్రి, సీఈసీలకు స్పష్టమైన సందేశం వెళ్లినట్లేనని ఆయన అన్నారు. "మోదీ ఎక్కడికీ వెళ్లరు" అన్న అమిత్ షా వ్యాఖ్యలపై స్పందిస్తూ "మోదీ పారిపోవాలనుకున్నా తాము వదలబోము" అని కౌంటర్ ఇచ్చారు. దేశంలోని మిగతా..2లో

సిక్కు అల్లర్ల బాధితుల గాయాలపై

కాంగ్రెస్ ఉప్పు జల్లుతోంది

- కాంగ్రెస్ పై, రాహుల్ గాంధీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధ్వజమెత్తారు.
- 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లలో వేదాది మంది సజీవ దహనం అయ్యారని ఆరోపించారు.



దిల్లీ : దిల్లీ నిరసనల వేళ కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల వార్షికోత్సవం నాడు దిల్లీలో రాజకీయ ర్యాలీని నిర్వహించడం ద్వారా హస్తం పార్టీ బాధితుల గాయాలపై ఉప్పు జల్లుతోందని ఆరోపించారు. 1984 నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టడం ద్వారా జరిగిన అల్లర్లలో దిల్లీలో వేలాది మంది సిక్కులు దారుణంగా హత్యకు గురయ్యారని విమర్శించారు. 1984లో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య అనంతరం చెలరేగిన హింసాకాండలోని భయానక పరిస్థితులను చండీగఢ్‌లోని ఓ సభలో ప్రసంగిస్తూ షా గుర్తుచేసుకున్నారు. మిగతా..2లో

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం..

మరో ఏడాది ధైర్యంగా ఉండండి..



★ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

★తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగించాలని స్థానిక నాయకులకు కేటీఆర్ సూచించారు.

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులకు పెట్టుబడి సాయం అందక, యూరియా కొరత, విద్యుత్ సమస్యలు, పంటల కొనుగోళ్లలో ఇబ్బందులతో అప్పుల భారం పెరిగి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

ఓట్‌చోరీపై రాంలీలా మైదాన్‌లో పోరాటం చేస్తాం

- ఓట్ల తొలగింపు వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు.
- దేశవ్యాప్తంగా 13.5 కోట్ల ఓట్లు తొలగించారని, పేదల ఓట్లను సైతం తొలగిస్తున్నారని ఆరోపించారు.



ఢిల్లీ, నవంబర్ 1: దేశంలో ఓట్ల తొలగింపు వ్యవహారంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. ఓట్‌చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రాంలీలా మైదాన్ వేదికగా యుద్ధం చేస్తామని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 13.5 కోట్ల ఓట్లను తొలగించారని.. ముఖ్యంగా పేదల ఓట్లను లక్ష్యంగా చేసుకుని తొలగిస్తున్నారని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో మొత్తం 20 కోట్ల ఓట్లు తొలగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని.. అలాంటి ఓటు హక్కును కాలరాసే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ఓట్ల తొలగింపు ద్వారా మరోసారి అధికార పీఠాన్ని దక్కించుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ కుట్రలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. దేశంలోని పేదలు, సామాన్య ప్రజల ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. రాంలీలా మైదాన్‌లో నిర్వహించనున్న పోరాటానికి పెద్దఎత్తున ప్రజలు తరలిరావడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. రైళ్లు ఇవ్వకపోయినా భారీ సంఖ్యలో జనం ఢిల్లీకి చేరుకున్నారని అన్నారు. ప్రజల్లో ఓటు హక్కు పరిరక్షణపై ఉన్న చైతన్యానికి ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఓట్ల తొలగింపు వ్యవహారాన్ని దేశవ్యాప్త సమస్యగా అభివర్ణిస్తూ.. దీనిపై రాంలీలా మైదాన్ వేదికగా తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఓటు హక్కును కాపాడటం.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చూడటం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. మళ్లీ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజాస్వామ్య వ్యవస్థను మిగతా..2లో

పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలవాలి..

గోదావరిఖనిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం



- పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు.
- ఆయన జ్ఞాపకార్థం గోదావరిఖనిలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.

తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ విద్యావేత్త పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డివ్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. ఆయన జ్ఞాపకార్థం గోదావరిఖనిలో నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఇందుకు ఎంత ఖర్చయినా పార్టీ భరిస్తుందని వెల్లడించారు. పీటీ స్వామి దశదిన కర్మ సందర్భంగా ఆదివారం గోదావరిఖని మార్కండేయ కాలనీలోని ఆర్‌కే గార్డెన్స్‌లో నిర్వహించిన సంస్మరణ సభకు హరీశ్‌రావు హాజరయ్యారు. పీటీ స్వామి చిత్రపటానికి

దూసుకొస్తున్న 'మురసు' - వచ్చే మూడ్రోజులు ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

బంగాళాఖాతంలో మురసు తుపాను వేగంగా కదులుతోంది.

ఈ ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడ్రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

ఏపీపై 'మురసు' తుపాను ముప్పు

ఢిల్లి :బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం 'మురసు' తుపానుగా బలపడింది. ఇది చురుగ్గా కదులుతోంది. గడచిన 6 గంటల్లో గంటకు 23 కిలోమీటర్ల వేగంతో పయనిస్తోంది. చెన్నైకి 560 కిలోమీటర్లు, విశాఖకు 660 కిలోమీటర్లు, మచిలీపట్నానికి 640 కిలోమీటర్లు, నెల్లూరుకు 630 కిలోమీటర్లు, ఒంగోలుకు 680 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. రేపు (సోమవారం) ఉదయానికి బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉంది. రేపు అర్ధరాత్రి దాటాక నెల్లూరు-నరసాపురం మధ్య తీరం దాటే అవకాశం ఉంది.

సూర్యాపేటలో 150 కిలోల గంజాయి పట్టివేత..

సూర్యాపేటలో భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్న యువకులను కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు.


వారి నుంచి 150 కిలోల గంజాయి, రెండు ఫోన్లు, ఓ కారు స్వాధీనం చేసుకున్నారు.

కాగా పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.

సూర్యాపేట, నవంబర్ 1: జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి లభ్యమవడం కలకలం రేపింది. 150 కిలోల గంజాయిని తరలిస్తున్న యువకులను

రాబోయే 48 గంటలు కీలకం..

బెంగళూరులో రాప్తాడు బాలికను పరామర్శించిన మంత్రి లోకేశ్



★రాప్తాడులో యువకుడి దాడిలో తీవ్రంగా గాయపడిన బాలిక

★మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలింపు

★బెంగళూరు వెళ్లి బాలికను పరామర్శించి, కుటుంబానికి ధైర్యం చెప్పిన లోకేశ్

★బాలికకు అత్యుత్తమ వైద్యం అందిస్తామని, కుటుంబానికి అండగా ఉంటామని హామీ

★స్కూల్‌లో నిర్మాణ పనుల ముసుగులో దుండగుడు ప్రవేశించాడని వెల్లడి

★నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని, చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టీకరణ

ఏపీకి మరో తుపాను ముప్పు.. ఢిల్లీ పర్యటన

రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు

- బంగాళాఖాతంలో తుపానుగా మారిన వాయుగుండం
- రేపటికి తీవ్ర తుపానుగా మారుతుందంటున్న వాతావరణ నివేదికలు
- బాపట్ల వద్ద తీరం చేరే అవకాశం
- అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- ముందస్తు చర్యలపై కీలక ఆదేశాలు



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌ను మరో తుపాను గండం వెంటాడుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారింది. ఇది తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ విపత్కర పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు రేపటి ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నారు. ఆయన ఉన్నతాధికారులతో అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించి, తుపానును ఎదుర్కొనేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై కీలక ఆదేశాలు జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, నైరుతి బంగాళాఖాతంలో మిగతా..2లో

పులివెందులలో ఓటు వేయకుండానే

వెనుదిరిగిన జగన్.. రీపోలింగ్ కు డిమాండ్



- పులివెందుల మున్సిపల్ ఎన్నికల్లో ఉద్రిక్తతలు
- ఓటు వేయనన్న జగన్
- తాను ఓటు వేస్తే అంతా సజావుగా సాగుతోందనుకుంటా రని వెల్లడి
- రీపోలింగ్ జరిపితేనే ఓటు వేస్తానని స్పష్టీకరణ
- ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోందని వ్యాఖ్యలు

అమరావతి : కడప జిల్లా పులివెందులలో ఆదివారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల మిగతా..2లో

ప్రజా తెలుగు శక్తి
TELUGU DAILY
సోమవారం-02- అక్టోబర్ - 2026

మొదటి పేజి తరువాయి

రాబోయే 48 గంటలు కీలకం.. బెంగళూరులో రాప్తాడు బాలికను పరామర్శించిన మంత్రి లోకేశ్

అమరావతి : రాప్తాడు పాఠశాలలో దుండగుడి దాడిలో అత్యంత దారుణంగా గాయపడిన పదో తరగతి విద్యార్థినిని ఆంధ్రప్రదేశ్ విద్యా ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించిన బాలికను ఆయన ఆదివారం స్వయంగా వెళ్లి చూశారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, బాలిక సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకునే వరకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "రాప్తాడులో జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరం, బాధాకరం. ఇలాంటివి జరగాల్సింది కాదు. విషయం తెలిసిన వెంటనే పోలీసు, ఆరోగ్య శాఖలను అప్రమత్తం చేశాను. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు దాదాపు 8 గంటల పాటు శ్రమించి బాలికను విషమ పరిస్థితి నుంచి గట్టెక్కించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేసి బెంగళూరులోని మణిపాల్ ఆసుపత్రికి తరలించాం. ఇక్కడకు తీసుకువచ్చిన వెంటనే వైద్య బృందం స్పందించి దాదాపు 12 గంటల పాటు సుదీర్ఘమైన శస్త్రచికిత్స నిర్వహించింది. ప్రస్తుతం బాలికను ఐసీయూకి తరలించారు. రాబోయే 48 గంటలు చాలా కీలకం. మనందరి ప్రార్థనలు ఆ బిడ్డకు ఎంతో అవసరం. ఆమె మన బిడ్డ, మనందరి మద్దతుతో సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలి" అని లోకేశ్ ఆకాంక్షించారు. ఈ ఘటనపై ప్రభుత్వం చాలా తీవ్రంగా స్పందించిందని లోకేశ్ స్పష్టం చేశారు. "పాఠశాలలో 'భవిత' సెంటర్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆ నిర్మాణ పనులకు వచ్చే కార్మికుడి ముసుగులో దుండగుడు పాఠశాలలోకి ప్రవేశించి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఇది కచ్చితంగా భద్రతా లోపమే. నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నారు. ఘటనకు ముందు అతడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. అతడిని త్వరలోనే పట్టుకుంటాం. ఈ ఘటనకు బాధ్యులైన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుని నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తాం" అని ఆయన గట్టిగా చెప్పారు. ఈ దాడిని ప్రత్యక్షంగా చూసిన తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని, వారికి ఇప్పటికే కౌన్సెలింగ్ ప్రారంభించామని లోకేశ్ తెలిపారు. "పిల్లల మానసిక ఆరోగ్యం మాకు చాలా ముఖ్యం. ఈ గాయం నుంచి వారు కోలుకోవడానికి కనీసం ఏడాది పట్టొచ్చు. అందుకే వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి, నిపుణులతో కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నాం. తల్లిదండ్రుల్లో మళ్లీ ధైర్యం నింపి, పిల్లలను పాఠశాలలకు పంపేలా చూసే బాధ్యత మాది" అని అన్నారు. పాఠశాలల్లో భద్రతా వ్యవస్థను మరింత పటిష్ఠం చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. "సాధారణంగా పాఠశాలల్లోకి బయటి వ్యక్తులను అనుమతించం. ప్రధానోపాధ్యాయుడి అనుమతి తప్పనిసరి. కానీ ఇక్కడ నిర్మాణ పనుల వల్ల ఈ లోపం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటాం" అని వివరించారు. దాడిని అడ్డుకునే క్రమంలో గాయపడిన మరో బాలిక అనంతపురంలో చికిత్స పొందుతోందని, ఆమె క్షేమంగా ఉందని తెలిపారు. బాధితురాలి గుర్తింపును గోప్యంగా ఉంచాలని, ఆమె కోలుకునే క్రమంలో మీడియా కూడా సహకరించాలని లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

అమెరికా కోర్టులో ట్రంప్‌కు ఎదురుదెబ్బ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాల్‌స్ట్రీట్ జర్నల్‌పై వేసిన పరువు నష్టం దావాను యూఎస్ కోర్టు కొట్టివేసింది.

కోర్టులో ట్రంప్‌నకు నిరాశ

ఎప్ స్టీన్‌కు ట్రంప్ అశ్లీల లేఖ రాశారంటూ వాల్‌స్ట్రీట్ జర్నల్ ప్రముఖంగా కథనాన్ని ప్రచురించింది. దీనిని కల్పితమని ఖండిస్తూ ట్రంప్ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ట్రంప్‌కు తన పిటిషన్‌ను సవరించుకునే అవకాశం లభించినప్పటికీ, దానిని ఆయన సవరించలేదు. దీంతో తాజాగా విచారణ జరిపిన న్యాయమూర్తి డారిన్ పి. గేల్స్.. ఈ పిటిషన్‌ను పూర్తిగా తోసిపుచ్చడమే కాకుండా, భవిష్యత్తులో తిరిగి దాఖలు చేయడానికి లేదా సవరించడానికి వీలులేకుండా తుది ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి వాల్‌స్ట్రీట్ జర్నల్ పాటించిన జర్నలిజం ప్రమాణాలతో కోర్టు ఏకీభవించింది. కథనం ప్రచురించే ముందే ట్రంప్ స్పందన కోరడం, ఆయన చేసిన ఖండన ప్రకటనలను కూడా పత్రిక ప్రచురించడాన్ని న్యాయస్థానం పరిగణనలోకి తీసుకుంది. ప్రముఖులు పరువు నష్టం దావాలు వేసేటప్పుడు నిరూపించాల్సిన 'వాస్తవ దురుద్దేశాన్ని' ట్రంప్ తరఫు న్యాయవాదులు నిరూపించలేకపోయారని కోర్టు స్పష్టం చేసింది. ప్రతివాది దురుద్దేశంతో పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు చేశారని విశ్వసనీయంగా ఆరోపించడంలో విఫలమైనందునే ఫిర్యాదును కొట్టివేస్తున్నట్లు న్యాయమూర్తి వెల్లడించారు.

ఓట్‌చోరీపై రాంలీలా మైదాన్‌లో పోరాటం చేస్తాం

ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓట్‌చోరీ అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని పిలుపునిచ్చారు.

సూర్యాపేటలో 150 కిలోల గంజాయి పట్టివేత..

కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. కాగా.. ఈ కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలో భారీ మొత్తంలో గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు.. జిల్లావ్యాప్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో 150 కేజీల గంజాయిని తరలిస్తున్న ఐదుగురు యువకుల ముఠాపై పోలీసులు దాడి చేశారు. కాగా.. ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేయగా.. మరో ముగ్గురు పరారయ్యారు. ఈ మేరకు నిందితుల నుంచి 150 కిలోల గంజాయి, రెండు ఫోన్లు, ఓ కారును స్వాధీనం చేసున్నారు. రాజమండ్రి నుంచి బెంగుళూరుకు గంజాయిను తరలిస్తున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. కాగా.. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ దందాతో ఎవరెవరికి సంబంధం ఉంది. ఇంత పెద్ద మొత్తంలో గంజాయి వీరికి ఎలా లభించింది అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

పీటీ స్వామి సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలవాలి.. గోదావరిఖనిలో కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం

వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పీటీ స్వామిని కోల్పోవడం ఆయన కుటుంబానికే కాకుండా బీఆర్ఎస్ పార్టీకి, సింగరేణి కార్మిక లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మరణవార్త విన్న వెంటనే పార్టీ అధినేత కేసీఆర్ ఎంతో బాధపడ్డారని చెప్పారు. సంస్మరణ సభకు పార్టీ ప్రతినిధులుగా తప్పకుండా హాజరుకావాలని కేసీఆర్ ఆదేశించడంతో ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. కేసీఆర్‌కు పీటీ స్వామి అంటే ఎంతో అభిమానం, గౌరవం ఉండేవని హరీశ్‌రావు గుర్తుచేశారు. సింగరేణిలో బొగ్గు గని కార్మిక సంఘం ఏర్పాటు చేయాలనే ఆలోచన తొలుత కేసీఆర్‌కు అంతగా నచ్చలేదన్నారు. అప్పటికే ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ సంఘాల్లో ఉన్న కార్మికులంతా తెలంగాణ బిడ్డలేనని, ప్రత్యేకంగా మరో సంఘం ఏర్పాటు చేస్తే తెలంగాణ ఉద్యమానికి వారు దూరమయ్యే ప్రమాదం ఉందని కేసీఆర్ భావించారని వివరించారు. అయితే పీటీ స్వామి, కొప్పుల ఈశ్వర్ తదితరులు కేసీఆర్‌ను ఒప్పించి టీబీజీకేఎస్ ఏర్పాటుకు కృషి చేశారని తెలిపారు. ప్రత్యేక కార్మిక సంఘం ఏర్పాటుతో ఉద్యమం, పార్టీ బలోపేతం కావడంతో పాటు కార్మికులకు మేలు జరుగుతుందని వివరించారని చెప్పారు. ఈ క్రమంలోనే టీబీజీకేఎస్ ఆవిర్భావానికి పీటీ స్వామి మూలకారకుడిగా నిలిచారని, సంఘం తొలి గౌరవ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారని వెల్లడించారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ ఏర్పాటైన నెల రోజుల్లోపే కొప్పుల ఈశ్వర్, మురళీధర్‌తో పాటు పీటీ స్వామి పార్టీలో చేరారని హరీశ్‌రావు తెలిపారు. అప్పటి నుంచి మరణించే వరకు 26 ఏళ్ల పాటు కేసీఆర్ వెన్నంటి ఉన్నారని చెప్పారు. ఆయనతో కలిసి తాను 14 ఏళ్లు తెలంగాణ ఉద్యమంలో, పదేళ్లు ప్రభుత్వంలో, అనంతరం ప్రతిపక్షంలో పనిచేశానని గుర్తుచేసుకున్నారు. పీటీ స్వామి నిరంతరం ప్రజా జీవితంలోనే గడిపారని, విశ్రాంతి లేకుండా పనిచేసే నిత్య శ్రామికుడని కొనియాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన అనంతరం తెలంగాణ ఉద్యమంలోకి వచ్చారని తెలిపారు. మేధావుల్లో మేధావిగా, కార్మికుల్లో కార్మికుడిగా, విద్యావంతుల్లో విద్యావంతుడిగా అన్ని వర్గాల ప్రజల గౌరవాన్ని పొందారని పేర్కొన్నారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం.. మరో ఏడాది ధైర్యంగా ఉండండి..

బోథ్ నియోజకవర్గంలోని తలమడుగు మండలంలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నలుగురు రైతుల కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఒక్క తలమడుగు మండలంలోనే నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమన్నారు. లక్ష్మణ్ వ్యవసాయ పొలంలో ఉరేసుకుని చనిపోగా.. గుర్రాల ప్రతాప్‌రెడ్డి, పశుల హోసన్న, ధన్నూరు గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నారని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెయ్యికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. వీరిలో అత్యధికంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే వందకు పైగా ఘటనలు జరగడం బాధాకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు రైతుబంధు, రైతుబీమా పథకాల ద్వారా భరోసా కల్పించామని కేటీఆర్ పేర్కొన్నారు. రైతు ఏ కారణంతో మరణించినా రూ.5 లక్షల రైతుబీమా సాయం 15 రోజుల్లోపు కుటుంబానికి అందేదని గుర్తుచేశారు. పంటల సాగు సమయంలో రైతుబంధు అందేదని, పంటలకు ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేసేదని అన్నారు. ప్రస్తుతం యూరియా కొరత, విద్యుత్ సరఫరా సమస్యలు, పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు రైతులను వేధిస్తున్నాయని విమర్శించారు. కిసాన్ యాప్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. రైతు కుటుంబాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని.. అయినప్పటికీ.. బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా నిలవాలని కేసీఆర్ ఆదేశించారని కేటీఆర్ తెలిపారు. అందులో భాగంగానే బాధిత నాలుగు కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున చెక్కులు అందించినట్లు చెప్పారు. అయితే ఈ సాయం సరిపోదని, రైతు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి న్యాయం జరిగేలా ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. రైతుల ఆత్మహత్యలకు ప్రభుత్వ వైఫల్యమే కారణమని ఆరోపిస్తూ, వీటిని ఆత్మహత్యలుగా కాకుండా ప్రభుత్వ వైఫల్యంతో జరిగిన మరణాలుగా అభివర్ణించారు. తలమడుగు మండలాన్ని కరువు మండలంగా ప్రకటించే వరకు పోరాటం కొనసాగించాలని స్థానిక నాయకులకు కేటీఆర్ సూచించారు. పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. మరో ఏడాది ధైర్యంగా ఉండాలని, ఆ తర్వాత కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తారని,

ఏపీకి మరో తుపాను ముప్పు.. ఢిల్లీ పర్యటన రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి

ఉన్న వాయుగుండం వేగంగా బలపడి తీవ్ర వాయుగుండంగా, అనంతరం తుపానుగా మారనుంది. రేపటికి (నవంబరు 2) ఇది పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర తుపానుగా రూపాంతరం చెందుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ తుపాను నవంబరు 3న ఉదయం బాపట్ల సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో ప్రచండ గాలులు వీస్తాయని హెచ్చరించారు. ఈ తుపాను ప్రభావంతో నవంబరు 2 నుంచి దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. నవంబరు 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు పడతాయని అంచనా వేశారు. ముఖ్యంగా 20 మండలాల్లో అత్యంత భారీ వర్షాలు కురవచ్చని అధికారులు



గుర్తించారు. వీటిలో ఏలూరు జిల్లాలో 9, కృష్ణాలో 5, ఎన్టీఆర్ జిల్లాలో 5, బాపట్లలో ఒక మండలం ఉన్నాయి. నవంబరు 3న ఏలూరు జిల్లాలో సగటున 179 మిల్లీమీటర్లు, కృష్ణాలో 163, ఎన్టీఆర్‌లో 161, పశ్చిమ గోదావరిలో 147, గుంటూరులో 119, బాపట్లలో 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు.

భారీ వర్షాల కారణంగా బుడమేరు వద్ద నవంబరు 3న సుమారు 32,500 క్యూసెక్కుల వరద ప్రవాహం రావచ్చని, అలాగే ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా వంటి జలాశయాలకు భారీ వరద ముప్పు పొంచి ఉందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బలమైన గాలుల వల్ల 12 జిల్లాల్లో సుమారు 12,102 నుంచి 15,128 విద్యుత్ స్తంభాలు దెబ్బతినవచ్చని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇదే సమావేశంలో, ఇటీవల రాష్ట్రాన్ని అతలాకుతలం చేసిన 'అర్నబ్' తుపాను నష్టం, సహాయక చర్యలపై కూడా అధికారులు సీఎంకు నివేదిక సమర్పించారు. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనుల పురోగతిని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పూర్తిగా పునరుద్ధరిస్తామని అధికారులు ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. రాబోయే తుపాను వల్ల ప్రాణ, ఆస్తి నష్టాన్ని వీలైనంత మేర తగ్గించేందుకు అధికార యంత్రాంగం సర్వసన్నద్ధంగా ఉండాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

పులివెందులలో ఓటు వేయకుండానే వెనుదిరిగిన జగన్.. రీపోలింగ్ కు డిమాండ్

మొదటి పేజి తరువాయి

ఎన్నికల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. వైసీపీ అధినేత జగన్ తన ఓటు హక్కును వినియోగించుకోకుండానే వెనుదిరిగారు. పులివెందులలో ఎన్నికల ప్రక్రియ అప్రజాస్వామికంగా మారిందని, అధికార టీడీపీ నేతలు యథేచ్ఛగా రిగ్గింగ్, దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. రీపోలింగ్ నిర్వహిస్తేనే తాను ఓటు వేస్తానని స్పష్టం చేశారు. పులివెందులలోని పోలింగ్ కేంద్రానికి వచ్చిన జగన్, అక్కడ నెలకొన్న పరిస్థితులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను ఓటు వేయను. ఒకవేళ నేను ఓటు వేస్తే అంతా సజావుగా సాగుతోందని, అంతా సవ్యంగా ఉందని ప్రజలు అనుకుంటారు. కానీ ఇక్కడ ప్రజాస్వామ్యం ఖూనీ అవుతోంది. పులివెందులలో ఎన్నికలు రద్దు చేసి, రీపోలింగ్ పెడితేనే వచ్చి ఓటేస్తాను. రాష్ట్రంలో ఎలాంటి పరిస్థితులు ఉన్నాయో ప్రజలకు తెలియాలి. ఇవాళ ఓటు పోతుంది.. రేపు మీ ఆస్తులే పోతాయి. ఎన్నికల సంఘం, ఎన్నికల అధికారులు చంద్రబాబు చేతిలో తోలుబొమ్మలు" అని ఆయన విమర్శించారు.

ప్రజాస్వామ్యంపై దాడి జరిగిందన్న జగన్

పులివెందుల నియోజకవర్గ పరిధిలోని దాదాపు 80 పోలింగ్ బూత్‌లకు గాను, 70కి పైగా బూత్‌లలోకి తమ పార్టీ ఏజెంట్లను టీడీపీ కార్యకర్తలు రానివ్వలేదని జగన్ ఆరోపించారు. తెల్లవారుజాము నుంచే టీడీపీ వర్గీయులు బూత్‌లను తమ ఆధీనంలోకి తీసుకున్నారని, ఓటర్లను అడ్డుకుని, ఓటరు స్లిప్పులు లాక్కున్నారని మండిపడ్డారు. కొన్నిచోట్ల ఓటర్లను వెనక్కి పంపి, వారి ఓటు ముందే పడిపోయిందని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో తమ పార్టీ ఏజెంట్ సునందపై దాడి చేయడంతో ఆమె చేతికి గాయమైందని తెలిపారు. ఈ దౌర్జన్యాలపై పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారని, ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నించిన తమ పార్టీ నేతలు, అభ్యర్థులపై లాఠీఛార్జ్ చేశారని జగన్ ఆరోపించారు. ఘటనలను చిత్రీకరిస్తున్న మీడియా ప్రతినిధులపై కూడా దాడులు జరిగాయని విమర్శించారు.

ఆర్వో కార్యాలయం ఎదుట దీక్ష

పోలింగ్ కేంద్రం నుంచి నేరుగా రిటర్నింగ్ అధికారి (ఆర్వో) కార్యాలయానికి చేరుకున్న జగన్, తమ పార్టీకి చెందిన సుమారు 70 మంది పోలింగ్ ఏజెంట్లతో కలిసి అక్కడే బైఠాయించి నిరసన దీక్ష చేపట్టారు. జరిగిన అక్రమాలు, దౌర్జన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బూత్ కబ్జా, రిగ్గింగ్‌కు సంబంధించిన



సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలతో సహా ఆర్వోకు ఆయన లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం పనితీరుపై తీవ్ర విమర్శలు చేశారు. "ఈ ఎన్నికల నిర్వహణ తీరు చూస్తే వ్యవస్థలో సంస్కరణలు ఎంత అవసరమో అర్థమవుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎవరి చేతుల్లో ఉందో అందరికీ తెలుసు" అని వ్యాఖ్యానించారు. తాను ఒక్క పిలుపు ఇచ్చి ఉంటే ఎన్నికలు ఆగిపోయేవని, కానీ ప్రజాస్వామ్య నిబంధనలకు గౌరవం ఇచ్చి సంయమనం పాటించానని అన్నారు. ఈ అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్క అధికారి భవిష్యత్తులో విచారణ ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి అక్రమాలే జరిగాయని వైసీపీ నేతలు ఆరోపించారు.

దూసుకొస్తున్న 'మురసు' – వచ్చే మూడ్రోజులు ఏపీలో భారీ నుంచి అతి భారీ వర్షాలు

మొదటి పేజి తరువాయి



మత్స్యకారులు వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. వచ్చే మూడ్రోజులు దక్షిణకోస్తా, రాయలసీమలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. మరోవైపు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.. ఆదివారం కృష్ణా, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. సోమవారం ఏలూరు, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. తూర్పుగోదావరి, డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. మంగళవారం విశాఖ, అనకాపల్లి, విజయనగరం, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్ కడప, అన్నమయ్య, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అప్రమత్తమైన ప్రభుత్వం : మురసు తుపాను వల్ల రాష్ట్రంలో భారీ వర్షాలు, బలమైన గాలుల హెచ్చరికలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. నవంబర్ 3న బాపట్ల సమీపంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులతో తీవ్ర తుపాను తీరం దాటే అవకాశం ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తుపాను ప్రభావం, వర్షపాతం అంచనాలు, జలాశయాల పరిస్థితి, విద్యుత్ వ్యవస్థపై సమీక్షించారు. ఈ క్రమంలోనే రేపటి ఢిల్లీ పర్యటనను కూడా సీఎం రద్దు చేసుకున్నారు. నవంబర్ 2న దక్షిణ, మధ్య కోస్తా జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, అక్కడక్కడ అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు, ముఖ్యమంత్రికి తెలిపారు. 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, బాపట్ల జిల్లాల్లోని 20 మండలాలకు అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు జారీ చేశారు. నవంబర్ 3న ఏలూరు జిల్లాలో సగటున 179 మిల్లీమీటర్లు, కృష్ణాలో 163, ఎన్టీఆర్‌లో 161, పశ్చిమ గోదావరిలో 147, గుంటూరులో 119, బాపట్లలో 104 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. బుడమేరు వద్ద 32 వేల 500 క్యూసెక్కుల ప్రవాహం రావచ్చని, ఎర్రకాల్వ, గోనెలవాగు, జల్లేరు, పంపా తదితర జలాశయాల్లో భారీ వరదకు అవకాశం ఉందని అంచనా వేశారు. బలమైన గాలుల కారణంగా 12 జిల్లాల్లో 12,102 నుంచి 15,128 వరకు విద్యుత్ స్తంభాలు దెబ్బతినే ప్రమాదం ఉందని ముందస్తు అంచనా వేశారు. మరోవైపు అర్నబ్ తుపాను నష్టం, సహాయక చర్యల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న సీఎం, ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణపై ఆరా తీశారు. ఈ రోజు రాత్రికి అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు సీఎంకు వివరించారు.

సిక్కు అల్లర్ల బాధితుల గాయాలపై కాంగ్రెస్ ఉప్పు జల్లుతోంది

మొదటి పేజి తరువాయి

'కాంగ్రెస్ నాయకులు మాత్రమే సిక్కు హింసాకాండను అలా వర్ణించగలరు'

"1984 నవంబర్ 1న కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టడం వల్ల జరిగిన అల్లర్లలో ఢిల్లీలో వేలాది మంది సిక్కులు దారుణంగా హత్యకు గురయ్యారు. వేలాది మంది సజీవ దహనం అయ్యారు. చాలా మంది సిక్కులు తమ సర్వస్వాన్ని కోల్పోయి పరారయ్యారు. ఎంతో మంది పిల్లలు అనాథలయ్యారు. చాలా మంది మహిళలు వితంతువులయ్యారు. 1984లో జరిగిన సిక్కుల ఊచకోత అనంతరం అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ ఒక ప్రకటన చేశారు. దాన్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను. 'ఒక పెద్ద చెట్టు కూలినప్పుడు భూమి కంపించడం సహజమే' అని రాజీవ్ వ్యాఖ్యానించారు. వేలాది మంది సిక్కుల దారుణ మారణకాండను కాంగ్రెస్ నాయకులు మాత్రమే ఆ విధంగా వర్ణించగలరు."

- అమిత్ షా, కేంద్ర హోం మంత్రి

సిక్కు అల్లర్ల బాధితులకు మేం న్యాయం చేశాం : అమిత్ షా

1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితులకు న్యాయం చేయడానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకున్న చర్యలను అమిత్ షా ప్రస్తావించారు. ఈ అల్లర్లకు కారకులైన కీలక దోషులను తమ సర్కార్ చట్టం ముందు నిలబెట్టిందని అన్నారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సిక్కు వ్యతిరేక అల్లర్లకు పాల్పడిన వారిపై ఉన్న కేసులన్నింటినీ తిరిగి తెరిచిందని గుర్తు చేసుకున్నారు. అలాగే బాధితులకు ఒక్కొక్కరికీ రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించిందని వివరించారు. అంతేకాకుండా ఈ అల్లర్ల విషయంలో



కాంగ్రెస్ పార్టీకి చెందిన కీలక నాయకులను జైలుకు పంపేలా చర్యలు చేపట్టిందని తెలిపారు. ఒక రాజకీయ పార్టీ (కాంగ్రెస్‌నుద్దేశించి) ఇంతటి దారుణమైన అల్లర్లను ప్రేరేపించడం దేశ చరిత్రలో ఎప్పుడూ జరగలేదని మండిపడ్డారు. ఇక ముందు కూడా ఎప్పటికీ జరగకూడదని పేర్కొన్నారు. "1984 నవంబరు 1న సిక్కుల ఊచకోత జరిగిన తేదీలోనే ఢిల్లీలో ఈ ర్యాలీని కాంగ్రెస్ ఎందుకు నిర్వహించాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ తీరు చూడండి : ఒకప్పుడు రాజీవ్ గాంధీ 'ఒక పెద్ద చెట్టు కూలినప్పుడు భూమి కంపించడం సహజమే' అని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆయన కుమారుడు రాహుల్ గాంధీ 1984 నాటి సిక్కు వ్యతిరేక అల్లర్ల బాధితుల గాయాలపై ఉప్పు జల్లినట్లుగా, అదే రోజున ఢిల్లీలో భారీ ర్యాలీని ఏర్పాటు చేశారు. ఈ ర్యాలీ తేదీని మార్చుకోమని కాంగ్రెస్‌ను బీజేపీ కోరింది. అయినప్పటికీ మా అభ్యర్థనను కాంగ్రెస్ పట్టించుకోలేదు. వేలాది సిక్కులను సజీవ దహనం చేసిన అదే రోజున ఈ ర్యాలీని నిర్వహించాలంటూ విదేశాల నుంచి కాంగ్రెస్‌కు ఆదేశాలు వచ్చాయి. సిక్కు గురువుల పుణ్యభూమి అయిన ఇక్కడి నుంచే ఈ నీచమైన ప్రయత్నాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను" అని అమిత్ షా పేర్కొన్నారు.

సోనియా కల ఎప్పటికీ నెరవేరదు : అమిత్ షా సెటైర్లు

సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలో చేపడుతున్న ర్యాలీపైనా షా తీవ్రంగా మండిపడ్డారు. విపక్షాల ప్రతికూల రాజకీయాలు వారిని శాశ్వతంగా అధికారానికి దూరం చేస్తాయని హెచ్చరించారు. అబద్ధాలు చెప్పడం, గందరగోళం సృష్టించడం, నెగిటివిటీని ప్రచారం చేయడం, పార్లమెంట్ కార్యకలాపాలకు ఆటంకం కలిగించడం, పార్లమెంటరీ సమస్యలపై వీధుల్లోకి వచ్చి గొడవ చేయడం ఇదే విపక్షం వైఖరి అయితే మరో ఐదేళ్లపాటు వారు ప్రతిపక్షంలో గడపడానికి సిద్ధంగా ఉండాలని ఎద్దేవా చేశారు. తన కుమారుడు రాహుల్ ప్రధాని కావాలన్న సోనియా గాంధీ కల నెరవేరదన్నారు. "ఢిల్లీలోని వ్యాపారులు పండగ సీజన్‌లో ర్యాలీ వద్దని రాహుల్ గాంధీని కోరారు. ఏడాదిలో కేవలం ఒక్క వారంలోనే తమకు అత్యధిక వ్యాపారం జరుగుతుందని విన్నవించుకున్నారు. ఈ సీజన్‌లో ర్యాలీ వల్ల తాము నష్టపోతామని వాపోయారు. వ్యాపారులు ఒకసారి కాదు, మూడుసార్లు విలేకరుల సమావేశాలు నిర్వహించారు. రాహుల్, సోనియాకు లేఖలు రాశారు. దీపావళి పండగ తర్వాత ఈ ర్యాలీని నిర్వహించమని కోరారు. కానీ కాంగ్రెస్ వినలేదు. సిక్కుల ఊచకోత జరిగిన రోజే ర్యాలీ నిర్వహించారు. ఢిల్లీలోని వ్యాపార వర్గాలు ఓట్ల రూపంలో కాంగ్రెస్‌కు గట్టి బుద్ధి చెబుతాయి. నరేంద్ర మోదీ దేశాన్ని అసాధారణ వేగంతో ముందుకు నడిపిస్తున్నారు. ఆర్టికల్ 370, ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశారు. దేశంలో నక్సలిజాన్ని అంతం చేశారు. 2029 డిసెంబర్ 31 నాటికి పంజాబ్‌తో సహా యావత్ దేశాన్ని డ్రగ్స్ ముప్పు నుంచి విముక్తి చేస్తాం" అని అమిత్ షా ప్రకటించారు.

జ్ఞానేశ్ కచ్చితంగా జైలుకే- ఆయన లేకుంటే మోదీ, షాకు పదవులే లేవు!

మొదటి పేజి తరువాయి

యువత, రైతులు, కార్మికులు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని ముక్తకంఠంతో చాటుతున్నారని రాహుల్ పేర్కొన్నారు. తన మతం గురించి అడిగితే, దేశ ప్రజల గొంతుకను వినిపించడమే తన మతమని చెప్పారు. ఎంత డబ్బు, పలుకుబడి ఉన్నా రాజ్యాంగం కంటే ఎవరూ గొప్పవారు కాదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. దేశంలో కొన్నేళ్లుగా ఓట్ల చోరీ జరుగుతోందని ఆరోపించారు. "నా మాట వినండి. నేను చెప్పింది ఎప్పుడూ నిజమవుతుంది, కాదా? నేను భారతదేశంలోని ప్రతి పౌరుడికి, ప్రతి యువకుడికి చెబుతున్నాను. జ్ఞానేశ్ కుమార్‌ను ప్రధాన ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తొలగిస్తారు. జ్ఞానేశ్ కుమార్ జైలుకు వెళ్తారు. జ్ఞానేశ్ కుమార్ లేకుండా నరేంద్ర మోదీ ప్రధాని అయ్యేవారు కాదు, అమిత్ షా హోం మంత్రి అయ్యేవారు కాదు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్‌కుమార్ కలిసి భారీ కుట్రకు పాల్పడ్డారు. వీరు ముగ్గురు కలిసి భారతదేశ ఆత్మ, రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడి చేశారు. జ్ఞానేశ్‌కుమార్ దిగిపోవాలని దేశమంతా పోరాడుతోంది. జ్ఞానేశ్‌కుమార్ చేసిన నేరం ఆయన్ని నిద్ర పోనివ్వట్లేదు. నా దృష్టిలో ప్రతి భారతీయుడి గళం మతం కంటే గొప్పది. మేము మోదీ, అమిత్



షాకు గానీ శత్రువులం కాదు. మోదీ, అమిత్ షా చేస్తున్న ఓటు చోరీపైనే మా పోరాటం. దేశం తిరిగి గాడిలో పడాలంటే జ్ఞానేశ్‌కుమార్ తొలగింపే తొలి అడుగు."

పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా?: రాహుల్‌గాంధీ

రైతులు, యువత, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. వారి హక్కులను నిరాకరిస్తున్నారని, దేశ సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఆరోపించారు. "పన్నెండేళ్లుగా దేశంలో ఏ వర్గానికైనా మేలు జరిగిందా? యువతకు ఉద్యోగాలు లేవు, రైతులకు ఆదాయం లేదు. అదానీకి అమ్మానీ వస్తే చాలన్నట్లుగా మోదీ పాలన ఉంది. టెలికాం, పోర్టులు, బ్యాంకులు అన్నింటినీ అదానీ చేతిలో పెట్టారు. మోదీ, అమిత్ షా కలిసి దేశాన్ని అదానీకి అమ్ముతున్నారు. కేవలం ఇద్దరు ముగ్గురు వృద్ధి చెంది, మొత్తం వ్యవస్థను తమ ఆధీనంలోకి ఉంచుకునే దేశం మనకొద్దు." అని రాహుల్ గాంధీ అన్నారు.

హిందుస్థాన్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది: రాహుల్‌గాంధీ

ఈవీఎంలు ద్వారా, ఓటర్ల జాబితాలో మార్పుల ద్వారా ఓట్లను తారుమారు చేశారని రాహుల్ పేర్కొంటూ, అనేక అసెంబ్లీ ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలలో ఓట్ల దొంగతనం జరిగిందని ఆరోపించారు. "హిందుస్థాన్‌లో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. కొన్నేళ్లుగా దేశంలో ఓటుచోరీ జరుగుతోంది. ఓటుచోరీ, ఈవీఎంల చోరీతోనే బీజేపీ విజయం సాధించింది. బంగాల్, మధ్యప్రదేశ్, హరియాణాలో ఓటుచోరీతోనే బీజేపీ గెలిచింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలో ఓటు చోరీ చేసి గెలిచారు. సర్ పేరిట దేశంలో ఏకంగా 13.5 కోట్ల ఓట్లు తొలగించారు. 2024 ఎన్నికల ముందు ఏకంగా 15 శాతం మంది ఓట్లు తొలగించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ-యూపీఏ మధ్య ఓట్ల అంతరం 3 శాతం మాత్రమే. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్‌ను అడ్డుపెట్టుకుని ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ చేసిన నేరం చిన్నది కాదు. దేశ ప్రజలకు ఓటు హక్కు లేకుండా చేశారు. ఓటు ద్వారా ప్రజలు తమ అభిప్రాయం చెప్పే అవకాశం లేకుండా చేశారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

సంపాదకీయం

ఈ బంగారు తల్లులు ఎందరికో స్ఫూర్తి

ఇటీవల జపాన్‌లోని ఐచీ నగోయాలో అట్టహాసంగా ముగిసిన ఆసియా క్రీడల్లో భారత్ అత్యద్భుతమైన ప్రదర్శన కనబర్చింది. భారత క్రీడాకారులు 21 బంగారు పతకాలు సహా మొత్తం 85 పతకాలు సాధించి 140 కోట్ల మంది భారతీయులు గర్వపడేలా చేశారు. 2022లో చైనాలో జరిగిన ఆసియా క్రీడల్లో సత్తా చాటినట్లుగానే, ఈసారి జపాన్ ఏషియాడ్‌లోనూ మనవాళ్లు అదరగొట్టారు. గత దశాబ్దకాలంగా భారతదేశంలో క్రీడాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, అందిస్తున్న ప్రోత్సాహం కారణంగా మన క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై నిలకడ ప్రదర్శన కనబరుస్తున్నారు. 1982లో ఢిల్లీ వేదికగా జరిగిన ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకున్న భారత మహిళల హాకీ జట్టు.. 44 ఏళ్ల తర్వాత ఈ ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలుచుకుంది. 17 ఏళ్ల కుముద్ మహోద్.. ఆర్చరీ మహిళల విభాగంలో స్వర్ణం గెలుచుకుని.. 1998 నుంచి ఆసియా క్రీడల్లో ఆర్చరీలో కొరియా మహిళల ఆధిపత్యానికి చెక్ పెట్టారు. తెలంగాణలోని పెద్దపల్లి జిల్లా సుల్తాన్‌పూర్ అనే చిన్న గ్రామం నుంచి వచ్చిన చికిత తానిపర్తి.. కాంపౌండ్ ఆర్చరీలో బంగారు పతకాన్ని గెలుచుకోవడం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. ఆ కుటుంబం పడిన శ్రమకు, చేసిన త్యాగాలకు ఈ విజయం గొప్ప బహుమానం. అద్భుతమైన టాలెంట్ ఉన్న చికిత.. హరియాణాలోని సోనిపత్‌లో ఉన్న స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 'నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'లో చేరి, కోచ్ వివేక్ కుమార్ ప్రోత్సాహంతో ఎంతో సాధన చేశారు. దీని ఫలితంగానే ఇవాళ ఆసియాడ్ ఆర్చరీలో భారత్ ఖాతాలో స్వర్ణం చేరింది. ఇదే విభాగం నుంచి విజయవాడ అమ్మాయి జ్యోతి సురేఖ స్వర్ణం సాధించి మరెందరికో ఆదర్శంగా నిలిచారు. ఇక, 400 మీటర్ల హర్డిల్స్ పరుగులో విథియా రామరాజ్ 42 ఏళ్ల నేషనల్ రికార్డును బద్దలు కొట్టారు. 1984 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో పీటీ ఉష రికార్డును అధిగమించారు. ఇలాంటి ఎన్నో కుటుంబాల కృషి ఫలితమే ఇవాళ మెరికల్లాంటి క్రీడాకారులు అంతర్జాతీయ వేదికలపై మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడిస్తున్నారు. మనందరం గర్వపడేలా చేస్తున్నారు. భారత్ సాధించిన 21 బంగారు పతకాల్లో సగం పతకాలను మహిళలే సాధించారు. వీరేమీ సకల సౌకర్యాలున్న నేపథ్యం నుంచో, బాగా డబ్బున్న కుటుంబాల నుంచో రాలేదు. వీరిలో ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి.. వారి పరిస్థితులు సహకరించకపోయినా.. కష్టనష్టాలకు ఓర్చి ప్రభుత్వ సహకారాన్ని అందిపుచ్చుకుని వీరికి క్రీడల్లో శిక్షణ అందించారు. క్రీడాకారుల కృషికి.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం.. ఖేలో ఇండియా, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ , టార్గెట్ ఏషియన్ గేమ్స్ గ్రూప్ వంటి పథకాల ద్వారా అండగా నిలిచింది. ఖేలో పథకంలో భాగంగా వారికి జాతీయ కోచింగ్ క్యాంపుల్లో శిక్షణ, అంతర్జాతీయ స్థాయి ట్రైనింగ్ సెషన్స్‌తో పాటు విదేశాల్లోనూ శిక్షణ అందిస్తోంది. అవసరమైనచోట విదేశీ నిపుణులను, కోచ్‌లను, సపోర్టింగ్ స్టాఫ్‌ను నియమిస్తోంది. అవసరమైన క్రీడాసామగ్రిని, శిక్షణ వసతులను సమకూర్చుతోంది. అంతేకాదు, ఖేలో ఇండియా పథకం ద్వారా 2,786 మంది క్రీడాకారులను వెన్నంటి ప్రోత్సహిస్తోంది. ఈ ఆసియా క్రీడల్లో మన మహిళా క్రీడాకారులు.. ఆర్చరీ, హాకీ, క్రికెట్, అథ్లెటిక్స్‌లోనే కాకుండా అనేక క్రీడల్లో తమ సత్తా చాటారు. గోల్ఫ్‌లో ప్రణవి ఉర్స్, బాక్సింగ్‌లో పర్వీన్ హుడా, లవ్లీనా బోర్గోహైన్, షూటింగ్‌లో నీరూ ధాండాతో పాటు టీం, మిక్స్‌డ్ ఈవెంట్లలోనూ మహిళా క్రీడాకారులు అద్భుతంగా రాణించారు. దేశ ప్రాధాన్యతాంశాల్లో స్పోర్ట్స్‌కు కూడా కేంద్రం పెద్దపీట వేసింది. తాజా ఆసియాడ్ ఫలితాల నేపథ్యంలో మరింత ఉత్సాహంతో ముందడుగేయనుంది. అంతర్జాతీయ క్రీడల్లో మన ఆటగాళ్లు మెరుగైన ఫలితాలు సాధించేందుకు నిరంతరం అండగా నిలబడుతూనే ఉంటుంది. అహ్మదాబాద్‌లో 2030లో కామన్‌వెల్త్ గేమ్స్ జరగనున్నాయి. అలాగే 2036 ఒలింపిక్స్ క్రీడలను భారత్‌లో నిర్వహించాలన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ కల నెరవేరే దిశగా వడివడిగా అడుగులు పడుతున్నాయి. ఒలింపిక్స్ నిర్వహణ కోసం భారత్‌తో పాటుగా మరో 6 దేశాల బిడ్స్‌ను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ ఒలింపిక్స్ సంఘం స్పష్టం చేసింది. కాగా, రానున్న ఒలింపిక్ క్రీడల్లో, అంతర్జాతీయ పోటీల్లో సాధ్యమైనన్ని ఎక్కువ ఈవెంట్లలో మన క్రీడాకారులు పాల్గొనాలని 80వ స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఎర్రకోట వేదికగా ప్రధానమంత్రి మోదీ సూచించారు. ఒలింపిక్ క్రీడల్లో దాదాపు 40 స్పోర్ట్స్, దాదాపు 325 ఈవెంట్లు ఉంటే, ఇందులో కనీసం మూడింట రెండొంతుల ఈవెంట్లలో కూడా భారతదేశం పాల్గొనలేకపోతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొన్నింటిలో కనీసం అర్హత కూడా సాధించలేకపోతున్నామన్నారు. 2036 నాటికి అన్ని క్రీడాంశాలపై దృష్టి సారించాలని యువతకు మోదీ పిలుపునిచ్చారు. దీంతో ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారి సామర్థ్యాలకు సానబెట్టి 2036 ఒలింపిక్స్‌లో భారతదేశం వీలైనన్ని ఎక్కువ పతకాలను సాధించే దిశగా.. క్రీడామంత్రిత్వ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ప్రపంచ క్రీడాపటంలో భారత్ అగ్రస్థానంలో నిలవాలంటే.. అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడం, వారికి మెరుగైన శిక్షణ అందించడం, శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించడం అవసరం. ఇందుకోసం అన్ని వ్యవస్థల సమన్వయంతో క్రమబద్ధంగా ముందుకు సాగాలి. క్రీడలు, యువజన వ్యవహారాలకు కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ గత 12 ఏళ్లలో దాదాపు 4 రెట్లు పెరిగింది. 201314లో రూ.1,219 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.4,480 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.

హేయ నేరాల వెనుక... బలహీన బంధాలు!



సమాజ వికాసానికి శాంతిభద్రతలు ఎంత ముఖ్యమో, కుటుంబ వ్యవస్థ అందించే నైతిక విలువలూ అంతే కీలకం. సాంకేతికంగా పురోగమిస్తున్న నేటి కాలంలో, మనిషిని సన్మార్గంలో నడిపించేవి కుటుంబ బంధాలే. చట్టం బాధితులకు న్యాయం చేకూర్చగలదు కానీ, వ్యక్తిలో అసలు నేర ప్రవృత్తే కలగకుండా నిలువరించే సహజ రక్షాకవచం మాత్రం కుటుంబమే. ప్రస్తుతం నమోదవుతున్న నేరాల మూలాలను విశ్లేషిస్తే- ఇది చట్టవ్యతిరేక చర్యల సమస్య మాత్రమే కాదనీ, వేగంగా చెదిరిపోతున్న కుటుంబ వ్యవస్థ వల్ల జరుగుతున్న సామాజిక విచ్ఛేదన(సోషల్ డిసింటిగ్రేషన్) అనీ అర్థమవుతోంది. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వెలుగుచూసిన ఓ ఉదంతంలో, పదిహేనేళ్ల బాలిక ఇన్‌స్టాగ్రామ్ పరిచయస్తుడి వలలో పడి, అర్ధరాత్రి ఇల్లుదాటి బయటికి వెళ్లింది. తర్వాత తీవ్రంగా మోసపోయి, బ్లాక్‌మెయిల్‌కూ గురైంది. తల్లిదండ్రులు ఆ విషయాన్ని పసిగట్టలేకపోయారంటే, కుటుంబ సభ్యుల మధ్య మాటలు ఎంతగా తగ్గిపోయాయో అర్థం చేసుకోవచ్చు. మరో ఘటనలో, సోషల్ మీడియా వేధింపులు తాళలేక ఇద్దరు టీనేజ్ బాలికలు ఓ యువకుణ్ని దూరం పెట్టారు. దాంతో అతడు వారి పేర్లతో నకిలీ ఖాతాలను సృష్టించి అసభ్య చిత్రాలతో బెదిరింపులకు దిగాడు. అంతకంటే దిగ్భ్రాంతికరం- కొడుకు తప్పును సరిదిద్దాల్సిన తల్లే ఆ అకృత్యాలకు వంతపాడుతూ, బాధితురాళ్లను బెదిరించి వసూళ్లకు పాల్పడటం! నల్గొండ జిల్లాలో ఇద్దరు టెన్త్ విద్యార్థులు ప్రిన్సిపల్‌ను హతమార్చిన ఘటన సమాజాన్ని నివ్వెరపరిచింది. ఈ మూడు నేరాలు వేర్వేరుగా కనిపిస్తున్నా, వాటి ప్రధాన మూలకారణం మాత్రం కుటుంబ వ్యవస్థ వైఫల్యమే!

నేర్చుకోవాల్సింది ఇంట్లోనే...

భారతీయ సంస్కృతికి వెన్నెముకగా నిలిచిన ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కేవలం రక్తసంబంధీకుల కలయికే కాదు; అదొక పటిష్ఠ సామాజిక భద్రతా వలయం, నైతిక విలువల పాఠశాల. 1960-70 దశకంలో దేశంలో దాదాపు సగం ఉమ్మడి కుటుంబాలే ఉండేవి. సెన్సస్, జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లెక్కల ప్రకారం, నేడు 70శాతానికి పైగా చిన్న కుటుంబాలే. నగరాల్లోనైతే ఇవి 80శాతం దాటాయి. 1.3కోట్లకు పైగా కుటుంబాలు సింగిల్ పేరెంట్ సంరక్షణలో ఉన్నాయి. పని ఒత్తిడి వల్ల పిల్లలకు తగినంత సమయం కేటాయించలేక పోతున్నామనే భావనతో కొందరు తల్లిదండ్రులు వారు కోరిన వస్తువులతో పాటు పెద్దమొత్తంలో డబ్బులు ఇస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియా విస్తృతితో పిల్లల పెంపకంలో ప్రమాదకర ధోరణి మొదలైంది. తల్లిదండ్రులు తమ పనుల్లో బిజీగా ఉంటూ, ఏడాది వయసు పసికందుల చేతికీ ఫోన్ ఇస్తున్నారు. తిండి తినిపించేటప్పుడు, ఏడుపు ఆపించడానికి రీల్స్, వీడియోలు చూపిస్తున్నారు. దాంతో చాలా చిన్నవయసులోనే వారు స్క్రీన్లకు అలవాటు పడుతున్నారు. నగరాల్లోని పిల్లలు సగటున రోజుకు 3-5 గంటలు ఫోన్లతో గడుపుతుంటే, తల్లిదండ్రులతో మాట్లాడే సమయం అరగంట కంటే తక్కువకు పడిపోయింది. పర్యవసానంగా కుటుంబాల్లో ఆప్యాయత కరవై, భావోద్వేగ శూన్యత ఏర్పడుతోంది. అదే యువతను గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వంటి మత్తుపదార్థాల వైపు నెడుతోంది. మరోవైపు, కుటుంబంలో తలెత్తే కలతలు తీవ్ర నైరాశ్యానికి దారితీస్తున్నాయి. దేశీయంగా నమోదవుతున్న ఆత్మహత్యల్లో సుమారు 33శాతం కుటుంబ కలహాలు, బంధాల వైఫల్యం వల్లే సంభవిస్తున్నట్లు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. ఇంట్లో సరైన మార్గదర్శకత్వం కరవై, పిల్లలు సులభంగా అసాంఘిక శక్తుల ఉచ్చులో పడుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం మైనర్ల నేరాలు చిన్నపాటి దొంగతనాలు, తోటిపిల్లలతో ఘర్షణలకే పరిమితమయ్యేవి. నేడు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బాలల్లో 75-80శాతం మంది 16-18 ఏళ్లవారే! పైగా వారి నేర స్వభావం హత్యలు, అత్యాచారాలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ రవాణా అంతటి తీవ్రస్థాయిలో ఉంటోంది. బాల నేరస్థుల్లో 80శాతానికి పైగా సరైన నిఘా లేని పరిస్థితులు, నిరంతర గృహహింసల నేపథ్యం నుంచి వచ్చినవారే కావడం కుటుంబ వాతావరణ ప్రాధాన్యాన్ని స్పష్టం చేస్తోంది.సోషల్ మీడియా ప్రభావంతో, కష్టపడకుండా రాత్రికి రాత్రే సంపాదించాలనే వ్యామోహంలో యువత ఆన్‌లైన్ బెట్టింగ్, సైబర్ మోసాల ఊబిలో కూరుకుపోతోంది. చెమటోడ్చని సంపాదన క్షణికమని పెద్దలు నేర్పకపోవడం వల్లే ఈ దుస్థితి. మహిళలను గౌరవించే సంస్కృతి చట్టాల ద్వారా బలవంతంగా రుద్దేది కాదు; ఇంట్లో తండ్రి తల్లిని గౌరవించే విధానం చూసి కొడుకు నేర్చుకోవాలి. ఎదుటివ్యక్తి చెప్పే 'నో'ను హుందాగా స్వీకరించే మానసిక పరిపక్వతను చిన్ననాటి నుంచే అలవర్చాలి. తమను పెంచిన వృద్ధ తల్లిదండ్రులను భారంగా భావించి రోడ్డున పడేయడం 'నైతిక దారిద్ర్యానికి' నిదర్శనం. పెద్దలను ఆదరించే సంస్కృతిని చూసి పెరిగిన పిల్లలు ఎన్నటికీ నేరాలవైపు వెళ్లరు.

ప్రకృతి సాహచర్యం.. సమష్టి బాధ్యత

పరీక్షల భయం, దండనలు లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే సమ్మర్‌హిల్ విద్యా విధానం, పని-కుటుంబ సమతుల్యతతో ప్రకృతి ఒడిలో పెంపకాన్ని అందించే స్కాండినేవియన్ జీవనశైలి, రస్కిన్ బాండ్ చిన్నారుల సాహిత్యం నేడు మనకు ఆదర్శం కావాలి. పిల్లలను నాలుగు గోడలు, డిజిటల్ తెరల నుంచి బయటికి తీసుకురావాలి. మొబైల్ సిగ్నల్స్ లేని ప్రకృతి ఒడిలోకి, పల్లెలకు, నదీతీరాలకు వీకెండ్ పిక్నిక్‌లు, విహార యాత్రలకు తీసుకెళ్లాలి. కనీసం రాత్రిపూట భోజన సమయాన్నయినా నో-గ్యాడ్జెట్ జోన్‌గా మార్చి పిల్లలతో మనసు విప్పి మాట్లాడాలి. శ్రమ విలువను, జవాబుదారీతనాన్ని నేర్పాలి. పాఠశాలల్లో పేరెంట్-టీచర్ సమావేశాలు మార్కులకే పరిమితం కాకుండా ప్రవర్తనను సమీక్షించే వేదికలు కావాలి. బిడ్డల భవిష్యత్తు కోసం ఆస్తులు కూడబెట్టడం కంటే, పిల్లలను సమాజ ఆస్తిగా తీర్చిదిద్దడమే తల్లిదండ్రుల అసలైన కర్తవ్యం. చట్టం శిక్షించడానికంటే ముందే కుటుంబం సంస్కరించగలగాలి. కుటుంబం అందించే ప్రేమానురాగాలు, గురువులు నేర్పే సంస్కారం, పోలీసులు అందించే రక్షణ... ఈ మూడూ సమన్వయంతో సాగినప్పుడే నేర రహిత సమాజం సాకారమవుతుంది.

వివాహంపై వ్యంగ్యాస్త్రం మొద రాత్రి..



తెలుగు సినిమాల్లో ఒకప్పుడు హాస్యం, వ్యంగ్యం కథలో భాగంగా సహజంగా ఉండేవి. ఇప్పుడు వాటి స్థానంలో ద్వంద్వార్థాలు, శరీరాకృతిలైంగికత ఆధారిత చమత్కారాలు, అవమానపరిచే సంభాషణలు, బూతు జోకులు పెరిగిపోయాయి. నిజానికి హాస్యం అనేది కేవలం నవ్వించడం కాదు. అది మనిషి బలహీనతను ప్రేమగా చూపిస్తుంది. సమాజంలో వున్న వైరుధ్యాలను ఎత్తిచూపిస్తుంది. అందుకే ఆ హాస్యం సినిమా చూసి బయటకు వచ్చిన తర్వాత కూడా మన జ్ఞాపకాల్లో నిలిచిపోయేది. ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. కానీ రాజా కరుప్పుసామి దర్శకత్వంలో మొదటి సినిమాగా వచ్చిన తమిళ చిత్రం 'మొద రాత్రి' గ్రామీణ నేపథ్యంలో సాగే హాస్యభరిత కుటుంబ కథ. పాత తెలుగు సినిమాల్లో హాస్యానికి ఒక గొప్ప స్థానం ఉంది. రేలంగి, రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, రాజబాబు, సుత్తివేలు, బ్రహ్మానందం, ఎం.ఎస్. నారాయణ వంటి నటుల హాస్యంలో కేవలం మాటల గారడీ కాకుండా పాత్ర స్వభావం నుంచే హాస్యం పుట్టేది. సంభాషణలోని చమత్కారం ప్రేక్షకుడిని నవ్వించేది. కొన్నిసార్లు ఒక చూపు, ఒక విరామం, ఒక హావభావమే పెద్ద జోక్‌గా మారేది. ఇప్పుడు పరిస్థితి మారింది. చాలా సినిమాల్లో హాస్యాన్ని ఒక కామెడీ ట్రాక్‌గా మార్చేసారు.. అక్కడే హాస్యం 'కుళ్లు జోక్' వైపు దారితీస్తున్నది. హాస్యం సంగతే అట్లా వుంటే ఇక వ్యగ్యం అనేది కరువే అయిపోయింది. నిజమైన హాస్యానికి తెలివి సున్నితత్వం అవసరం. కుళ్లు జోక్‌కు కేవలం సంకేతం చాలు..

కథేంటంటే..?

విదేశాల్లో పనిచేసే మారుతి (రిషికాంత్)కి తెలియ కుండానే తన కుటుంబం పెళ్లి ఏర్పాట్లు చేస్తుంటుంది. మరోవైపు పెళ్లి కూతురు బుజ్జి తనకు ఇష్టమయిన నచ్చిన వ్యక్తితో వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటుంది. కానీ అనూ హ్య పరిణామాల మధ్య ఇద్దరికీ పెళ్లి జరుగుతుంది. దీంతో అసలు కథ అక్కడి నుంచే మొదలవుతుంది. పెళ్లి తర్వాత కొత్త దంపతుల జీవితానికి ఆరంభం కావాల్సిన మొదటి రాత్రి అనేక రహస్యాలు, అబద్ధాలు, అపార్థాలు, ఊహించని సంఘటనలతో గందరగోళంగా మారుతుంది. ఆ ఒక్క రాత్రిలో జరిగే పరిణామాలు వారి జీవితాలను మాత్రమే కాదు, చుట్టుపక్కల ఉన్న కుటుంబ సంబంధాలను కూడా ప్రభావితం చేస్తాయి.

శృంగారానికి పరిమితం చేయకుండా..

మొద రాత్రి అనే పేరు వినగానే మన ఊహ ఒక పడకగది వైపు పరుగెడుతుంది. కానీ దర్శకుడు రాజా కరుప్పుసామి ఆ గదిని శృంగారానికి మాత్రమే పరిమితం చేయలేదు. ఇద్దరు మనుషులు తమ జీవితాల గురించి తమతో తాము మాట్లాడుకోవడం మొదలుపెట్టిన వేళ ఆ రాత్రి మొదలవుతుంది. మారుతి, బుజ్జి ఇద్దరికీ ఈ పెళ్లి మీద ఆసక్తి లేదు. అయినా కుటుంబం, సంప్రదాయం, సామాజిక ఒత్తిడి వారిని వివాహ బంధంలోకి నెట్టేస్తాయి. వివాహానికి ముందు ఒకరినొకరు తెలుసుకునే అవకాశం ఇద్దరికీ లేదు.. ఇలాంటి అరేంజ్డ్ మ్యారేజ్ వ్యవస్థలో పెద్దలు పిల్లలను ఎప్పుడూ పిల్లలుగానే చూస్తారు.. కానీ పెళ్లి సమయానికి ఒక్కసారిగా వారిని 'బాధ్యతగల పెద్దలు'గా భావిస్తారు. ఈ విరోధాభాసాన్ని సినిమా హాస్యంతో పట్టు కుంది. ఇక్కడ దర్శకుడు ఒక ఆసక్తికరమైన వ్యంగ్యాన్ని సృష్టించాడు. సాధారణమైన పెళ్లి కథను గ్రామీణ జీవన వాతావరణం, సహజమైన హాస్యం, కుటుంబ సంబంధాలు, మానవ స్వభావంలోని చిన్నచిన్న బలహీనతలతో ఆసక్తికరంగా చెప్పడం మొద రాత్రి ప్రత్యేకత. తొలి చిత్రంతోనే రాజా కరుప్పుసామి కథను సహజంగా, వినోదాత్మకంగా నడిపించగల దర్శకుడిగా గుర్తింపు పొందారు..

పురుషులపై ఉండే ఒత్తిడిని చూపిస్తుంది!

ఈ సినిమా కేవలం స్త్రీలపై ఉండే పితృస్వామ్య ఒత్తిడిని మాత్రమే కాదు పురుషులపై సమాజం మోపే ఒత్తిడినీ చూపుతుంది. అతను డబ్బు సంపాదించాలి. కుటుంబాన్ని పోషించాలి. బలంగా కనిపించాలి. ఫెయిల్ అవ్వకూడదు. ఇలాంటి స్థితిలో పురుషులు కూడా నటించాల్సి వస్తుంది. అదంతా అట్లా వుంటే ఈ సినిమా కథలో గ్రామ దేవత దాని పూజారి పాత్ర కూడా ప్రధానమైన బాధ్యతాయుతమైన పాత్రను పోషిస్తుంది. గతంలో తన ప్రేమలో విఫలమయిన మారుతి, మరోవైపు బుజ్జీ తను ప్రేమించిన యువకుడిలోని చొరవ లేనితనం బలహీనతల నేపథ్యంలో అతన్ని కలుసుకోలేని స్థితి. మొత్తంగా ఇద్దరూ పారిపోదామని ప్రయత్నం చేస్తారు.. బుజ్జికి మారుతి సంపూర్ణంగా సహకరిస్తానని బయలు దేరతాడు. అప్పుడు మొదటి రాత్రికోసం కొన్న మంచం వస్తుంది. దాన్ని చూసి దంపతులు ఇద్దరూ నవ్వుకోవడంతో సినిమా ముగుస్తుంది. "వివాహం కొనసాగాలా వద్దా? అనే నిర్ణయం చివరికి ఆ ఇద్దరు వ్యక్తులదే" అనే భావనను సినిమా మన ముందుకు తెస్తుంది.

హీరోయిన్‌కే ప్రాధాన్యం..

ఈ సినిమాలో పెళ్లి జరిగిన ఇల్లు కేవలం ఒక వేదికనో నేపథ్యమో కాదు.. అది ఒక చిన్న భారతదేశం అనే చెప్పాలి. ఆ ఇంట్లో కులం, కుటుంబ గౌరవం, ఆర్థిక స్థాయి, పురుషా ధిక్యత, ఆడపిల్ల జీవితంపై పెద్దల నిర్ణయాధికారం, ప్రేమపై అనుమానం, సంప్రదాయం పేరుతో వ్యక్తిగత స్వేచ్ఛకు సంకెళ్లు ఇవన్నీ ఉన్నాయి.. ఆ ఇంట్లో అందరూ నవ్వుతారు. అందరూ బిగ్గరగా మాట్లాడుతారు. అందరూ కలిసి పెళ్లి జరిపిస్తారు. కానీ పెళ్లి చేసుకుంటున్న యువతీ యువకుల మనసుల్లో ఏముందో ఎవరూ అడగరు. ఈ మొత్తం కథలో అంతర్లీన వ్యంగ్యమే మొద రాత్రికి సామాజిక దృష్టి కోణాన్ని ఇస్తుంది. ఈ సినిమాలో బుజ్జి పాత్రకు ప్రత్యేకమైన ప్రాధాన్యం ఉంది. ఆమె కేవలం పెళ్లి చేసుకున్న అమ్మాయి కాదు. తన గతం, తన ప్రేమ, తన నిర్ణయాల మధ్య చిక్కుకున్న ఒక యువతి. సినిమాలో స్త్రీ పాత్రలకు పురుష పాత్రల కంటే ఎక్కువ అంతరంగాలున్నాయి.. ఆ అమ్మాయి ముఖంలో కనిపించే చిరునవ్వు కూడా నిజమైన ఆనందం కాదు.. ఆ నవ్వు తాను కోరుకున్నది కాదు కుటుంబం అంతా కోరింది. ఈ అంశాన్ని సినిమా చాలా సున్నితంగా ఆవిష్కరిస్తుంది.

మరో పోరుకు నాంది పలుకుదాం



దీంతో అభివృద్ధి, సంక్షేమం పర్యవేక్షణలో ఇబ్బందులు ఏర్పడేవి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ ప్రభుత్వం 2016 అక్టోబర్‌లో ప్రజల ముంగిట పాలన ఉండాలని నిర్ణయం తీసుకుని పరిపాలన వికేంద్రీకరణలో భాగంగా 10 ఉమ్మడి జిల్లాలను 33 జిల్లాలుగా విభజించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా రూ.3.50 కోట్ల, పరిపాలనా సౌలభ్యంతోపాటు, అభివృద్ధి, సంక్షేమం, నిరంతర పర్యవేక్షణ కోసం ప్రభుత్వం కొత్తగా 23 జిల్లాలు ఏర్పాటు చేయడం పరిపాలనా విప్లవం. తెలంగాణలో జిల్లాల సంఖ్య పెంచడం ద్వారా అదనంగా కేంద్ర ప్రభుత్వం నుంచి విద్యా సంస్థలు, ఇతర ప్రయోజనాలు పొందే అవకాశం ఉంటుంది. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా ఉండేందుకు వీలవుతుంది. ప్రజల ముంగిట పాలన ఉంటే పారదర్శక పరిపాలన సాధ్యమవుతుందని విశ్వసించి కేసీఆర్ ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడం వల్ల ఫలితాలు స్పష్టంగా కనిపించాయి. జిల్లాల ఏర్పాటు తర్వాత తీసుకున్న మరో గొప్ప నిర్ణయం జోనల్ వ్యవస్థ పునర్వ్యవస్థీకరణ, ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న రెండు జోన్‌లను ఏడు జోన్‌లుగా, 2 మల్టీజోన్లుగా విభజించి గతంలో ఉన్న రిజర్వేషన్ పద్ధతిని తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మార్చారు. దేశంలోనే తొలిసారిగా స్థానిక రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. గతంలో ఉన్న 85%, 70%, శాతం రిజర్వేషన్లు 95% శాతం తెలంగాణ ప్రజలకు దక్కేవిధంగా రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా ఆమోదం తీసుకురావడం కేసీఆర్‌కు మాత్రమే సాధ్యమైంది. జిల్లా స్థాయి పోస్టుల్లో జిల్లా యువకులకు దక్కే అవకాశం వచ్చింది. గ్రూప్-1 ఉద్యోగాలు కూడా స్థానికులకు దక్కే అవకాశాలు ఎక్కువగా వచ్చాయి. జిల్లా కేంద్రాల్లో కార్యాలయాల ఏర్పాటు, రెవెన్యూ డివిజన్, మండలాలు ఏర్పాటు వలన ప్రజలకు పరిపాలన అందుబాటులోకి రావడం రాష్ట్ర ఏర్పాటుతోనే సాధ్యమైంది. కొత్తగా 153 మండలాలు, 35 రెవెన్యూ డివిజన్లు, 8 మున్సిపల్ కార్పొరేషన్లు, 87 మున్సిపాలిటీలు, 4,914 గ్రామ పంచాయతీలు ఏర్పాటయ్యాయి. పరిపాలన సంస్కరణలు తెలంగాణ సత్వర అభివృద్ధికి గొప్ప చోదకశక్తిగా మారాయి. 'సంపద పెంచుదాం.. ప్రజలకు పంచుదాం' అనే నినాదంతో కేసీఆర్ పాలనలో తెలంగాణ రాష్ట్రం స్వర్ణయుగాన్ని ఆవిష్కరించింది. 2014లో తలసరి ఆదాయం రూ.1,24,104 నుంచి రూ.3,17,115 లకు పెరిగింది. రాష్ట్ర జీఎస్‌డీపీ విలువ రూ.5,05,848 నుంచి రూ.12,93,469 కోట్లకు పెరుగడం పరిపాలనా సంస్కరణల ఫలితం. విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్ల నుంచి జూన్ 23 వరకు 19,464 మెగావాట్లకు పెరిగింది. తలసరి విద్యుత్తు వినియోగం 1,356 యూనిట్ల నుంచి 2,140 యూనిట్లకు పెరిగింది. నిరంతర విద్యుత్తు కోసం రూ.1,37,517 కోట్లు ఖర్చు చేసింది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, కాకతీయ మిషన్, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణం వల్ల సాగు విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాల నుంచి 2.68 కోట్ల ఎకరాలకు పెరిగింది. ధాన్యం ఉత్పత్తి 68 లక్షల టన్నుల నుంచి 350 లక్షల టన్నులకు పెరిగింది. విద్యారంగంలో 1,022 గురుకులాల ఏర్పాటు, 1,005 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, 85 గురుకుల డిగ్రీ కాలేజీలు, 29 మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. ఎంబీబీఎస్ సీట్లు మూడు రెట్లు పెరిగాయి. వైద్య రంగంలో మౌలిక వసతులు కల్పించి బెడ్స్ 17 వేల నుంచి 34 వేలకు, ఐసీయూ 5 నుంచి 80, బస్తీ దవాఖానాలు 500, డయాలసిస్ కేంద్రాలు 3 నుంచి 82 వరకు పెంపుతోపాటు హైదరాబాద్ నలువైపులా టిమ్స్ నిర్మాణం, నిమ్స్ విస్తరణ, లాంటి చర్యల వలన ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది. అభివృద్ధితో పాటు సంక్షేమం జోడెద్దుల లాగా పాలన సాగింది. అన్నిరంగాల్లో తెలంగాణ దేశంలోనే రోల్‌మాడల్‌గా నిలిచింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డులు ఎక్కువగా దక్కించుకున్న రాష్ట్రంగా తెలంగాణ నిలువడం గర్వకారణం. ప్రజల సంక్షేమం, పరిపాలన రాష్ట్ర ప్రగతికి మాత్రమే కాదు.. దేశాభివృద్ధిలో భాగంగా భావించి పరిపాలన వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టడం ద్వారా ప్రజలకు ఫలితాలు స్పష్టంగా కనిపించాయి. జిల్లా స్థాయి కార్యాలయాలు ప్రజలకు చేరువయ్యాయి. సమస్యలకు సులభంగా పరిష్కారాలు కనుగొనేందుకు వీలుకలిగింది. నగరాలు అభివృద్ధి చెందాయి. శాంతిభద్రతలు మెరుగుపడ్డాయి. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు తమ సర్వీస్ సమస్యల కోసం నిత్యం డీఈవో, కలెక్టర్‌లను కలిసే అవకాశం రావడం, చిన్నతరహా ఉద్యోగులకు స్వంత జిల్లాలో పనిచేసే అవకాశం కలిగింది. జిల్లా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమై పరోక్షంగా వేలాది మందికి ఉపాధి లభించింది. జిల్లాల ఏర్పాటు సత్వర అభివృద్ధికి, పారదర్శక పాలనకు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి రావడం పరిపాలనా సౌలభ్యమనే విషయాన్ని ప్రజలు గుర్తించారు. భవిష్యత్తు తరాలకు మేలు చేసేలా కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని ఇప్పటికీ జనం హర్షిస్తున్నారు. జిల్లాలు ఏర్పాటు జరిగి పదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా చారిత్రక నిర్ణయాన్ని హర్షిస్తూ అన్ని జిల్లాల్లో నేడు, రేపు కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపడంతోపాటు, నాటి వికాసాన్ని ప్రజలకు వివరించాలి. స్వరాష్ట్ర సాధన ఉద్యమానికి, తెలంగాణ పునర్నిర్మాణానికి సారథ్యం వహించి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుందాం. దాదాపు మూడేండ్ల కాంగ్రెస్ దుష్టపాలనను ఎండగట్టి, బీఆర్ఎస్ అండగా ఉంటుందనే ప్రజలకు భరోసా ఇద్దాం.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం మరో ఉద్యమానికి శ్రీకారం చుడుదాం.

నేటి తరానికి దిక్సూచి "స్ఫూర్తి మాణిక్యాలు"

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్,.మానవీయ, నైతిక విలువలు అడుగంటి పోతున్న నేటి సమాజం లో యువతను సన్మార్గం లో నడపడానికి "స్ఫూర్తి మాణిక్యాలు" పుస్తకం దిక్సూచి వంటిదని సాహితీ వేత్తలు ఉద్ఘాటించారు. కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గం పానగల్ మండలం చింతకుంట గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది కవి, రచయిత సూగూరు కిషన్ రావు రచించిన "స్ఫూర్తి మాణిక్యాలు" పుస్తకాన్ని ఆదివారం కొల్లాపూర్ పట్టణం లో సాహితీ మిత్రులు ఆవిష్కరణ చేశారు. డా.పండ్ర ప్రగడ రామచందర్ రావు ఆధ్వర్యం లో జరిగిన పుస్తకావిష్కరణ ఈ కార్య క్రమం లో తెలంగాణ సారస్వత పరిషత్ సభ్యులు వేదార్థం మధుసూదన శర్మ మాట్లాడుతూ నేటి తరం యువత విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా క్రమశిక్షణ అంకితభావం దేశభక్తి దైవ భక్తి కలిగి ఉత్తమ పౌరులుగా ఎదగడానికి చక్కటి నీతిని బోధించే సూక్తులతో కూడిన కవితలను కిషన్ రావు సమాజానికి ఈ పుస్తకం లో అందించారని అన్నారు.ఈ పుస్తకాన్ని ప్రతి విద్యార్థి తప్పక చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వారన్నారు. ఈ పుస్తకావిష్కరణ కార్య క్రమం లో తెలుగు భారతి సంస్థ అధ్యక్షులు ఆమని కృష్ణ,న్యాయవాది భూజల భాస్కర్ రెడ్డి, కవులు,రచయితలు డా. గుడేలి శీను, రాఘవేందర్,మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి గ్రామస్తుల ఆర్థిక సహాయం

(యస్.పి. మల్లికార్జున సాగర్).



కొల్లాపూర్, నవంబరు 1, నా అనుకునే వారు ఉన్నా కుటుంబ సభ్యుల యోగక్షేమాలు ఆర్థిక ఇబ్బందులను పట్టించు కోని ఈ కాలం లో అనారోగ్యం తో చనిపోయిన గ్రామస్తుని కుటుంబానికి గ్రామస్తులంతా ఏకమై ఆర్థిక సహాయం అందించి ఆదుకున్న సంఘటన ఇది. కొల్లాపూర్ మండలం మొల్ల చింతలపల్లి గ్రామ నివాసి తుమోజుల మోహన చారి(45) ఇటీవల మరణించారు. ఎలాంటి ఆర్థిక రాబడి ఓనర్లు లేక ముగ్గురు కుమార్తెలతో మృతిని కుటుంబ సభ్యులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను గుర్తించి మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మరాజు యాదవ్ గ్రామ మాజీ సర్పంచ్ కొమ్మ రాజు 5000 రూపాయలను, ఆంజనేయులు 3000 రూపాయలను, ఎరుకల తిరుపతయ్య 2000 రూ""లు, బండి శివుడు 500 రూపాయలను మృతుడు మోహన చారి కుటుంబ సభ్యులకు 10.500 రూపాయలను వారు ఆదివారం రోజు అందజేశారు.ఈ యొక్క కార్య క్రమం లో వార్డ్ మెంబర్ మిద్దె సత్యనారాయణ, సాకలి లింగస్వామి మిద్దె చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీలో చేరిన బండ హమాలీ కార్మికులు

కండువా కప్పి ఆహ్వానించిన ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్



నవంబర్ 1 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బండ హమాలీ కార్మికులు సుమారు 30 మంది ఏఐటీయూసీలో చేరడం జరిగింది ఈ సందర్భంగా ఏఐటీయుసి కండువా కాపీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ ఏఐటీయూసీలోకి ఆహ్వానించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యల కోసం యాజమాన్యాలతో మాట్లాడి రేట్లు పెంచుతామని తెలిపారు జిల్లా కేంద్రంలో అన్ని రంగాల కార్మికులకు ఏ కష్టం వచ్చినా ఏఐటీయూసీ అండగా నిలబడిందన్నారు భవిష్యత్తులో వారి కోసం పోరాటం చేస్తామని వారి హక్కుల కోసం ఉద్యమిస్తూనే ఉంటామని తెలిపారు జిల్లా కేంద్రంలో వేలాదిమంది అన్ని రంగాల వర్గాల కార్మికులు ఏఐటీయూసీ లో చేరుతున్నారని వారికి అండగా ఉంటూ భవిష్యత్తులో ఉద్యమిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో వెలుగు శ్రావణ్ మంద శంకర్ తండా శ్రీనాథ్ లక్ష్మీ నరసమ్మ జకరయ్య చెక్కల సోమయ్య చెక్కల సురేష్ లతోపాటు చేరిన వారిలో దరావత్ భాస్కర్, రవి, నాగరాజు చందు భావ్ సింగ్, వెంకన్న, రాందాస్, లింగ్యా , లిన్న్య, శంకర్ మల్సూర్, రమేష్,భద్రు, మధు భగవాన్ లతో పాటు 30 మంది చేరారు

శక్తి స్థల్ లో ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీకి
నివాళులర్పించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

బొడ్డిరెడ్డి ప్రభాకర్ రెడ్డి



నవంబర్ 1 ప్రతినిధి కొమిరే యాకయ్య భారత మాజీ ప్రధాని, భారతరత్న, దివంగత శ్రీమతి ఇందిరా గాంధీ గారి వర్ధంతి (అక్టోబర్ 31) సందర్భంగా, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీ బొడ్డిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారు నిన్న న్యూఢిల్లీలో గల శక్తి స్థల్ (సమాధి) ని సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు.కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి, సమాధి పై పసుపు పూల వర్షం కురిపించి, దేశ సమైక్యత కోసం ప్రార్థించారు. 1982 సంవత్సరంలో న్యూఢిల్లీలో తాను యువ కాంగ్రెస్ కార్యకర్తగా ఉండగా శ్రీమతి ఇందిరా గాంధీ గారిని కలిసిన చారిత్రాత్మక ఘట్టాన్ని గుర్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా రెడ్డి గారు మాట్లాడుతూ – "ఇందిరా గాంధీ గారు దేశ సమైక్యత కోసం తన ప్రాణాన్ని బలిదానం చేసిన ఉక్కు మహిళ. ఆమె హరిత విప్లవం, బ్యాంక్ జాతీయకరణ, గరీబీ హఠావో, 1971 బంగ్లాదేశ్ విజయం, పోఖ్రాన్ అణు పరీక్షతో భారత్ ని ప్రపంచ పటంలో అగ్ర స్థానంలో నిలబెట్టారు. కోట్ల మంది భారతీయుల హృదయాల్లో ఆమె చిరంజీవిగా నిలిచి ఉంటారు. ఆమె 1982లో నాకు ఇచ్చిన స్ఫూర్తితోనే ఇప్పటికీ కాంగ్రెస్ పార్టీ కోసం, పేద ప్రజల కోసం పని చేస్తున్నాను" అని అన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలు ఆమె ఆశయాలను ముందుకు తీసుకు వెళ్తారని ప్రతిజ్ఞ చేశారు.

సన్నం బియ్యానికి బదులు దొడ్డు బియ్యం!

నిజామాబాద్ జిల్లాలో రూ.9.33 కోట్ల బకాయిలు.. సివిల్ సప్లై అధికారి నస్పెండ్



నిజామాబాద్ నవంబర్ 1ప్రతినిధి ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మర ఆడించి సీఎంఆర్ బియ్యంగా తిరిగి అప్పగించాల్సి ఉండగా, కొందరు రైస్ మిల్లర్లు అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. సన్నం బియ్యానికి బదులుగా దొడ్డు బియ్యాన్ని ఎఫ్‌సీఐ గోదాములకు తరలించినట్లు విజిలెన్స్ తనిఖీల్లో గుర్తించినట్లు సమాచారం.నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వానికి రావాల్సిన బియ్యానికి సంబంధించి రూ.9.33 కోట్ల బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సీఎంఆర్ బియ్యంగా సరఫరా చేసినట్లు ఆరోపణలు రావడంతో అధికారులు విచారణ చేపట్టారు.ఈ వ్యవహారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నిజామాబాద్ జిల్లాకు చెందిన ఓ సివిల్ సప్లై అధికారిని సస్పెండ్ చేసినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులపై విజిలెన్స్ తనిఖీలు కొనసాగుతున్నాయి. అక్రమాలకు పాల్పడిన మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించినట్లు తెలుస్తోంది. విచారణలో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు మరియు 3వార్డు మెంబర్ దురూ శ్రీపాల్



నవంబర్ 1 మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి కొమిరే యాకయ్య నర్సింహులపేట: మండల కేంద్రంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు ఖాజా మియా పాల్గొని గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఉద్యమకారుడు, వార్డు మెంబర్ దూరు శ్రీపాల్ ఆధ్వర్యంలో ఈ ప్రచార కార్యక్రమం కొనసాగింది. ఈ సందర్భంగా గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఎన్నికల ప్రాధాన్యతను వివరించారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు మెంబెర్ బేతమల్ల శంకర్, నకిరాకంటిశివప్రసాద్ , 4వ వార్డు మెంబెర్ విజయ ఉపేందర్, దురు గిరి, దురు రమేష్ , ఎర్ర పవన్, దురు మధు, కొమిరె వెంకటేష్,ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, పలువురు పాల్గొన్నారు.

బాన్సువాడలో నాటు బాంబుల పేలుడు.. ఆరుగురికి గాయాలు!

పందుల వేట కోసం నిల్వ ఉంచిన బాంబులు పేలి ప్రమాదం.. ఇద్దరి పరిస్థితి విషమం

నాటు బాంబుల వినియోగంపై ఆందోళన



కామారెడ్డి నవంబర్ 1 బాన్సువాడ పట్టణంలోని ఎర్రమన్ కచ్చా ప్రాంతంలో ఆదివారం నాటు బాంబులు పేలడంతో తీవ్ర కలకలం రేగింది. పందుల వేట కోసం నిల్వ ఉంచిన బాంబులు ప్రమాదవశాత్తు పేలడంతో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో దాసరి లక్ష్మయ్యతో పాటు మరో ఐదుగురు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.స్థానికుల కథనం ప్రకారం.. దాసరి లక్ష్మయ్య ఇంటి వద్ద మోపెడ్‌లో నిల్వ ఉంచిన బాంబులు పేలడంతో సమీపంలో ఉన్న ఆరుగురు గాయపడ్డారు. పేలుడు ధాటికి గాయపడిన వారిని వెంటనే బాన్సువాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాంబులు ఎలా పేలాయి? వాటిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఏ పరిస్థితుల్లో నిల్వ ఉంచారు? అనే కోణాల్లో విచారణ చేపట్టినట్లు తెలిసింది. బాంబును నేలకేసి కొట్టడంతో పేలుడు సంభవించిందని బాధితులు చెబుతున్నట్లు సమాచారం.మరోవైపు, బాన్సువాడ ప్రాంతంలో అడవి పందుల వేటకు నాటు బాంబులను వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. అలాగే రాళ్లను పగలగొట్టేందుకు కొన్ని ప్రాంతాల్లో జిలెటిన్ స్టిక్స్ వంటి పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. వీటి నిల్వ, వినియోగంపై సంబంధిత అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.ఈ పేలుడు ఘటనతో ఎర్రమన్ కచ్చా ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. పేలుడు పదార్థాలను నిర్లక్ష్యంగా నిల్వ ఉంచడం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుండటంతో అధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతి భవన నిర్మాణ కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు పొందాలి!

హైదరాబాద్‌లో అడ్డా కూలీలకు మౌలిక వసతులు కల్పించాలి

కే. వెంకటస్వామి, భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు



శేరిలింగంపల్లి నవంబరు 1 107వ ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్మికుల హక్కుల కోసం పోరాటంలి హైదరాబాద్, నవంబర్ 1:భవన నిర్మాణ రంగంలో పనిచేస్తున్న ప్రతి కార్మికుడు తప్పనిసరిగా లేబర్ కార్డు పొందాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కే. వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్మికుల సమస్యలపై ఆయన మాట్లాడుతూ, కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని పేర్కొన్నారు.హైదరాబాద్ నగరంలో వేలాది మంది భవన నిర్మాణ కార్మికులు అద్దాల వద్ద పనుల కోసం ఎదురుచూస్తూ జీవనం సాగిస్తున్నారని, వారికి కనీస మౌలిక వసతులు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అద్దా కూలీలకు తాగునీరు, మరుగుదొడ్లు, నీడనిచ్చే షెడ్లు, విశ్రాంతి తీసుకునే స్థలాలు కల్పించాలని ప్రభుత్వాన్ని, జీహెచ్ఎంసీ అధికారులను డిమాండ్ చేశారు.భవన నిర్మాణ కార్మికులందరికీ లేబర్ కార్డులు జారీ చేసి, ప్రమాద బీమా, ఆరోగ్య సహాయం, పిల్లల విద్యా సహాయం, వివాహ మరియు ప్రసూతి ప్రయోజనాలు, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కార్మికుడికి అందించాలని కోరారు. కార్మికుల సంక్షేమ బోర్డులో నమోదు ప్రక్రియను సులభతరం చేసి, పెండింగ్‌లో ఉన్న సంక్షేమ పథకాల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.నిర్మాణ రంగ కార్మికులు దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారికి ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, సామాజిక భద్రత కల్పించడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని, అడ్డా కూలీల కోసం నగరవ్యాప్తంగా మౌలిక వసతుల కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు.ఏఐటీయూసీ 107వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కార్మికుల ఐక్యతను చాటుతూ, హక్కుల సాధన కోసం సంఘటితంగా ఉద్యమించాలనిలి కే. వెంకటస్వామి పిలుపునిచ్చారు.

కురిసింది "వాన" కొల్లాపూర్లో

(యస్.పి. మల్లికార్జున సాగర్)



కొల్లాపూర్, నవంబర్ 1, .కొల్లాపూర్ అసెంబ్లీ నియోజక వర్గ కేంద్రం లో ఆదివారం సాయంకాలం ఒక మాదిరి నుండి భారీ వర్షం కురిసినది. దాదాపు అరగంట సేపు కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించిపోయినది. ఆదివారం రోజు కొల్లాపూర్ పట్టణం లో కూరగాయల మార్కెట్ సంత జరుగుతుండగా అనుకోకుండా కురిసిన వర్షానికి సంతలో కూరగాయలు ఇతర వస్తువులు అమ్మే వ్యాపారులు, అలాగే కొనుగోలు చేసే వినియోగదారులు వర్షమూలముగా అనేక ఇబ్బందులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. చాలా మటుకు కూరగాయలు ఎండుమిరపకాయలు ఇతర వస్తువులు వర్షానికి తడిసి ముద్దాయి. అనుకోకుండా కురిసిన వర్షానికి ఇటుక పేల్లలు తయారు చేసేవారు అనేక ఇబ్బందులను ఎదుర్కొన్నారు. అలాగే వరి పంట చేతికొస్తుండగా అనుకోకుండా వర్షానికి వరి పంట నేలకొరిగి ఇబ్బందులు నష్టాలు ఏర్పడ్డాయని రైతులు వాపోవుతున్నారు.

సెమీఫైనల్ వరకు చేరిన జిల్లా జట్టు..

జ్యోతి విద్యాలయ విద్యార్థి పి. సమంత్ గౌడ్‌కు జట్టులో చోటు..





పటాన్‌చెరు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన అండర్-17 బాలుర జాతీయ క్రికెట్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు సెమీఫైనల్ వరకు చేరుకుని మూడో స్థానంతో సరిపెట్టుకుంది.కోచ్‌లు శ్రీనివాస్ గౌడ్, రామరాజు మార్గదర్శకత్వంలో జిల్లా జట్టు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని అద్భుతమైన ఆటతీరును ప్రదర్శించింది. వివిధ జట్లతో పోటీపడుతూ సెమీఫైనల్ వరకు చేరుకోవడం విశేషం.ఈ సందర్భంగా బీహెచ్ఈఎల్‌లోని జ్యోతి విద్యాలయానికి చెందిన విద్యార్థి పి. సమంత్ గౌడ్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపిక కావడం పాఠశాలకు, ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటిన సమంత్ గౌడ్ ను పలువురు అభినందించారు.క్రీడాకారులకు శిక్షణనిస్తూ జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించిన కోచ్‌లు శ్రీనివాస్ గౌడ్, రామరాజులను క్రీడాభిమానులు ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

ఢిల్లీ రామలీల మైదానంలో ఇండియా కూటమి భారీ బహిరంగ సభలో పాల్గొన్న ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు



నవంబర్ 1 న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓట్ల తొలగింపును నిరసిస్తూ, ఎస్ఐఆర్ (ఎస్ఐఆర్) ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఢిల్లీలోని రామలీల మైదానంలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మర్రి శ్రీమాన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నికల వ్యవస్థను తన రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటోందని తీవ్రంగా ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని, ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను ఉపయోగించుకొని పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఢిల్లీతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో లక్షలాది మంది ఓటర్ల పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించారని విమర్శించారు. ఈ విధంగా పరోక్షంగా బీజేపీ అధికారంలోకి రావడానికి జ్ఞానేశ్ కుమార్ సహకరిస్తున్నారని ఆరోపించారు.ఈ దేశంలో ఓట్ల దొంగతనం జరుగుతోందని, ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీర్యం చేసేలా పేపర్ల దొంగతనం కూడా జరుగుతోందని వారు మండిపడ్డారు. ఎంపీలను అక్రమంగా కొనుగోలు చేస్తూ ప్రభుత్వాలను మార్చడం, రాజకీయ పార్టీలను చీల్చడం, పార్టీ గుర్తులను సైతం దొంగిలించే రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజలు తమ ఓటు ద్వారా ఎన్నుకున్న ప్రభుత్వాలను కూల్చడం, ప్రజాస్వామ్య విలువలను కాలరాయడం దేశ రాజకీయ వ్యవస్థకు ప్రమాదకరమని అన్నారు.దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్ల తొలగింపునకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కును కాపాడాలని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని, జ్ఞానేశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని వారు కోరారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం విద్యార్థి, యువజన సంఘాలు దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తూ ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాయని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కళ్యాణ్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వెన్ను నొప్పికి అసలు కారణాలు ఏమిటి
ఎలాంటి జాగ్రత్తలను పాటించాలి



వెన్ననొప్పి అనేది ఎముకలు, కీళ్ల వైద్యులు తరచూ పరిష్కరించే సమస్యల్లో ఒకటి. అయితే ఈ నొప్పికి కారణం అందరిలో ఒకేలా ఉండదు. వెన్నెముకలోని డిస్కులకు సంబంధించిన సమస్యలు, వయసు పెరిగే కొద్దీ వచ్చే మార్పులు, శారీరక శ్రమ లేదా క్రీడల సమయంలో కండరాలు పట్టేయడం, కండరాలు బలహీనంగా ఉండడం, సరైన భంగిమలో కూర్చోకపోవడం వంటి అనేక అంశాలు వెన్ననొప్పికి కారణం అవుతాయి. కొందరిలో ఒకటి కంటే ఎక్కువ కారణాలు కూడా కలిసి ఉండే వీలు ఉంటుంది.

కండరాల పనితీరు ఎలా ఉంటుంది..

శరీరంలోని పొత్తికడుపు కండరాలు, వెన్ను కండరాలు, కటి ప్రాంతంలోని కండరాలు, శ్వాసకు తోడ్పడే డయాఫ్రాగమ్ వంటి కండరాల సమూహాన్ని కోర్ కండరాలు అంటారు. ఇవి వెన్నెముకకు ఆధారంగా నిలుస్తూ శరీరానికి స్థిరత్వాన్ని అందిస్తాయి. ఈ కండరాలు బలహీనంగా ఉన్నప్పుడు కూర్చున్న స్థానం నుంచి లేవడం, నేలపై ఉన్న వస్తువులను ఎత్తడం, శరీరాన్ని తిప్పడం, ఎక్కువసేపు కూర్చోవడం, నిలబడడం లేదా నడవడం వంటి సాధారణ పనులు కూడా ఇబ్బందిగా మారతాయి. ముఖ్యంగా ముందుకు వంగి వస్తువులను ఎత్తేటప్పుడు నొప్పి పెరిగే అవకాశం ఉంటుంది. కండరాల్లో తగినంత బలం, శక్తి లేకపోతే గాయాల ప్రమాదం కూడా పెరుగుతుంది.


వెన్ను నొప్పి ఎలా తగ్గుతుంది..

వెన్ననొప్పికి అసలు కారణం ఏమిటో గుర్తించడం కొన్నిసార్లు వైద్య పరీక్షలు, స్కానింగ్ చేసిన తర్వాత కూడా కష్టంగా ఉంటుంది. ఎందుకంటే ఈ సమస్యకు ఒకటి కంటే ఎక్కువ కారణాలు ఉంటాయి. అయితే కోర్ కండరాలను బలోపేతం చేయడం వల్ల చాలామందిలో వెన్ననొప్పి తగ్గుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. దీనికోసం వ్యక్తి ఆరోగ్య పరిస్థితి, నొప్పి తీవ్రత, కండరాల బలాన్ని పరిశీలించి తగిన వ్యాయామ ప్రణాళిక రూపొందించుకోవాలి. మాడిఫైడ్ ప్లాంక్స్, బ్రిడ్జెస్, అబ్డామినల్ బ్రేసింగ్ వంటి వ్యాయామాలు కోర్ కండరాల బలాన్ని పెంచేందుకు ఉపయోగపడతాయి. అయితే ఏ వ్యాయామం చేయాలి, ఎంత తీవ్రతతో చేయాలి అనేది వ్యక్తి పరిస్థితిని బట్టి నిర్ణయించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి..

వ్యాయామాలతోపాటు కూర్చునే, నిలబడే భంగిమను సరిచేసుకోవడం కూడా ముఖ్యం. వస్తువులను ఎత్తేటప్పుడు సరైన పద్ధతిని పాటించడం, వెన్నుపై అనవసరమైన ఒత్తిడి పడకుండా చూసుకోవడం, రోజువారీ పనుల్లో అవసరమైన మార్పులు చేసుకోవడం వల్ల నొప్పిని నియంత్రించవచ్చు. కోర్ కండరాల బలహీనత ఒక్కటే వెన్ననొప్పికి కారణం కాదని గుర్తుంచుకోవాలి. ప్రతి ఒక్కరిలో నొప్పికి దారితీసే అంశాలు వేర్వేరుగా ఉంటాయి. కాబట్టి వైద్య పరీక్షల ఆధారంగా కారణాన్ని గుర్తించి, తగిన వ్యాయామాలు, భంగిమలో మార్పులు, జాగ్రత్తలతో సమస్యను నిర్వహించుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

ప్రశాంత్ నగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు అట్టేపల్లి
రామప్రభు పర్యటనకు ఘన స్పందన



శేరిలింగంపల్లి నవంబరు 1. మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్ నగర్ లో స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని, వారి అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అట్టేపల్లి రామప్రభు ప్రశాంత్ నగర్ కాలనీలో పర్యటించారు.ఈ సందర్భంగా కాలనీ వాసులను కలిసి వారి సమస్యలు, అవసరాలు మరియు స్థానిక పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి తన వంతు పూర్తి సహకారం అందిస్తానని అట్టేపల్లి రామప్రభుతెలిపారు.అట్టేపల్లి రామప్రభు పర్యటనకు ప్రశాంత్ నగర్ కాలనీ వాసుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, ఏఆర్పీ టీమ్ సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో ప్రశాంత్ నగర్ కాలనీ వాసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు , ఏఆర్పీ టీమ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యం



సిరిసిల్ల నవంబర్ 1:కాగజ్‌నగర్‌రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన వైద్యశాలలో వైద్య సేవలపై అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని బీసీ రాజ్యాధికార జిల్లా అధ్యక్షులు దండు వినోద్ ఆరోపించారు.పాము కాటుకు గురైన మహిళ చికిత్సలపై వైద్యశాల సూపరెండెంట్ డాక్టర్ ప్రవీణ్ నిర్లక్ష్యం వహిస్తువాఖ్యానించినందకు ఆదివారం వైద్యశాలమందు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వినోద్ మాట్లాడుతూ... పేద,మధ్యతరగతి ప్రజల ఆరోగ్యంపై కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి ఏమాత్రం ప్రేమ ఉన్నా...ఈ సూపరెండెంట్ ను తక్షణమే విధుల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు.నిన్న సాయంత్రం ఒక మహిళకు పాము కాటు వేయడంతో ఆమె కుటుంబ సభ్యులు ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే వారి ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉండటంతో పేషెంట్ పరిస్థితిని వివరించి తదుపరి వైద్యం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందుబాటులో ఉందో లేదో తెలుసుకునేందుకు సిరిసిల్ల సివిల్ హాస్పిటల్ సూపరెండెంట్ ప్రవీణ్ కుమార్‌కు ఫోన్ చేయడం జరిగింది.ఆదివారం కావడంతో పాము కాటుకు సంబంధించిన వైద్యులు అందుబాటులో ఉన్నారా? అవసరమైన చికిత్స అందించగలరా? అని అడిగిన సందర్భంలో "మీరు నాకెందుకు ఫోన్ చేస్తున్నారు?" అంటూ సూపరెంటెండ్ సమాధానం చేశారు.ఒక జిల్లా పార్టీ అధ్యక్షునికే ఈ రకమైన సమాధానం ఎదురైంది. పేద, మధ్య తరగతి సామాన్య ప్రజల యొక్క పరిస్థితిని హాస్పిటల్లో అర్థం చేసుకోవచ్చు. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆ హాస్పిటల్లో పేదలకు వైద్యం అందడం లేదు. కచ్చితంగా సూపరెండెంట్ ని మార్చాల్సిన అవసరం ఉందని, మార్చాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార పార్టీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు అరకల రమేష్, కార్మిక విభాగం అధ్యక్షుడు కోడూరు శ్రీహరి, సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి చెట్టుపల్లి నరేందర్, మండల అధ్యక్షులు లక్కపాక రాకేష్, గుండేటి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు హామీలు కాదు.. ఉద్యోగాలు కావాలి

బిజేవైఎం జిల్లా కార్యవర్గ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై నాయకుల విమర్శలు



ఆసిఫాబాద్, నవంబర్ 1: నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరెడ్ల ప్రవీణ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ధోని శ్రీశైలం విమర్శించారు. ఆదివారం ఆసిఫాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలాగతి సుచిత్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మదిన సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయడంతో పాటు విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. మారుమూల ప్రాంతాల యువతకు పోటీ పరీక్షల శిక్షణ, ఉద్యోగ మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఎలాగతి సుచిత్ మాట్లాడుతూ యువత, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం తమ సంఘం నిరంతరం పోరాడుతుందని తెలిపారు. జిల్లాలో గ్రామస్థాయి నుంచి యువమోర్చాను బలోపేతం చేయాలని, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, మండల అధ్యక్షులు, ఇతర యువమోర్చా నాయకులు పాల్గొన్నారు.

పీటీ స్వామి సేవలు చిరస్మరణీయం

కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తాం: మాజీ మంత్రి హరీశ్‌రావు



గోదావరిఖని, : నవంబర్ 1: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కీర్తిశేషులు పీటీ స్వామి సంతాప సభకు ఆదివారం మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు హాజరయ్యారు. గోదావరిఖనిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామి చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ పీటీ స్వామి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆయన సేవలకు గుర్తుగా కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రేణికుంట్ల ప్రవీణ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్, పుట్ట మధు, దాసరి మనోహర్‌రెడ్డి, కొల్లేటి దామోదర్, మిర్యాల రాజిరెడ్డి, హరీశ్‌రెడ్డి, కౌశిక్ హరి, కొంకటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మటన్ షాపులపై పంచాయతీ తనిఖీలు

లైసెన్సులు, మేకల ఆరోగ్య ధ్రువీకరణ పత్రాల పరిశీలన



ఆసిఫాబాద్, నవంబర్ 1: గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ, పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా రాజంపేట ఆదివారం గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో మటన్ షాపులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి జె. సాయికృష్ణ, బిల్ కలెక్టర్ నాగేందర్, సిబ్బంది దుకాణాలను సందర్శించి లైసెన్సులు, మేకల ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. మాంసం విక్రయాలకు అవసరమైన అనుమతులు, ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉండాలని, దుకాణాల్లో పరిశుభ్రత పాటించాలని వ్యాపారులకు సూచించారు. ప్రజారోగ్యానికి ఇబ్బందులు కలగకుండా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన పాలకవర్గం గ్రామాభివృద్ధితో పాటు ప్రజారోగ్యం, పారిశుద్ధ్యానికి ప్రాధాన్యతనిస్తూ చర్యలు చేపడుతోంది.

ఓటు హక్కు పరిరక్షణ ఉద్యమానికి జిల్లా కాంగ్రెస్ మద్దతు

ఢిల్లీలో 'ఓట్ బచావో--దేశ్ బచావో' సభకు భారీగా తరలిన నాయకులు, కార్యకర్తలు



ఆసిఫాబాద్, నవంబర్ 1: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన 'ఓట్ బచావో--దేశ్ బచావో' పిలుపు మేరకు ఆదివారం రామ్‌లీలా మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క నాయకత్వంలో తెలంగాణ భవన్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు కాంగ్రెస్ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడటమే ఈ ఉద్యమ లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తూ ఓట్ల చోరీకి బీజేపీ ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. ఈ పోరాటం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే పరిమితం కాదని, దేశంలోని ప్రతి ఓటరు హక్కులను కాపాడే ఉద్యమమని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో చేపడుతున్న ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటానికి జిల్లా కాంగ్రెస్ శ్రేణులు సంపూర్ణ మద్దతు ఇస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, మండల అధ్యక్షులు రాపర్తి మురళి, ఇమ్రాన్, సుజాహిద్ ఖాన్, రమేష్ జాదవ్, కిషన్ గౌడ్, చునార్కర్ మహేష్, డీసీసీ కార్యవర్గ సభ్యులు, యువజన కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు.

వాస్తవ గమ్యం భీమారం , నవంబర్ 1.చెన్నూర్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టి మాజీ జిల్లా అధ్యక్షుడు , ఎంపీ బాల్క సుమన్ ఆదేశాల మేరకు భీమారం మాజీ మండల అధ్యక్షుడు కలగూర రాజకుమార్ ఆధ్వర్యంలో అదిలాబాద్ లో జరిగిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు గర్జన సభకు బిఆర్ఎస్ భీమారం బి ఆర్ ఎస్ నాయకులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి ధర్మారం సర్పంచ్ దాసరి మణిదీపక్, టిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు రాజేష్ నాయక్, యూత్ నాయకులు చింతం తిరుపతి, రాజు నాయక్, దాంపూర్ మాజీ ఉపసర్పంచ్ సంతోష్, నవీన్ నాయక్, వెంకట్ మేస్త్రి, పానుగంటి లచ్చన్న, మేకల రాజబాబు, కిరణ్ నాయక్, చకినారపు రాజేష్ తదితరులు హాజరైనారు.


కేటీఆర్ సభకు తరలి వెళ్లిన బిఆర్ఎస్ నాయకులు.



భీమారం , నవంబర్ 1.చెన్నూర్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యుడు మంచిర్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టి మాజీ జిల్లా అధ్యక్షుడు , ఎంపీ బాల్క సుమన్ ఆదేశాల మేరకు భీమారం మాజీ మండల అధ్యక్షుడు కలగూర రాజకుమార్ ఆధ్వర్యంలో అదిలాబాద్ లో జరిగిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతు గర్జన సభకు బిఆర్ఎస్ భీమారం బి ఆర్ ఎస్ నాయకులు హాజరైనారు. ఈ కార్యక్రమానికి ధర్మారం సర్పంచ్ దాసరి మణిదీపక్, టిఆర్ఎస్వి మండల అధ్యక్షుడు రాజేష్ నాయక్, యూత్ నాయకులు చింతం తిరుపతి, రాజు నాయక్, దాంపూర్ మాజీ ఉపసర్పంచ్ సంతోష్, నవీన్ నాయక్, వెంకట్ మేస్త్రి, పానుగంటి లచ్చన్న, మేకల రాజబాబు, కిరణ్ నాయక్, చకినారపు రాజేష్ తదితరులు హాజరైనారు.

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పూలే భవన్ లో బి ఎల్ ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశం.

బీసీ కాలాన్ని పెట్టాలి.మూడు డిక్లరేషన్లు అమలు చెయ్యాలి., ప్రజా సంఘాల నాయకుల డిమాండ్



మంచిర్యాల జిల్లా, నవంబర్ 1మంచిర్యాల జిల్లా కేంద్రం లోని పూలే భవన్ లో బహుజన లెఫ్ట్ ప్రంట్ఆధ్వర్యంలో పసులేటి వెంకటేష్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బి ఎల్ ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ సంకె రవి, పసులేటి వెంకటేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జనగణన కులగణనలో బీసీ కాలాన్ని పెట్టకుండా బీసీ ల జనాభా,ఆర్థిక, సామాజిక,రాజకీయ లెక్కలు తియ్యడం లేదు అని .దీనివలన బీసీలు భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉన్నది అని .బీసీ కాలాన్ని పెట్టకుండా లేవలం జనాభా లెక్కలు తియ్యడం మూలంగా బీసీలకు వచ్చే ప్రయోజనం ఏమి లేదు అని .బీసీ కాలాన్ని పెట్టి పూర్తి స్థాయి వివరాలు చెయ్యాలని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిదంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతు,బీసీ , ఎస్సి ,ఎస్టీ , డిక్లరేషన్లు చేసి అధికారంలోకి వచ్చి మూడు డిక్లరేషన్లను అమలు చెయ్యకుండా మూడు సం రాలుగా అధికారంలో ఉండి నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నాది.బీసీ కాలాన్ని చేర్చాలని,మూడు డిక్లరేషన్లు అమలు చేయాలని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తిసుకురావడం కోసం ఆందోళన,పోరాటలకు ప్రజలను చైతన్యం చెయ్యడం కోసం రౌండ్ టేబుల్ సమావేశాలు బి ఎల్ ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బి ఎల్ ఎఫ్ బి కన్నురి సమ్మయ్య,దూలం శ్రీనివాస్, ప్రజా ప్రజా ప్రంట్ జైపాల్ సింగ్.ఐ ఆర్ సి పి నాయకులు కె .జయరావు, ఎం ఆర్ పి ఎస్ నాయకులు సుందిల్ల మల్లేష్. మరియు సామాజిక సంఘాల నాయకులు సరిత రమాదేవి,మహేందర్, తాడూరి పోచన్న, ధర్మన్న,శ్రీనివాస్,స్వామి తదితరులు పాల్గొన్నారు

ఢిల్లీకి చేరిన తెలంగాణ కాంగ్రెస్ నేతలు

ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంఅజ్మీరా శ్యామ్ నాయక్



ఆసిఫాబాద్ నవంబర్ 01:ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పోరాట కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ నుంచి నాయకులు తరలివచ్చారు. అజ్మీరా శ్యామ్ నాయక్ నేతృత్వంలో జిల్లా నాయకులు తెలంగాణ భవన్‌కు చేరుకుని, తదుపరి కార్యక్రమాలకు సిద్ధమయ్యారు.ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కు రక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటమే లక్ష్యంగా పార్టీ చేపడుతున్న ఈ పోరాటంలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు పార్టీ చేసే ప్రతి పోరాటంలో ముందుంటామని నేతలు స్పష్టం చేశారు.

లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ వద్ద 17వ రోజు అన్నదానం

ఎమ్మెల్యే హరీష్ బాబు ఆధ్వర్యంలో కొనసాగుతున్న సేవ



ఆసిఫాబాద్ నవంబర్ 01 :కాగజ్‌నగర్ పట్టణ రైల్వే స్టేషన్ వద్ద వైద్య సేవలందిస్తున్న లైఫ్ లైన్ ఎక్స్‌ప్రెస్ వద్ద సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు ఆధ్వర్యంలో 17వ రోజు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చికిత్స కోసం వచ్చే రోగులు, వారి సహాయకులకు భోజన సదుపాయం కల్పిస్తున్నారు.

మందమర్రి లో ఘనంగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



మందమర్రి, నవంబర్ 1: మందమర్రి లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం మందమర్రిలోని సీఈఆర్ క్లబ్, రామకృష్ణాపూర్‌లోని ఆర్‌కేసీఓఏ క్లబ్, మందమర్రిలోని ఇల్లందు క్లబ్‌లలో నిర్వహించిన కార్యక్రమాలను మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ సి.ఎన్. రాధాకృష్ణ, ఏరియా సేవా అధ్యక్షురాలు శ్రీమతి శ్రీవాణి రాధాకృష్ణతో పాటు ఏరియాలోని ఉన్నతాధికారులు అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది "నిజాయితీతో సమృద్ధి" అనే ప్రధాన నినాదంతో అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు మందమర్రి ఏరియాలోని అన్ని గనులు, విభాగాలు, కార్యాలయాల్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వతంత్ర భారత తొలి హోంశాఖ మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఈ అవగాహన వారోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గుర్తుచేశారు. సింగరేణి సంస్థను పురోగతి పథంలో నడిపించేందుకు ప్రతి ఒక్కరూ నిజాయితీని జీవన విధానంగా మార్చుకుని సంస్థ అభివృద్ధికి పునరంకితం కావాలని కోరారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో "పౌరుల సత్యనిష్ఠ ప్రతిజ్ఞ" చేయించారు. ఈ కార్యక్రమంలో మందమర్రి ఏరియాకు చెందిన ఉన్నతాధికారులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీ సర్వేలో నిర్లక్ష్యం.. లైసెన్సుడ్ సర్వేయర్ లైసెన్స్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్




రాజన్న సిరిసిల్ల (ప్రతినిధి) నవంబర్ 1రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా కేటాయించిన విధులు నిర్వర్తించడంలో అలసత్వం ప్రదర్శించిన లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సస్పెన్షన్ చేశారు.భూముల రీ సర్వేలో భాగంగా మొదటి దశలో జిల్లాలోని 70 గ్రామాల్లో రీ సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించగా, షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో రెవెన్యూ అధికారులు, మండల సర్వేయర్లతో పాటు, ప్రభుత్వ ఆమోదం పొందిన లైసెన్సుడ్ సర్వేయర్లు భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొంటున్నారు.జిల్లాలోని గంభీరావుపేట మండలం కుర్దులింగంపల్లి గ్రామంలో భూముల రీ సర్వే కొనసాగుతుండగా, సర్వే కోసం కేటాయించిన లైసెన్సుడ్ సర్వేయర్ ఎం బాలకృష్ణ గత కొన్ని రోజుల నుండి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ భూముల రీ సర్వే ప్రక్రియలో పాల్గొనకుండా గైర్హాజరు కావడం పట్ల జిల్లా కలెక్టర్ సంబంధిత లైసెన్సుడ్ సర్వేయర్ పై చర్యలు తీసుకున్నారు.లైసెన్సుడ్ సర్వేయర్ బాలకృష్ణ లైసెన్స్ ను సస్పెన్షన్ చేస్తూ ఆదివారం జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ సర్వే ప్రక్రియలో భాగస్వామ్యమైన అధికారులు అందరు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

దాతల సహకారంతో పేదలకు, అన్నార్తులకు అన్నదానం

మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్





వేములవాడ నవంబర్ 1మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేదలకు, అన్నార్తులకు, వేములవాడ రాజన్న దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. 2032 వ రోజుగా ఆదివారం అన్నం తో పాటు పండ్లు, వాటర్ బాటిళ్ళు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.జన్మదిన, వివాహ దిన, మృతుల జ్ఞాపకార్థం, తదితర శుభ కార్యాల సందర్భంగా పేదల ఆకలి తీర్చేందుకు కడుపు నింపేందుకు చేతనైన మేరకు ఆర్థిక సహాయం అందించాలని మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు డాక్టర్ మధు మహేష్ కోరారు.అన్నదాతలుగా పుట్టినరోజు సందర్భంగా వేముల వెంకటేశ్వర్లు- (వెంకన్న) పల్లవి దంపతులు, వరహాల సుశీల జ్ఞాపకార్థం వీరి కుమారుడు,కోడలు నాగాచారి -అనిత దంపతులు, శాశ్వత అన్నదాతల సహాయ సహకారాలతో అన్నదానం కార్యక్రమం నిర్వహించినట్లు ట్రస్ట్ ప్రతినిధులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, పసుల శ్రీధర్, ముంజ వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

జలసిరి పనుల్లో భాగంగా ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణానికి మార్కింగ్



వాస్తవ గమ్యం టేక్మాల్ మండల్ అచ్చన్న పల్లి జలసిరి పనుల్లో భాగంగా గ్రామాల్లో భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి సంరక్షణ లక్ష్యంగా ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేందుకు అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి అనువైన స్థలాలను పరిశీలించి మార్కింగ్ నిర్వహించారు.వర్షపు నీరు వృథాగా పోకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి ఇంకేలా చేయడం వల్ల భూగర్భ జలమట్టం పెరిగి బోరుబావుల్లో నీటి లభ్యత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ప్రతి ఇంటి యజమాని ఇంకుడు గుంతల నిర్మాణానికి సహకరించాలని, నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు.నీటి పొదుపే భవిష్యత్తుకు భరోసా.. ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భ జలాల పెంపునకు బాటలు.అచ్చన్న పల్లి గ్రామపంచాయతీ గ్రామ సర్పంచ్ చంద్రపు సాయిలు గౌడ్ ,కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జగదీష్, ఫీల్డ్ అసిస్టెంట్ మోతిలాల్, మేట్ దశరథ్, గ్రామ పెద్దలు మడ్డే సంగయ్య, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుండి గ్రామంలో తాత్కాలిక వంతెన పనులు ప్రారంభం

ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ చర్యలు



ఆసిఫాబాద్, నవంబర్1: గ్రామ ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా గుండి గ్రామ సర్పంచ్ జాబరి రవీందర్ ఆధ్వర్యంలో ఆదివారం తాత్కాలిక వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా పనులు కొనసాగిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చందన కడ సంతోష్, వార్డు సభ్యులు జాబోరే రాజు, రాస్పల్లి మోహన్, దోకె మరోతి, శ్రీకాంత్, రమేష్, కళ్యాణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ సంస్కృతికి ప్రతీకగా గోసాడి.. తరతరాలుగా కొనసాగుతున్న అపురూప సంప్రదాయం

నెమలి ఈకల తలపాగా.. డోలు మోతకు గోండు వీరుల నృత్యం!







రెబ్బెన, :నవంబర్ 1: నెమలి ఈకలతో అలంకరించిన భారీ తలపాగా.. ఒంటిపై పూసల దండలు.. కాళ్లకు గజ్జెలు.. చేతిలో సంప్రదాయ వాయిద్యాలు.. డోలు, తుడుము, పెపిరి మోతలకు అనుగుణంగా లయబద్ధంగా కదిలే అడుగులు.. ఇవన్నీ కలిస్తే కనిపించేది ఆదివాసీ గోండుల గోసాడి నృత్యం. ఇది కేవలం ఓ నృత్యకళ కాదు.. గోండు గిరిజనుల జీవన విధానం, ఆచార సంప్రదాయాలు, సాంస్కృతిక అస్తిత్వాన్ని చాటిచెప్పే అపురూప వారసత్వం.తెలంగాణలోని ఆదిలాబాద్ ప్రాంతంలో నివసించే రాజ్‌గోండుల సంప్రదాయాల్లో గోసాడి నృత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. దీపావళి పండుగ సమయంలో ఈ నృత్య సంబరాలు ప్రారంభమై కార్తీక పౌర్ణమి వరకు కొనసాగుతాయని సంప్రదాయం చెబుతోంది. ఈ సందర్భంగా గోండు యువకులు ప్రత్యేక అలంకరణతో గోసాడి బృందాలుగా ఏర్పడి గ్రామగ్రామాన తిరుగుతూ నృత్య ప్రదర్శనలు ఇస్తారు. వారి వేషధారణలో నెమలి ఈకల తలపాగా ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. సంప్రదాయ దుస్తులు, పూసల ఆభరణాలు, గజ్జెలతో అలంకరించుకుని ప్రత్యేక రూపంలో దర్శనమిస్తారు.డోలు, తుడుము, పెపిరి వాయిద్యాల శబ్దాలు మారుమోగుతుంటే గోసాడి కళాకారులు వలయాకారంలో నిలబడి లయబద్ధంగా అడుగులు వేస్తూ ఉత్సాహంగా నృత్యం చేస్తారు. ఆ నృత్యంలో కనిపించే వేగం, వీరత్వం, సమూహ స్ఫూర్తి ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి. గోండుల ఆరాధ్య దైవమైన పెర్సా పెన్ పూజా వేడుకల్లోనూ ఈ నృత్యానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. గ్రామాలకు గోసాడి బృందాలు వచ్చినప్పుడు ప్రజలు ఆప్యాయంగా స్వాగతించి కానుకలు అందించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి సాగిపోయే ఈ నృత్య ప్రదర్శనలు గిరిజనుల మధ్య ఐక్యతను, ఆత్మీయ బంధాలను మరింత బలోపేతం చేస్తాయి. ప్రకృతిని ఆరాధించే గోండు జీవనశైలిని, వారి కళా వైభవాన్ని ప్రతిబింబించే గోసాడి నృత్యం నేటి తరానికి మన పూర్వీకుల సంస్కృతిని పరిచయం చేస్తోంది. ఆధునిక కాలంలోనూ ఈ సంప్రదాయాన్ని కాపాడుకుంటూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.గోసాడి పండుగకు స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. గోండు గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు మరింతగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

పీఎఫ్ విత్ డ్రా చేసేటప్పుడు ఈ మిస్టేక్స్ చేస్తున్నారా..? జాగ్రత్త.. మీ డబ్బులు నిలిచిపోతాయి



అత్యవసరంగా నగదు అవసరమైనప్పుడు చాలామంది పీఎఫ్ నగదు విత్ డ్రా చేస్తుంటారు. అలాంటప్పుడు కొన్ని తప్పులు చేయడం వల్ల పీఎఫ్ క్లెయిమ్ రిజెక్ట్ కావొచ్చు. దీంతో క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. లేకపోతే మీకు సమస్యలు రావొచ్చు. ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసేవారిలో చాలామంది పీఎఫ్ అకౌంట్ కలిగి ఉంటారు. ప్రతీ నెలా మీ జీతంలో కొంత మొత్తాన్ని కట్ చేసి పీఎఫ్ ఖాతాలో యాజమాన్యం జమ చేస్తూ ఉంటారు. అలాగే యాజమాన్యం తన చందాగా మరికొంత అందిస్తుంది. ఖాతాదారుడు ఉద్యోగం మానేసిన కొన్ని నెలల తర్వాత వీటి మొత్తాన్ని విత్ డ్రా చేసుకోవచ్చు. ఇక ఉద్యోగంలో ఉన్నప్పుడు అవసరమైతే పాక్షిక విత్ డ్రాయల్ ఆప్షన్ ద్వారా కొంతమొత్తం తీసుకోవచ్చు. ఖాతాలో ఉన్న మొత్తం అమౌంట్‌లో 75 శాతం వరకు ఉద్యోగంలో ఉన్నప్పుడే విత్ డ్రా చేసుకునే సదుపాయం ఉంది. విత్ డ్రా రూల్స్‌లో ఇటీవల ఈపీఎఫ్ఓ కొన్ని మార్పులు చేసింది. ఈ రూల్స్ తెలుసుకోకపోవడం, కొన్ని తప్పులు చేయడం వల్ల పీఎఫ్ క్లెయిమ్ రాకపోవచ్చు.

ఈ తప్పు చేయకండి

మీరు క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసేటప్పుడు కొన్ని విషయాలు తనిఖీ చేసుకోవాలి. కేవైసీ వివరాలన్నీ సరిగ్గా ఉన్నాయా.. లేదా అనేది చెక్ చేసుకోవడం చాలా ముఖ్యం. ఆధార్, పాన్ వివరాలు పీఎఫ్ అకౌంట్‌తో అనుసంధానించబడి ఉండాలి. ఇక పీఎఫ్ పోర్టల్‌లో బ్యాంక్ అకౌంట్ వివరాలు అప్డేట్ చేసి ఉంచుకోవాలి. బ్యాంక్ అకౌంట్ నెంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ కరెక్ట్‌గా ఉండాలి. అకౌంట్ వివరాలు తప్పుగా ఉంటే మీ అకౌంట్లో డబ్బులు క్రెడిట్ అవ్వవు. బ్యాంకుల విలీనమైన క్రమంలో పాత ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఉంటే సమస్యలు తలెత్తుతాయి. దీంతో కొత్త నెంబర్ అప్డేట్ చేయాలి. మీరు ఉద్యోగం మానేసిన తర్వాత్ విడ్ డ్రా చేస్తుంటే ఎగ్జిట్ డేట్ నమోదై ఉండాలి. ఎగ్జిట్ డేట్ ఎంట్రీ కాకపోతే క్లెయిమ్ అందదు. ఇక క్లెయిమ్ కోసం సరైన ఫారంను ఎంచుకోవాలి. పీఎఫ్ అడ్వాన్స్ కోసం అయితే ఫారం 31 ఉపయోగించాలి. ఇక ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం అయితే ఫారం 19 ఎంచుకోవాలి. అదే పెన్షన్ విత్ డ్రా కోసమైతే ఫారం 10సీ నింపాల్సి ఉంటుంది.

క్లెయిమ్ విషయంలో జాప్యం

మీరు ఫారంను తప్పుగా ఎంచుకుంటే క్లెయిమ్ విషయంలో ఇబ్బందులు తలెత్తుతాయని చెప్పవచ్చు. అసంపూర్తిగా ఉన్న కేవైసీ వివరాలు, ఈపీఎఫ్ఓ ప్రొఫైల్, బ్యాంక్ వివరాలు, సర్వీస్ హిస్టరీ వంటివి తనిఖీలు చేసుకోవాలి. అన్ని చెక్ చేసుకున్న తర్వాతనే క్లెయిమ్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. అన్ని వివరాలు కరెక్ట్‌గా ఉంటే మూడు రోజుల్లోనే నగదు మీ అకౌంట్లో జమ అవుతుంది. వివరాలు తప్పుగా ఉంటే క్లెయిమ్ వెంటనే రిజెక్ట్ అయ్యే అవకాశముంటుంది. మళ్లీ వివరాలు చెక్ చేసుకుని క్లెయిమ్ సమర్పించాలంటే ప్రక్రియలో జాప్యం జరుగుతుంది.

ట్యాక్స్‌పేయర్లకు గుడ్‌న్యూస్ జీఎస్టీ రూల్స్‌లో సంచలన మార్పులు ఇక అరెస్టులకు చెక్!



జీఎస్టీ కౌన్సిల్ కీలక సంస్కరణలు ప్రకటించింది. జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగించి, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచింది. ఈ నిర్ణయాలు వ్యాపార సంస్థలపై చట్టపరమైన ఒత్తిడిని తగ్గించి, వ్యాపారం సులభతరం చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. పన్ను వసూళ్లకు ప్రాధాన్యత ఇస్తూ, అనవసర క్రిమినల్ చర్యలకు స్వస్తి పలికాయి. జీఎస్టీ కౌన్సిల్ గురువారం (అక్టోబర్ 08) ఢిల్లీలోని భారత్ మండపంలో ఒక ముఖ్యమైన సమావేశం నిర్వహించింది. ఈ కౌన్సిల్ ఒక కీలకమైన, చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం, జీఎస్టీ కింద ఎటువంటి అరెస్టులు జరగవు. జీఎస్టీ కింద అరెస్ట్ చేసే అధికారాన్ని కౌన్సిల్ పూర్తిగా తొలగించింది. అలాగే, ప్రాసిక్యూషన్ పరిమితిని రూ. 1 కోటి నుండి రూ. 5 కోట్లకు పెంచింది. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక సంస్కరణకు శ్రీకారం చుట్టింది. ఢిల్లీలోని భారత్ మండపంలో గురువారం జరిగిన 57వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పన్ను చెల్లింపుదారులకు సంబంధించిన అమలు, ప్రాసిక్యూషన్ నిబంధనలపై ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా జీఎస్టీ అధికారులకు ఉన్న అరెస్ట్ అధికారాలను తొలగిస్తూ.. కౌన్సిల్ నిర్ణయించింది. దీంతో జీఎస్టీ ఉల్లంఘనలకు సంబంధించి పన్ను అధికారులు నేరుగా అరెస్ట్ చేసే అవకాశం ఇక ఉండదు. ఇప్పటివరకు తీవ్రమైన పన్ను ఎగవేత, నకిలీ ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) వంటి కొన్ని కేసుల్లో జీఎస్టీ అధికారులు అరెస్ట్ చేసే అధికారం ఉంది. ఈ అధికారాన్ని పరిమితం చేయడం ద్వారా సాధారణ పన్ను వివాదాలు, వ్యాపార సంబంధిత పొరపాట్లు క్రిమినల్ చర్యల స్థాయికి వెళ్లకుండా చూడాలనే ఉద్దేశంతో సంస్కరణలు తీసుకొచ్చింది కేంద్రం. పన్ను బకాయిల వసూలు, వడ్డీ, జరిమానాల విధింపు వంటి ఇతర చర్యలు మాత్రం కొనసాగుతాయి. అదే సమయంలో జీఎస్టీ కింద ప్రాసిక్యూషన్ ప్రారంభించే పరిమితిని కూడా భారీగా పెంచారు. ఇప్పటివరకు రూ.1 కోటి పన్ను ఎగవేతకు సంబంధించిన కేసుల్లో ప్రాసిక్యూషన్ ప్రారంభించే అవకాశం ఉండగా.. ఇకపై ఆ పరిమితిని రూ.5 కోట్లకు పెంచారు. అంటే రూ.5 కోట్లకు లోబడిన పన్ను ఎగవేత కేసుల్లో క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు వెళ్లే అవకాశం తగ్గనుంది. ఈ మార్పులను పన్ను వ్యవస్థను మరింత సులభతరం చేయడం, వ్యాపార సంస్థలపై అనవసరమైన చట్టపరమైన ఒత్తిడిని తగ్గించడం, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను మెరుగుపరచడం వంటి లక్ష్యాలతో కొత్త సంస్కరణలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. జీఎస్టీ 2.0లో భాగంగా కేవలం అరెస్ట్, ప్రాసిక్యూషన్ నిబంధనలే కాకుండా.. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేయడం, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ వ్యవస్థలో మార్పులు, రిఫండ్లను వేగవంతం చేయడం, వివాదాలను తగ్గించడం వంటి పలు అంశాలపై కూడా కౌన్సిల్ దృష్టి సారించింది. మొత్తంగా చూస్తే, జీఎస్టీ అమలులో కఠినమైన క్రిమినల్ చర్యల కంటే పన్ను వసూళ్లు, అనుసరణ, సులభమైన వ్యాపార విధానాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా తాజా నిర్ణయాలు ఉన్నాయని చెప్పొచ్చు. అయితే ఈ మార్పులు పూర్తిగా అమల్లోకి రావడానికి అవసరమైన చట్టపరమైన సవరణలు, తదుపరి ప్రక్రియ కూడా కీలకం కానున్నాయి.

వాహనదారులకు బిగ్ గుడ్ న్యూస్ కేవలం 3 వేలతో ఏడాది మొత్తం టోల్ ఫ్రీ



వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం అదిరిపోయే శుభవార్త చెప్పింది. టోల్ ప్లాజా సమీపంలో నివసించే వారి కోసం ఫాస్టాగ్ నిబంధనల్లో కీలక మార్పులు చేస్తూ కొత్త పాలసీని అమల్లోకి తెచ్చింది. ఇకపై ప్రతి నెలా పాస్ రెన్యూవల్ చేసుకోవాల్సిన తిప్పలు లేకుండా.. కేవలం రూ.3,000తో ఏడాది మొత్తం ఎన్నిసార్లైనా టోల్ గేట్ దాటొచ్చని స్పష్టం చేసింది. ఈ కొత్త వార్షిక పాస్ ఎవరికి వర్తిస్తుంది? ఎలా పొందాలి? అనే వివరాలు ఈ స్టోరీలో తెలుసుకుందాం.. జాతీయ రహదారులపై ప్రయాణించే స్థానిక వాహనదారులకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ భారీ ఊరటనిచ్చింది. టోల్ ప్లాజాల సమీపంలో నివసించే వారి కోసం ఫాస్టాగ్ వార్షిక పాస్‌లకు సంబంధించి కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. టోల్ ప్లాజాకు 20 కిలోమీటర్ల పరిధిలోని నాన్ కమర్షియల్ వాహన యజమానులకు అత్యంత తక్కువ రుసుముతో వార్షిక లోకల్ ఫాస్టాగ్ పాస్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. గతంలో అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం.. రూ. 3,075 వార్షిక పాస్ తీసుకున్నప్పటికీ ఏడాదికి గరిష్టంగా 200 ట్రిప్పులకు మాత్రమే అనుమతి ఉండేది. లేదా ప్రతి నెలా నిర్దిష్ట రుసుము చెల్లించి మంత్లీ పాస్‌ను రెన్యూవల్ చేసుకోవాల్సి వచ్చేది. తాజా నిబంధనలతో ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. సుమారు రూ. 3 వేల స్థిర రుసుముతో తీసుకునే ఈ కొత్త వార్షిక పాస్‌తో ఏడాది పొడవునా సదరు టోల్ ప్లాజా గుండా ఎన్నిసార్లైనా ప్రయాణించవచ్చు.ప్రతి నెలా పాస్ గడువు ముగిసిందని ఆందోళన చెందాల్సిన పనిలేకుండా, ఏడాదికి ఒకేసారి రీఛార్జ్ చేసుకుంటే సరిపోతుంది.

ఈ నిబంధనలు ఎవరికి వర్తిస్తాయి?

సంబంధిత జాతీయ రహదారి టోల్ ప్లాజా కేంద్ర బిందువు నుంచి 20 కిలోమీటర్ల పరిధిలో శాశ్వతంగా నివసించే నివాసితులకు మాత్రమే ఈ వెసులుబాటు వర్తిస్తుంది. ఈ రాయితీ పూర్తిగా వైట్ నంబర్ ప్లేట్ గల కార్లు, జీపులు, వ్యాన్లు వంటి ప్రైవేట్ వాహనాలకు మాత్రమే పరిమితం. ట్యాక్సీలు లేదా ఇతర కమర్షియల్ వాహనాలకు ఇది వర్తించదు. ఫాస్టాగ్‌ను స్థానిక పాస్‌గా మార్చుకోవడానికి వాహన ఆర్సీతో పాటు ఆధార్ కార్డు లేదా ఓటర్ ఐడీ వంటి స్థానిక చిరునామా ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. ప్రక్రియ మొత్తం డిజిటల్ విధానంలో సాగుతుంది.

స్థానికులకు దక్కే ప్రధాన ప్రయోజనాలు

నిత్యం ఉద్యోగం, వ్యాపారం, పాఠశాలలు లేదా వ్యవసాయ పనుల నిమిత్తం రోజుకు రెండు మూడు సార్లు టోల్ ప్లాజా దాటే వారికి వేల రూపాయల టోల్ చార్జీలు ఆదా అవుతాయి. లోకల్ పాస్ ఫాస్టాగ్‌తో నేరుగా అనుసంధానం కావడం వల్ల టోల్ గేట్ల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా ఆటోమేటిక్ గేట్ ఓపెన్ అవుతుంది. స్థానికుల ఐడీ చెకింగ్ పేరుతో జరిగే వాగ్వాదాలు, ట్రాఫిక్ జామ్‌లకు తెరపడుతుంది. ఎలాంటి మాన్యువల్ జోక్యం లేకుండా నేరుగా ఫాస్టాగ్ పోర్టల్ లేదా యాప్ ద్వారానే పాస్ పొందవచ్చు. స్థానికులపై పడే ఆర్థిక భారాన్ని గణనీయంగా తగ్గించడంతో పాటు జాతీయ రహదారులపై టోల్ వసూళ్ల ప్రక్రియను మరింత వేగవంతం, పారదర్శకం చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది.

గౌతమి నగర్‌ను కమ్మేస్తున్న కాలుష్య భూతం...

రైస్ మిల్లుల పొగ, దుమ్ముతో ప్రజల ఉక్కిరిబిక్కిరి!

కలుషితమవుతున్న భూగర్భ జలాలు?

ఫిర్యాదులు ఎన్నో.. చర్యలు మాత్రం శూన్యం!



గౌతమి నగర్ /**ప్రజా తెలుగు శక్తి :** ఫెర్టిలైజర్ సిటీ: గౌతమి నగర్ ఫెర్టిలైజర్ సిటీ ప్రాంతంలో నిర్వహిస్తున్న రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న కాలుష్యం స్థానిక ప్రజలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రైస్ మిల్లుల బాయిలర్ల నుంచి వెలువడుతున్న దట్టమైన నల్లటి పొగ, వరి పొట్టు ధూళి, బూడిద కణాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రైస్ మిల్లుల చిమ్నీల నుంచి వెలువడుతున్న పొగ పరిసర ప్రాంతాలను కమ్మేస్తుండగా, ఇళ్లపై, ఆహార పదార్థాలపై, తాగునీటిపై బూడిద, ధూళి



పేరుకుపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు శ్వాస సంబంధిత సమస్యలు, దగ్గు, అలర్జీ, కళ్ల మంట వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు.

భూగర్భ జలాల కలుషితంపై ఆందోళన

మరోవైపు రైస్ మిల్లుల నుంచి వెలువడుతున్న బాయిలర్ బూడిద, వరి పొట్టు బూడిద, వ్యర్థ జలాల నిర్వహణపై కూడా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో, డ్రైనేజీల్లో వదులుతున్నారనే ఫిర్యాదులు వినిపిస్తున్నాయి. దీంతో భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ప్రాంతంలోని కొందరు కిడ్నీ సంబంధిత సమస్యలు, చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోగ్య సమస్యలకు కాలుష్యమే కారణమా అన్నది అధికారిక వైద్య, నీటి పరీక్షల ద్వారా నిర్ధారించాల్సి ఉంది.

కాలుష్య నియంత్రణ మండలి ఏం చేస్తోంది?

ఈ సమస్యలపై స్థానికులు పలుమార్లు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. సంబంధిత ఫిర్యాదులు నమోదైనా, ఆశించిన స్థాయిలో చర్యలు కనిపించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైస్ మిల్లులకు కాలుష్య నియంత్రణ అనుమతులు ఉన్నాయా? బాయిలర్లకు సరైన డస్ట్ కలెక్టర్లు, బ్యాగ్ ఫిల్టర్లు ఏర్పాటు చేశారా? వ్యర్థ జలాల శుద్ధి వ్యవస్థలు పనిచేస్తున్నాయా? చిమ్నీలు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ప్రజల ఆరోగ్యం కంటే రైస్ మిల్లులే ముఖ్యమా?

రైస్ మిల్లుల నిర్వహణకు ఎవరూ వ్యతిరేకం కాదు. కానీ వాటి నుంచి వెలువడే పొగ, దుమ్ము కారణంగా ప్రజల ఆరోగ్యం, పర్యావరణం దెబ్బతినడం ఎంతవరకు సమంజసం? కాలుష్య నియంత్రణ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా? తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తక్షణమే స్పందించి రైస్ మిల్లులపై తనిఖీలు నిర్వహించాలి. గాలి, భూగర్భ జలాల నమూనాలను పరీక్షించి, నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోవడం ఏమిటి? అధికారులు ఇప్పటికైనా స్పందించి గౌతమి నగర్ ప్రజలకు కాలుష్యం నుంచి విముక్తి

కల్పిస్తారా? వేచి చూడాలి.

ఎడిటర్ తాజ్ బాబా, ప్రత్యేక కథనం

మహిళలకు కేంద్రం గుడ్ న్యూస్ గ్యాస్ సిలిండర్లు ఫ్రీ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్కుంటే చాలు



కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన పథకాన్ని ఎప్పటినుంచో అమలు చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్, స్టవ్‌తో పాటు తొలి సిలిండర్ ఉచితంగా పొందవచ్చు. మహిళల కోసం కేంద్రం ఈ స్కీమ్ తీసుకొచ్చింది. దీనికి ఎలా దరఖాస్తు చేసుకోవాలనేది చూద్దాం. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అనేక పథకాలు అమలు చేస్తోంది. అందులో భాగంగా దేశవ్యాప్తంగా మహిళలకు ఉచిత గ్యాస్ కనెక్షన్, స్టవ్, సిలిండర్ అందిస్తోంది. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన స్కీమ్ ద్వారా వీటిని అందిస్తోంది. ప్రస్తుతం,ావీఖ్ 2.0 పథకాన్ని అమలు చేస్తుండగా.. దీనిని మరికొన్నేళ్ల పాటు పొడిగించాలని ఇటీవల నిర్ణయం తీసుకున్నారు. మరింతమందికి ఉచిత గ్యాస్ కనెక్షన్, సిలిండర్లపై సబ్సిడీ అందించాలని కేంద్రం నిర్ణయించింది. కట్టెల పొయ్యిపై ఆధారపడే మహిళలకు వంట గ్యాస్ అందించడమే ఈ స్కీమ్ లక్ష్యం. ఈ పథకం ద్వారా గ్యాస్ కనెక్షన్, స్టవ్, తొలి సిలిండర్ ఉచితంగా అందిస్తారు. ఆ తర్వాత సిలిండర్ రీఫిల్లింగ్‌పై రూ.300 సబ్సిడీ అందిస్తారు.

ఉజ్వల్ యోజన పథకానికి అర్హతలు ఏంటి..?

మహిళ వయస్సు 18 ఏళ్లు నిండి ఉండాలి

బీపీఎల్‌ఓ కుటుంబానికి చెందినవారై ఉండాలి

ఇప్పటివరకు కుటుంబంలో ఎవరి పేరుపై కూడా గ్యాస్ కనెక్షన్ కలిగి ఉండకూడదు

రేషన్ కార్డు ఉండాలి

కుటుంబ ఆదాయ వివరాలు ప్రభుత్వ అర్హతలను బట్టి ఉండాలి

దరఖాస్తుకు అవసరమైన డాక్యుమెంట్లు

ఆధార్, రేషన్, బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్, డిక్లరేషన్ ఫారం, అడ్రస్ ప్రూఫ్, కేవైసీ ఫారం

దరఖాస్తు చేసుకోవడం ఎలా..?

వెబ్‌సైట్లోకి వెళ్లండి

ఆన్‌లైన్ పోర్టల్ ఆప్షన్ ఎంచుకోండి

అనంతరం ఆయిల్ కంపెనీకి సంబంధించి వెబ్ సైట్లో లాగిన్ అవ్వండి

ఆ తర్వాత కొత్త కనెక్షన్ ఫారం నింపండి

అవసరమైన పత్రాలు సమర్పించండి

అనంతరం డిస్ట్రిబ్యూటర్లు మీ అప్లికేషన్‌ను పరిశీలించి ఆమోదిస్తారు

ఆ తర్వాత మీ నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకుండానే గ్యాస్ కనెక్షన్ మంజూరు చేయడంతో పటు స్టవ్, గ్యాస్ సిలిండర్ అందిస్తారు

రూ.300 సబ్సిడీ పొందటం ఎలా..?

ఈ పథకంలో ఉన్నవారికి తొలి సిలిండర్ ఉచితంగా అందిస్తారు. ఆ తర్వాత ఏడాదికి నాలుగు సిలిండర్ల బుకింగ్‌పై రూ.300 సబ్సిడీ అందిస్తారు. అంటే ఏడాదికి రూ.1200 సబ్సిడీ పొందవచ్చు. గతంలో ఏడాదికి ఆరు సిలిండర్లపై రూ.300 చొప్పున సబ్సిడీ అందించారు. కానీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతల క్రమంలో సబ్సిడీ సిలిండర్ల సంఖ్యపై కేంద్రం కోత విధించింది. నాలుగు సిలిండర్లకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది. ఏడాది నాలుగు సిలిండర్లు ఒక కుటుంబానికి సరిపోతాయనే అభిప్రాయానికి వచ్చింది. దీంతో సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. గ్యాస్ కనెక్షన్లు లేనివారు ఈ పథకం ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్ పొందవచ్చు.

అకౌంట్ నుంచి కట్ అయినా ఏటీఎం నుంచి డబ్బులు రాలేదా..? నో టెన్షన్ ఇలా చేస్తే మీ ప్రాబ్లం క్లియర్



నగదు అవసరాల కోసం కొన్నిసార్లు ఏటీఎం సెంటర్‌కు వెళతాం. డబ్బులు విత్ డ్రా చేయగానే.. అకౌంట్ నుంచి కట్ అవుతాయి కానీ మెషీన్ నుంచి బయటకు రావు. ఇలాంటి పరిస్థితి ప్రతీఒక్కరికీ ఎదురై ఉంటుంది. ఇలాంటప్పుడు ఆందోళన పడాల్సిన అవసరం లేదు. కొన్ని సందర్భాల్లో ఏటీఎం నుంచి డబ్బులు విత్ డ్రా చేసినప్పుడు అకౌంట్ నుంచి కట్ అయినా మెషిన్ నుంచి బయటకు రావు. ఇలా జరిగినప్పుడు వెంటనే డబ్బులు మీ అకౌంట్లోకి ఆటోమేటిక్‌గా రిటన్ అవుతాయి. కానీ కొన్నిసార్లు మీ అకౌంట్లోకి తిరిగి రావు. ఇలాంటి సమస్యలు చాలామంది ఎదుర్కొని ఉంటారు. ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు చాలామంది ముందుగా ఆందోళన పడుతుంటారు. డబ్బులు తిరిగి వస్తాయా.. లేదా అని భయపడుతుంటారు. ఏటీఎం మెషిన్‌లో టెక్నికల్ ప్రాబ్లం లేదా విద్యుత్ కోత కారణంగా ఇలాంటి సమస్యలు తలెత్తుతుంటాయి. అకౌంట్ నుంచి డబ్బులు కట్ అయినట్లు మొబైల్‌కు మెస్సేజ్ వచ్చినా ఏటీఎం మెషిన్ నుంచి బయటకు రావు.

ఎలా ఫిర్యాదు చేయాలి..?

అకౌంట్ నుంచి డెబిట్ అయినా ఏటీఎం నుంచి మెషీన్ రాకపోతే ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. ఈ మేరకు ఆర్బీఐ దీనికి సంబంధించి స్పష్టమైన నిబంధనలు తీసుకొచ్చింది. ఇలాంటి సందర్భాల్లో మీ డబ్బు సురక్షితంగా ఉంటుంది. మీరు సులువుగా తిరిగి పొందే అవకాశముంది. అయితే మీరు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఏటీఎం నుంచి వచ్చే స్లిప్‌ను తీసుకుని భద్రపర్చుకోవాలి. ఒకవేళ స్లిప్ రాని పక్షంలో మొబైల్‌కు వచ్చే మెస్సేజ్‌ను స్క్రీన్ షాట్ తీసి పెట్టుకోవాలి. ఆ తర్వాత ఏటీఎం మెషిన్ లేదా ఏటీఎం లోపల క్యాబిన్లపై ప్రదర్శించబడి ఉంటే బ్యాంక్ టోల్ ఫ్రీ నెంబర్లకు కాల్ చేయాలి. మీ సమస్యను సిబ్బందికి చెబితే పరిష్కరిస్తారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం మీరు ఫిర్యాదు చేసిన ఐదు పని దినాల్లో డబ్బులు తిరిగి అందించాల్సి ఉంటుంది.

ఆటోమేటిక్‌గా జమ కాకపోతే ఏం చేయాలి..?

ఆటో రివర్సల్ సిస్టమ్, ఆధునిక టెక్నాలజీ వల్ల 24 గంటల్లో కస్టమర్ ఖాతాల్లో డబ్బు ఆటోమేటిక్‌గా జమ అవుతుంది. ఒకవేళ ఐదు వర్కింగ్ డేస్‌లో మీ డబ్బును తిరిగి జమ చేయకపోతే ప్రతీ రోజుకు రూ.100 చొప్పున బ్యాంక్ జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. కస్టమర్‌కు ఫిర్యాదు చేసినా సమస్య అలాగే ఉంటే.. ఎం.టీఎఆ.శీతీస్ర.ఆఆ వెబ్ సైట్ ద్వారా ఆర్బీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. మీ డబ్బుకు వడ్డీ, జరిమానాతో సహా తిరిగి చెల్లించేలా బ్యాంక్‌పై ఆర్బీఐ చర్యలు తీసుకుంటుంది. దీంతో ఖాతాదారులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు.

జస్ట్ రూ.500లతో డిమార్ట్‌లో ఇన్ని వస్తువులు కొనొచ్చా? ఈ సీక్రెట్ ఇన్నాళ్లు తెలీదే!



మన ఇంట్లో సరుకులు అయిపోయాయి.. అంటే వెంటనే డీమార్ట్‌కు పరిగెడతాం.. అయితే రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర వస్తువల ధరలు జనాలను గందరగోళానికి గురిచేస్తున్నాయి. చాలా మంది లిమిటెడ్ బడ్జెట్‌తో డిమార్టుకు వచ్చిన.. డబ్బులు సరిపోకా సగం, సగం వస్తువులను మాత్రమే తీసుకెళ్తూ ఉంటారు. కానీ జస్ట్ రూ.500లతో ఇంట్లోకి కావాల్సిన అన్ని నిత్యావసర వస్తువులు ఎలా కొనాలి, స్మార్ట్ షాపింగ్‌తో డబ్బులను ఎలా ఇదా చేయాలో ఇక్కడ తెలుసుకుందాం. మన ఇంట్లో వాడే నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ భారీ పెరిగిపోతూ ఉండడంతో.. నెలవారీ కిరాణా బడ్జెట్‌ను నిర్వహించడం సమాన్య ప్రజలకు పెద్ద తలనొప్పిగా మారిపోయింది. ముఖ్యంగా లిమిటెడ్ బడ్జెట్‌తో నెలవారి ఖర్చులను మెయింటేన్ చేసే వారికి ఇది పెద్ద సవాలనే చెప్పాలి. ఎందుకంటే వారి బడ్జెట్‌లో బియ్యం, పప్పులు, వంటనూనె వంటి వస్తువల కొనడం కష్టంగా మారుతోంది. కానీ సరైన ప్రణాళికతో డి-మార్ట్ వంటి సూపర్ మార్కెట్లలో వీటిని కేవలం రూ. 500 బడ్జెట్‌లోనే కొనుగోలు చేయవచ్చని నిపుణులు చెబుతున్నారు. కాబట్టి రూ.500లో ఇంట్లోకి కావాల్సిన ఏ ఏ వస్తువలు కొనొచ్చో ఇక్కడ చూద్దాం.

రూ. 500 బడ్జెట్ లో ఏ ఏ వస్తువులు కొనొచ్చు?

హైదరాబాద్ వంటి పెద్ద పెద్ద నగరాల్లో ఉండే వారు డీమార్ట్ స్టోర్లు లేదా డీమార్ట్ రెడీ ప్లాట్‌ఫామ్‌లో దొరికే డిస్కౌంట్లను వాడుకొని కేవలం రూ. 500 లోపే ఇంట్లోకి కావాల్సిన నిత్యావసర కిరాణ వస్తువులను కొనుగోలు చేయవచ్చు. ఉదాహరణకు మీ ఇంట్లో కావాల్సిన వస్తువుల ధరలు డిమార్ట్‌లో చూసుకుంటే.. ఒక కేజీ బియ్యం: రూ. 71, ఒక కేజీ శనగపప్పు: రూ. 119 , 500 గ్రాముల మసూర్ పప్పు: రూ. 50 , 870 గ్రాముల రైస్ బ్రాన్ ఆయిల్: రూ. 177 , 500 గ్రాముల అటుకులు: రూ. 40.. ఈ ఐదు నిత్యావసర వస్తువుల మొత్తం ఖర్చు కలిపితే కేవలం రూ. 457 మాత్రమే అవుతుంది. మన ఇంట్లో రోజువారికి వంటకు కావాల్సిన బియ్యం, పప్పు, నూనెతో పాటు బ్రేక్‌ఫాస్ట్‌కు కావాల్సిన అటుకులు కూడా జస్ట్ రూ.500 బడ్జెట్‌లో వచ్చేస్తాయి. మిగిలిన రూ. 43తో ఆ రోజు అవసరానికి తగినట్లుగా ఉప్పు ప్యాకెట్, చిన్న మసాలా దినుసులు, లేదా అర కిలో ఉల్లిపాయలు, కొద్దిపాటి కూరగాయలను కూడా మీరు కొనుగోలు చేయవచ్చు. ఇలా స్మార్ట్‌గా షాపింగ్ చేస్తే మీ రోజువారి ఇంట్లోకి కావాల్సిన వస్తువులను ఈజీగా పొందవచ్చు. అంతేకాదు బయట ధరలు, వీటితో పోల్చుకుంటే డీమార్ట్‌లో మీకు తక్కువ ధరకే వస్తువులు లభిస్తాయి. అవును వీటా, ఢీమార్ట్ ధరలను పోలిస్తే.. ఈ తేడా మీకే తెలుస్తోంది.

డిమార్ట్ డిస్కౌంట్స్‌తో ఎంత ఆదా చేయవచ్చు!

నార్మల్ బియ్యం ఎంఆర్‌పి ధర రూ. 90 ఉంటే డీమార్ట్ డిస్కౌంట్‌లో మీకు ధర రూ. 71కే లభిస్తుంది. అలాగే శనగపప్పు ఎంఆర్‌పి రూ. 153 కాగా డిమార్ట్ డిస్కౌంట్‌తో అది రూ. 119 వస్తుంది. ఇలా మసూర్ పప్పు ఎంఆర్‌పి రూ. 68 కాగా డిస్కౌంట్ ధర రూ. 50, నూనె ఎంఆర్‌పి రూ. 219 కాగా తగ్గింపుతో రూ. 177, అటుకులు ఎంఆర్‌పి రూ. 56 కాగా డిస్కౌంట్ ధర రూ. 40కి వస్తాయి. వీటిని మీరు ఆఫర్ లేకుండా పూర్తి వీటా ధర చెల్లించి కొంటే.. మొత్తం రూ.586 అవుతుంది. కానీ డీమార్ట్ డిస్కౌంట్‌లో ఇవి మీకు కేవలం రూ. 457కే వస్తాయి. అంటే ఈ స్మార్ట్ షాపింగ్ ద్వారా మీరు రూ. 129 వరకు ఆదా చేయవచ్చు.

డేటింగ్ అంటేనే భయం, ప్రేమకు సైతం
దూరం.. అదే 'క్రష్ రిసెషన్' ట్రెండ్!

డేటింగ్ అంటేనే భయం, ప్రేమకు సైతం దూరం.. అదే 'క్రష్ రిసెషన్' ట్రెండ్!



ప్రేమ పుట్టడం, ఒకరిపై ఒకరికి ఇష్టం కలగడం అనేది ఒకప్పుడు ఎంతో మధురాతిమధురమైన అనుభూతి. కానీ నేటి డిజిటల్ యుగంలో ఆ భావనే ఒక పెద్ద భారంగా మారుతోంది. ఇష్టమైన క్రష్ కోసం సమయం కేటాయించడం, ఎమోషనల్ ప్రెజర్ భరించడం అంటే ఏదో 'సెకెండ్ జాబ్' చేసినంత కష్టంగా కనిపిస్తోంది యువతకు. సరిగ్గా ఈ నేపథ్యంలోనే ఇంటర్నెట్ ప్రపంచంలో ఒక సరికొత్త పదం ట్రెండ్ అవుతోంది.. అదే 'క్రష్ రిసెషన్' దీని ప్రకారం.. ఆధునిక డేటింగ్‌లోని సంక్లిష్టతలు, ఎమోషనల్ స్ట్రెయిన్ కారణంగా నేటి జెన్-జీ తరం ప్రేమ వ్యవహారాలకు, క్రష్‌ల సాహసాలకు దూరంగా ఉండాలనుకుంటోంది. అలా అని ప్రేమ లేకపోవడం కాదది, ఆ రిలేషన్‌షిప్ తెచ్చిపెట్టే మానసిక ఒత్తిడిని భరించే శక్తి లేకపోవడమే ఈ కొత్త ట్రెండ్‌కు అసలు కారణం అంటున్నారు విశ్లేషకులు.

స్వైప్‌ల సంస్కృతి.. ఎమోషనల్ డ్రామా

చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు.. క్షణాల వ్యవధిలో ఎవరితోనైనా కనెక్ట్ కావచ్చు, ఎవరినైనా ఎంచుకోవచ్చు. కానీ ఈ డిజిటల్ లభ్యత కారణంగానే ఒక్కరిపై ఎమోషనల్‌గా ఆధారపడటం నేటి యువతకు ఎంతో రిస్క్‌తో కూడుకున్న పనిలా అనిపిస్తోంది. 'సమాజంలో ఆకర్షణ అనేది ఒకప్పుడు చాలా వ్యక్తిగత అనుభూతిగా ఉండేది, కానీ నేడు చిన్న క్రష్ కూడా బహిరంగ వేదికపై నిలబెట్టినట్లు అనిపిస్తోంది" అని ప్రముఖ డేటింగ్ కోచ్ జూలీ గ్విన్ అభిప్రాయపడ్డారు. గంటల తరబడి మెసేజ్‌లు డికోడ్ చేయడం, సిచుయేషన్‌షిప్స్ చిక్కుల్లో పడటం, అవతలి వారి నుంచి ఎలాంటి స్పందన వస్తుందోనని తెగ ఆలోచించడం.. వీటన్నింటిని మించి ప్రేమ వ్యవహారాలు అనవసరమైన 'ఎమోషనల్ అడ్మిన్' పనులను తలపిస్తున్నాయి.

అదొక బర్న్‌అవుట్.. పెద్ద టాస్క్

అసలే ఆర్థిక ఒడిదుడుకుల మధ్య బతుకుతున్న నేటి తరానికి డేటింగ్ అనేది పెద్ద టాస్క్‌లా మారుతోందని ఆధునిక యువతలో చాలామంది భావిస్తున్నారు. రేపు విడిపోయి గుండె కోత మిగిల్చే ఒక రిలేషన్‌షిప్ కోసం ముందుగానే ఆరాట పడటం, మానసిక క్షోభను భరించడం ఎందుకనే ఆలోచన జెన్-జీలో బలంగా నాటుకుపోతోంది. కైన్సే ఇన్‌స్టిట్యూట్ మ్యూన్.కామ్ సంయుక్తంగా నిర్వహించిన ఒక సర్వేలో కూడా ఇలాంటి దిగ్భ్రాంతికర విషయాలే వెల్లడయ్యాయి. సర్వేలో పాల్గొన్న సింగిల్స్‌లో ఏకంగా 53 శాతం మంది డేటింగ్ బర్న్‌అవుట్‌ను ఎదుర్కొంటున్నట్లు తెలుపగా.. 46 శాతం మంది రీచార్జ్ కావడానికి డేటింగ్ రంగానికి కొద్ది రోజులు బ్రేక్ ఇచ్చారు. సమస్య క్రష్ వల్ల కాదు, దాని తర్వాత వచ్చే అనవసర మానసిక ఒత్తిడి వల్లనే అని గ్రహించిన ఈ తరం.. ప్రశాంతత కోసం ప్రేమకు కాస్త దూరంగా ఉండటమే మేలని భావిస్తోంది.

శరత్కాలపు సోయగం.. పల్లెది
హృదయంలో వెల్లివెరిసే ప్రకృతి దృశ్యం!

శరత్కాలపు సోయగం.. పల్లె హృదయంలో వెల్లివెరిసే ప్రకృతి దృశ్యం!



శరదృతువు.. ఏడాది మొత్తంలో దీనికో ప్రత్యేకత ఉంటుందని మీకు తెలుసా? ఎందుకంటే.. తొలకరి ఉధృతి తగ్గి, మబ్బుల ముసుగులు తొలగినవేళ.. ఆకాశం నిర్మలమైన నీలిరంగు దర్పణంలా ఆవిష్కృతమవుతుంది. సెప్టెంబర్ చివరి వారం నుంచి అక్టోబర్ మాసం చివరి వరకు ఇది కొనసాగుతుంది. తెలుగు నెలలైన.. ఆశ్వయుజం, కార్తీక మాసాలు ఈ రుతువులోనే వస్తాయి. ప్రకృతే ఒక నూతన ఉత్తేజంతో ఊపిరి పోసుకునే ఈ కాలంలో, గ్రామీణ, అటవీ ప్రాంతాలు వర్ణించలేని ఆహ్లాదాన్ని సంతరించుకుంటాయి. గాలిలో తేలియాడే చిన్నపాటి చలి, పరిమళించే పూల తావుల నడుమ పల్లెటూరు ఒక అందమైన ప్రకృతి దృశ్యంగా రూపాంతరం చెందుతుంది. చల్లని వెన్నెల వెలుగులు, స్వచ్ఛమైన జలాశయాలు, ఊరి జీవనంలో వెల్లివిరిసే ఆత్మీయతలు ప్రతి ఒక్కరి హృదయాన్ని ఆకట్టుకుంటాయి. శరదృతువు తెచ్చే ఈ నూతన మార్పులు, నాటి మధుర జ్ఞాపకాలను మీ ముందుకు తెచ్చే ప్రత్యేక కథనం!

సెలయేటి తీరాలు.. తేటనీటి గురుతులు

వానాకాలపు బురద నీటి ప్రవాహాలు తగ్గి, అడవుల గుండా కొండకోనలను తాకుతూ పారే సెలయేళ్లు శరదృతువులో నీటి అడుగు భాగం సైతం పైకి కనిపించేంత తేటగా రూపాంతరం చెందుతాయి. నీరు ఎంత స్వచ్ఛంగా మారుతుందంటే.. అడుగున ఉన్న గులకరాళ్లు, అందులో ఈదే చిన్న చేపలు కూడా స్పష్టంగా కనిపిస్తూ కనువిందు చేస్తుంటాయి. వేకువజామున అటవీ ప్రాంతాల్లోని సెలయేటి ఒడ్డున నడుస్తుంటే, చుట్టూ వికసించిన తెల్లటి కలువలు, గాలికి ఊగే నాచు పొదలు ఒక సరికొత్త లోకంలోకి తీసుకెళ్తాయి. ఉదయపు లేత భానుడి కిరణాలు సెలయేటి అలలపై పడినప్పుడు, ఆ నీరు వజ్రాల రాశిలా మెరిసిపోతుంది. దానికి తోడు పరిసరాల్లో వినబడే పక్షుల కిలకిలరావాలు, పారే నీటి సవ్వడి కలసి మనుషుల మనసులోని సమస్త ఒత్తిడిని తుడిచిపెట్టి, మానసిక ప్రశాంతతను, ఆనందాన్ని నింపుతాయి.

ఊరి చెరువు.. నిశ్శబ్ద తరంగాల నిలయం

గ్రామీణ జీవనానికి, ఆత్మీయతకు సజీవ సాక్ష్యం ఊరి చెరువు. వానాకాలంలో పొంగిపొర్లిన చెరువులు ఈ శరత్కాలంలో తేటనీటితో నిశ్చలంగా మారిపోతాయి. చెరువు ఒడ్డున ఉన్న పచ్చని తుమ్మ చెట్లు, గాలికి ఊగే రెల్లు పొదలు, గునుగు పూలు, తంగేడు పూలు, నీటి ఉపరితలంపై అలల్లా తేలియాడే తామరపాదులు చెరువు మొత్తానికి సరికొత్త శోభను తెచ్చిపెడతాయి. సాయంత్రపు వేళల్లో సూర్యుడు అస్తమిస్తున్నప్పుడు.. అలా చెరువు గట్టున కూర్చొని ఒక్కో గులకరాయిని నీటిలో విసురుతూ ఉన్నప్పుడు కలిగే ఆనందం, హృదయాంతరంగం నుంచి పొంగిపొర్లే భావాలు చాలామంది 90ం కిడ్స్ జీవితాల్లో ఒక భాగమని చెప్పొచ్చు. గ్రామస్తులు, వయోవృద్ధులు చెరువు గట్టుపై కూర్చుని మాట్లాడుకుంటూ, గూటికి చేరుకునే పక్షుల గుంపులను చూడటం ఒక అందమైన అనుభూతి. నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ గడిపే ఆ క్షణాలు ప్రతి ఒక్కరి మదిలో చెరగని సంతకంలా నిలిచిపోతాయి.

పండగల్లోనూ ప్రత్యేకతే..

శరదృతువు కేవలం వాతావరణంలోనే కాదు, పల్లెల్లో ప్రతి ఒక్కరి హృదయాలలోనూ నూతనోత్సాహాన్ని నింపుతుంది. బతుకమ్మ, దసరా పండుగల కోలాహలం మొదలయ్యేది ఈ రుతువులోనే. ప్రకృతి ప్రసాదించిన వరంగా గునుగు, తంగేడు, చామంతి, గుమ్మడి పూలతో ఊరంతా వర్ణశోభితంగా ముస్తాబవుతుంది. సాయంత్రం వేళల్లో ఆడుకునే బతుకమ్మ పాటలు, అలయ్-బలయ్ ఆత్మీయ ఆలింగనాలు గ్రామీణ సంస్కృతిని సజీవంగా నిలుపుతాయి. రాత్రివేళల్లో ఆకాశం నుంచి కురిసే అమృతంలాంటి తెల్లటి వెన్నెల, పొలాల నుంచి వీచే పైరు సువాసనలు నాటి బాల్యాన్ని, మధురమైన క్షణాలను మళ్లీ మళ్లీ గుర్తుచేస్తాయి. ప్రకృతి-మానవుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ శరత్కాలపు అనుభవాలు కాలం మారినా కలకాలం చెరగని మధుర జ్ఞాపకాలుగా మన గుండెల్లో పదిలంగా ఉంటాయి.

కప్‌కేక్స్'తో మొదలై కోట్లల్లో సంపాదన.. 18 ఏళ్లకే బిజినెస్ క్వీన్!

కాలేజీ కెఫెటేరియాలో కప్‌కేక్స్ అమ్మడం ద్వారా మేఘన తన బేకింగ్ ప్రయాణాన్ని ప్రారంభించింది.



వయస్సు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమేనని, కృషి, పట్టుదల, కొత్తదనం తోడైతే సాధించలేనిది ఏదీ లేదని నిరూపిస్తోంది బెంగళూరుకు చెందిన యువ మహిళా పారిశ్రామికవేత్త మేఘనా జైన్. కేవలం 18 సంవత్సరాల ప్రాయంలోనే బేకింగ్‌పై ఉన్న అభిరుచితో చిన్నగా మొదలుపెట్టిన ఒక వ్యాపారాన్ని, నేడు దేశంలోనే ప్రముఖ ప్రీమియం గిఫ్టింగ్ ఁ డెజర్ట్ బ్రాండ్‌గా తీర్చిదిద్దింది. కలలను నిజం చేసుకుంటూ, ఎందరో మహిళలకు ఉపాధి కల్పిస్తూ విజయవంతమైన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మేఘనా స్ఫూర్తిదాయక జర్నీ ఇవాళ్టి యూత్‌కు గొప్ప ఇన్సిపిరేషన్ అని చెప్పవచ్చు!

కెఫెటేరియా నుంచి కోటి రూపాయల దాకా

కాలేజీ కెఫెటేరియాలో కప్‌కేక్స్ అమ్మడం ద్వారా మేఘన తన బేకింగ్ ప్రయాణాన్ని ప్రారంభించింది. బేకింగ్ రంగంలో అనుభవం గడిస్తూ 'డ్రీమ్ ఏ డజన్' పేరుతో సొంత బ్రాండ్‌ను ఏర్పాటు చేసింది. అయితే కరోనా పాండమిక్ సమయంలో తీవ్ర ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ, ఆమె వెనకడుగు వేయలేదు. తన బిజినెస్ మోడల్‌ను రీ-ఇన్వెంట్ చేస్తూ కుకీస్, చాక్లెట్లు, క్రాకర్స్, ఆకర్షణీయమైన గిఫ్ట్ హ్యాంపర్‌లను మార్కెట్‌లోకి తెచ్చింది. ఫలితంగా ఆర్థిక సంవత్సరం 21 (లో రూ. 30 లక్షల రాబడితో ఉన్న ఈ కంపెనీ, ఖీ24 నాటికి ఏకంగా రూ. 1 కోటికి పైగా రెవెన్యూ సాధించి అద్భుతమైన ప్రగతిని నమోదు చేసింది. శరత్కాలపు సోయగం.. పల్లె హృదయంలో వెల్లివెరిసే ప్రకృతి దృశ్యం!

వందకు పైగా ఉత్పత్తులు

మేఘనా జైన్ నేతృత్వంలోని 'డ్రీమ్ ఏ డజన్' విజయంలో అత్యంత కీలకమైనది ఇండియన్ ఫ్లేవర్లను బేకింగ్‌లో సమ్మేళనం చేయడం. మన దేశీయ రుచులైన నెయ్యి, పిస్తా, యాలకులు వంటి సాంప్రదాయ సువాసనలను ఆధునిక డెజర్ట్‌లతో జోడించి సరికొత్త ఉత్పత్తులను తయారుచేస్తున్నారు. ప్రస్తుతం ఈ బ్రాండ్ పరిధిలో కప్‌కేక్స్, కేకులు, చీజ్‌కేక్‌లతో పాటు విభిన్నమైన కస్టమైజ్డ్ గిఫ్టింగ్ ఆప్షన్లు సహా 100కు పైగా ప్రొడక్ట్స్ అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అభిరుచులకు తగినట్లుగా ఉత్పత్తులను మార్చడమే ఈ బ్రాండ్ సక్సెస్ మంత్రంగా మారింది.


98 % మహిళా సాధికారత

'డ్రీమ్ ఏ డజన్' కేవలం ఒక వ్యాపారంగా లేదా లాభాల ఆర్జనకే పరిమితం కాలేదు. సమాజంలో మహిళా సాధికారతకు ఒక వేదికగా నిలిచింది. ఈ సంస్థలో పనిచేస్తున్న సిబ్బందిలో 98 శాతం మంది మహిళలే ఉండటం విశేషం. ఎంతోమంది మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, వారి జీవితాల్లో వెలుగులు నింపుతోంది మేఘన. అభిరుచికి ఆవిష్కరణలు తోడైతే ఎంతటి అడ్డంకినైనా దాటి విజేతగా నిలవవచ్చని నిరూపిస్తున్న ఈ యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్ జర్నీ ఈతరం యువతకు ఆదర్శమని చెప్పవచ్చు.

శస్త్రచికిత్స లేకుండానే.. గుండె కణాల పునరుత్పత్తి సాధ్యమేనా?

అనే మరొక ప్రొటీన్‌ను జతచేసినప్పుడు, కణాల పునరుత్పత్తి సామర్థ్యం దాదాపు పదిరెట్లకు పైగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు.

శస్త్రచికిత్స లేకుండానే.. గుండె కణాల పునరుత్పత్తి సాధ్యమేనా?




మానవ శరీరంలోని అత్యంత కీలకమైన అవయవాల్లో గుండె ఒకటి. గుండెపోటు లేదా ఇతర సమస్యల వల్ల గుండె కణాలు దెబ్బతింటే, అక్కడ ఏర్పడే మచ్చ కణజాలంవల్ల గుండె బలహీనపడుతుంది. అయితే.. అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినాస్కూల్ ఆఫ్ మెడిసిన్'కు చెందిన శాస్త్రవేత్తలు ఇటీవల కనిపెట్టిన ఒక అద్భుతమైన ఆవిష్కరణ, గుండె తనను తాను స్వయంగా బాగుచేసుకునేలా చేసేందుకు సరికొత్త మార్గాన్ని సుగమం చేసింది. భవిష్యత్తులో పెద్దస్థాయి శస్త్రచికిత్సలు లేకుండానే దెబ్బతిన్న గుండెను తిరిగి ఆరోగ్యవంతంగా మార్చే దిశగా ఈ పరిశోధన ఒక విప్లవాత్మక మలుపుగా నిలవనుందని చెబుతున్నారు.దేటింగ్ అంటేనే భయం, ప్రేమకు సైతం దూరం.. అదే 'క్రష్ రిసెషన్' ట్రెండ్!మెదడు ప్రొటీన్‌తో గుండెకు సంజీవని సాధారణంగా మెదడు కణాల ఉత్పత్తికి తోడ్పడే 1' అనే ప్రొటీన్, గుండెలోని మచ్చ కణజాలాన్ని తిరిగి ఆరోగ్యకరమైన కండర కణాలుగా మార్చగలదని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ ప్రొటీన్ గుండె కణాల పునర్నిర్మాణ ప్రక్రియలో అత్యంత ప్రభావవంతంగా పనిచేస్తుండటం తమను ఆశ్చర్యపరిచిందని పరిశోధకులు చెబుతున్నారు. ప్రధానంగా గుండె పనితీరును మెరుగుపరచడంలో ఈ ప్రొటీన్ పాత్ర అత్యంత కీలకమైనదని ఈ అధ్యయనం నిరూపించింది.

రెండు ప్రొటీన్ల మ్యాజిక్ కాంబినేషన్

పరిశోధనలో భాగమైనప్రొటీన్‌కు 'వీవట2ఛ' అనే మరొక ప్రొటీన్‌ను జతచేసినప్పుడు, కణాల పునరుత్పత్తి సామర్థ్యం దాదాపు పదిరెట్లకు పైగా పెరిగినట్లు శాస్త్రవేత్తలు కనుగొన్నారు. గతంలో గుండె కణాలను రీప్రోగ్రామ్ చేయడానికి మూడు లేదా అంతకంటే ఎక్కువ రకాల ప్రొటీన్లు, సంక్లిష్టమైన పద్ధతులు అవసరమయ్యేవి. కానీ ఈ రెండు ప్రొటీన్ల కాంబినేషన్ చాలా సులభంగా, అత్యంత వేగంగా, సమర్థవంతంగా పనిచేస్తూ పాత పద్ధతుల కంటే మెరుగైన ఫలితాలను అందించింది. ఫిట్‌నెస్ అంటే జస్ట్ ట్రెండ్ మాత్రమే కాదు.. అదొక లైఫ్‌స్టైల్!శస్త్రచికిత్స లేని భవిష్యత్ కోసం.. ఈ రెండు ప్రొటీన్ల కాంబినేషన్‌తో ఒక ఇంజెక్షన్ రూపాన్ని తయారు చేయడమే తమ తదుపరి లక్ష్యంగా శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. ఒకవేళ ఈ ఇంజెక్షన్ అందుబాటులోకి వస్తే ఓపెన్ హార్ట్ సర్జరీలు లేదా క్లిష్టమైన శస్త్రచికిత్సలు లేకుండానే, కేవలం ఒకే ఒక్క ఇంజెక్షన్ ద్వారా దెబ్బతిన్న గుండెను తిరిగి ఆరోగ్యవంతంగా మార్చవచ్చు. అంతేకాకుండా, ఈ ప్రొటీన్ల చికిత్స విధానం భవిష్యత్తులో గుండెకే కాకుండా, శరీరంలోని ఇతర అవయవ కణాల పునరుత్పత్తికి కూడా ఉపయోగపడుతుందని పరిశోధకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

బరువు తగ్గేందుకు "మందులు" వాడుతున్నారా?
సడెన్‌గా ఆపేస్తే ఎదురయ్యే పరిణామాలివే!

బరువు తగ్గేందుకు మందులు వాడే వారికి అలర్ట్? మందులు ఆపేయాలని అనుకునేముందు ఈ విషయాలు తెలుసుకోవాలని నిపుణుల సూచన!



మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, గంటల తరబడి ఒకే దగ్గర కూర్చోని చేసే ఉద్యోగాలు.. ఇలా కారణాలు ఏవైతేనేమి బరువు పెరిగే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా మెజార్టీ పీపుల్? ఊబకాయంతో ఇబ్బందిపడుతున్నారు. ఈ క్రమంలోనే బరువు తగ్గేందుకు కొద్దిమంది సహజ పద్ధతులను పాటిస్తే.. మరికొద్దిమంది మాత్రం రకరకాల మందులను వాడుతుంటారు. అందులో జీఎల్‌పీ-1 రకం మందులు ఒకటి. చాలా మంది డాక్టర్ ప్రిస్క్రిప్షన్? లేకుండా? సొంతంగా కొనుక్కొని వాడుతుంటారు. అయితే ఇది మంచి పద్ధతి కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. డాక్టర్ సలహా లేకుండా వీటిని వాడటం తగదంటున్నారు. నిజానికివి దీర్ఘకాలం వాడుకోవాల్సిన మందులని వివరిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ మందులు వాడటం వల్ల ఏం జరుగుతుంది? ఉన్నట్టుండి ఆపేయడం వల్ల జరిగే పరిణామాలు ఈ స్టోరీలో చూద్దాం.జీఎల్?పీ అంటే గ్లూకగాన్-లైక్ పెప్టైడ్ అని, ఇది మన శరీరంలో, ముఖ్యంగా మనం ఆహారం తిన్న సమయంలో పేగులు సహజంగా విడుదల చేసే ఒక రకమైన హార్మోన్ అని నిపుణులు చెబుతున్నారు. బరువు తగ్గడానికి, షుగర్? కంట్రోల్? కోసం వాడే మందులను జీఎల్?పీ-1 రిసెప్టార్ అగోనిస్ట్స్ అంటారని.. ఇవి మన శరీరంలోని సహజ జీఎల్?పీ హార్మోన్ లాగే పని చేస్తాయని వివరిస్తున్నారు. ఈ మందులు కేవలం బరువు తగ్గడానికి, డయాబెటిస్ నియంత్రణకు మాత్రమే కాకుండా, శరీరంలోని వివిధ అవయవాల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయని నేషనల్? ఇన్?స్టిట్యూట్? ఆఫ్? హెల్త్ మందులు టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారిలో దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధి, గుండెపోటు, పక్షవాతం, హృదయ సంబంధ మరణాల రేట్లను తగ్గిస్తాయని వివరిస్తున్నారు.

ఈ మందులను ఆపేస్తే ఏం జరుగుతుంది:

ఆకలి పెరగటం: జీఎల్‌పీ-1 మందులు ఆకలిని అదుపులో ఉంచుతాయని.. వీటిని ఆపేస్తే తిరిగి ఆకలి పెరుగుతుందంటున్నారు నిపుణులు. ముఖ్యంగా చిరుతిళ్లు, జంక్?ఫుడ్? మీదికి మనసు మళుతుందని వివరిస్తున్నారు.బరువు పెరగటం: బరువు తగ్గేందుకు ఉపయోగించే ఈ మందులను ఆపడం వల్ల ఏడాదిలోపు మళ్లీ బరువు పెరుగుతారని నిపుణులు చెబుతున్నారు. ఊబకాయం ఉన్న వ్యక్తులలో వాడకాన్ని నిలిపివేయడం వల్ల శరీర బరువు పెరగడంతో పాటు నడుము చుట్టుకొలత,, సిస్టోలిక్ బ్లడ్ ప్రెజర్, ఫాస్టింగ్ ప్లాస్మా గ్లూకోజ్ కూడా పెరిగినట్లు నేషనల్ ఇన్‌స్టిట్యూట్? ఆఫ్ హెల్త్ ఓ పరిశోధనలో వెల్లడించిందని వివరిస్తున్నారు. ఇక టైప్? 2 డయాబెటిస్ ఉండి, బరువు తగ్గడానికి మందులు వాడుతూ, ఆకస్మాత్తుగా ఆపేసిన వారిలో కూడా పలు మార్పులు వచ్చినట్లు స్పష్టం చేస్తున్నారు. ఇక ఆహార, వ్యాయామ నియమాలు పాటించకపోతే బరువు మరింత పెరుగుతారని నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్లూకోజు పెరగటం: ప్రీ డయాబెటిస్? ఉండి, బరువు పెరిగినట్లయితే ఇన్సులిన్ నిరోధకత మరింత పెరుగుతుందని.. ఇది మధుమేహానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ అప్పటికే మధుమేహం ఉన్నవారు ఆకస్మాత్తుగా మందులు మానేస్తే రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయని చెబుతున్నారు. అయితే షుగర్? లెవల్స్? పెరగడం అనేది ఆరోగ్యానికి అంత మంచిది కాదంటున్నారు. ముఖ్యంగా కిడ్నీలు, కళ్లు, గుండె

నాల్గవ హీరోను పరిచయం చేయనున్న శ్రీలీల..!



శ్రీలీల గత ఏడాది మూడు సినిమాలతో వచ్చింది. అందులో జూనియర్ కాస్త పర్వాలేదు అనిపించినా మిగిలిన సినిమాలు ఆమెకు తీవ్రంగా నిరాశను మిగిల్చాయి. దాంతో శ్రీలీల పని అయిపోయిందని కొందరు సోషల్ మీడియాలో కామెంట్స్ చేశారు. ఈ ఏడాది ఆరంభంలో పరాశక్తితోనూ ఫ్లాప్‌ను చవిచూసిన శ్రీలీలకి ఉస్తాద్ భగత్ సింగ్‌తో కాస్త ఊరట దక్కిందని చెప్పాలి. ప్రస్తుతం టాలీవుడ్‌లో శ్రీలీల చేస్తున్న సినిమాలు ఏంటి అంటే ఠక్కున చెప్పే పరిస్థితి లేదు. ఎందుకంటే ఆమె ఒకటి రెండు సినిమాలకు పరిశీలిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. కానీ ఇప్పటి వరకు ఆమె సినిమాను కన్ఫర్మ్ చేయలేదు. మరో వైపు బాలీవుడ్‌లో అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాలో హీరోగా కార్తీక్ ఆర్యన్ నటిస్తున్నాడు. త్వరలోనే ఆ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. మోక్షజ్ఞ హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో మూవీ... ఈ సమయంలో నందమూరి మోక్షజ్ఞ హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో రూపొందబోతున్న సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ వారు తాజాగా ఆమెతో చర్చలు జరిపారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. బాలకృష్ణ సూచన మేరకు మోక్షజ్ఞకు జోడీగా శ్రీలీలను హీరోయిన్‌గా ఎంపిక చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఈ మధ్య కాలంలో మోక్షజ్ఞ సినిమాపై భారీ హైప్ క్రియేట్ అయిన విషయం తెల్సిందే. దాంతో హీరోయిన్ ను సైతం అదే స్థాయిలో బాలీవుడ్ నుంచి దించుతారని అంతా భావించారు. కానీ బాలకృష్ణ ఈ సినిమా కోసం శ్రీలీల అయితే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తం చేయడంతో దర్శకుడు వశిష్ఠ లుక్ టెస్ట్‌కి రెడీ అయ్యాడని తెలుస్తోంది. మోక్షజ్ఞ, శ్రీలీలపై లుక్ టెస్ట్ చేయడంతో పాటు, కొన్ని సీన్స్ సైతం షూట్ చేసి పరిశీలించే అవకాశాలు ఉన్నాయని సమాచారం అందుతోంది. ముగ్గురు హీరోల మొదటి సినిమాల్లో శ్రీలీల హీరోయిన్... మోక్షజ్ఞ మొదటి సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తే అరుదైన రికార్డ్ ఆమె సొంతం అవుతుంది. ఇప్పటి వరకు ముగ్గురు హీరోలను శ్రీలీల ఇండస్ట్రీకి పరిచయం చేసింది. కన్నడ హీరో విరాట్ మొదటి సినిమా 'కిస్'. ఆ సినిమాలో హీరోయిన్‌గా శ్రీలీల నటించింది. కిస్ హీరో విరాట్ కి, శ్రీలీలకు మొదటి సినిమా కావడం విశేషం. ఆ తర్వాత రోషన్ మేకా హీరోగా పరిచయం అయిన 'పెళ్లి సందడి' సినిమాలోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించింది. టాలీవుడ్‌లో శ్రీలీలకు అదే మొదటి సినిమా. రోషన్ మేకా మొదటి సినిమాకు శ్రీలీల సైన జోడీ అనే అభిప్రాయంతో రాఘవేంద్ర రావు ఆమెను ఏరికోరి ఎంపిక చేశాడని అంటారు. ఆ తర్వాత కన్నడం నుంచి వచ్చిన కిరీటి రెడ్డి మొదటి సినిమా 'జూనియర్' లోనూ శ్రీలీల హీరోయిన్‌గా నటించిన విషయం తెల్సిందే. ఈ ముగ్గురు హీరోల మొదటి సినిమాల్లో శ్రీలీల హీరోగా నటించడం జరిగింది. శ్రీలీల ఎంపిక బాలకృష్ణ నిర్ణయం? శ్రీలీల ఇప్పటికే మహేష్ బాబు, పవన్ కళ్యాణ్, అల్లు అర్జున్ వంటి సీనియర్ హీరోల సినిమాల్లో నటించిన కారణంగా ఇప్పుడు మోక్షజ్ఞ మొదటి సినిమాలో ఆమెను నటింపజేయడం ఎంత వరకు కరెక్ట్ అంటూ కొందరు నందమూరి ఫ్యాన్స్ ప్రశ్నిస్తున్నారు. వయసులో మోక్షజ్ఞ కంటే శ్రీలీల చాలా చిన్నదే అయినప్పటికీ ఆమె పెద్ద హీరోలతో నటించిన కారణంగా ఆలోచించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం ను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. కానీ బాలకృష్ణ మాత్రం తనతో భగవంత్ కేసరి సినిమాలో నటించిన కారణంగా, ఆ సమయంలో ఆమె గురించి తెలిసి, ఆమె ప్రతిభ గుర్తించి ఇప్పుడు మోక్షజ్ఞ సినిమాలో నటింపజేయాలని చూస్తున్నాడు అనేది కొందరి మాట. అయితే మైత్రి మూవీ మేకర్స్ నుంచి కానీ, దర్శకుడు వశిష్ఠ నుంచి కానీ ఈ విషయమై అధికారికంగా క్లారిటీ వచ్చే వరకు ఫ్యాన్స్ దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అనేది కొందరి మాట.



వంగా 'ఎపిక్' కనెక్షన్.. మామూలు రిస్క్ కాదుగా!

ఎపిక్ గురించి మొదటినుంచే ఒక లైన్ బజ్ పెంచుతోంది. శేఖర్ కమ్ముల సినిమాలో హీరోలాంటి అబ్బాయి, సందీప్ రెడ్డి వంగా సినిమాలో హీరోలాంటి అమ్మాయి మధ్య జరిగే ప్రేమకథ అని ఆదిత్య హాసన్ చెప్పాడు. కమ్ముల హీరో ఎలా ఉంటాడో ఒక అంచనా వేసుకోవచ్చు. కానీ వంగా సినిమాలో హీరోలాంటి హీరోయిన్ అనగానే లెక్క మారిపోతుంది. ఎందుకంటే వంగా హీరోలు ప్రేమలోనైనా, కోపంలోనైనా చాలా బోల్డ్‌గా ఉంటారు. అర్జున్ రెడ్డి నుంచి యానిమల్ వరకు వంగా హీరోల విషయంలో ఇదే కనిపించింది. వాళ్లు తప్పులు చేస్తారు, తమకు నచ్చినట్టు నిర్ణయాలు తీసుకుంటారు, కొన్ని సందర్భాల్లో ప్రేక్షకుడినే ఇబ్బంది పెట్టేలా ప్రవర్తిస్తారు. కానీ చివరికి హీరోను అర్థం చేసుకునేలా వంగా స్క్రీన్ ప్లే ఉంటుంది. అదే లక్షణాలతో ఒక అమ్మాయి పాత్రను రాస్తే ఎలా ఉంటుంది? వైష్ణవి చైతన్య క్యారెక్టర్ నిజంగానే అంత బోల్డ్‌గా ఉంటుందా, లేక ఆ పోలిక కేవలం ఆమె స్వభావం వరకు మాత్రమేనా అనేది ఎపిక్‌లో చూడాలి. వైష్ణవికి ఇలాంటి రిస్క్ పూర్తిగా కొత్త కూడా కాదు. బేబీలో ఆమె చేసిన వైష్ణవి పాత్ర చాలా సింపుల్ హీరోయిన్ క్యారెక్టర్ కాదు. ప్రేమ, కొత్త పరిచయాలు, తన నిర్ణయాలు, చేసిన తప్పులు అన్నీ కలిసిన పాత్ర అది. సినిమా వచ్చినప్పుడు ఆ క్యారెక్టర్ మీద ఎంత చర్చ జరిగిందో, సోషల్ మీడియాలో ఎంత ట్రోలింగ్ వచ్చిందో కూడా చూశాం. అయినా సాయి రాజేష్ ఆ పాత్రను కథలో పెట్టిన విధానం ప్రేక్షకులకు కనెక్ట్ అయింది. 100 కోట్లు కొట్టడానికి కారణం కూడా ఆ పాత్రే. అలాంటి పాత్రల్లో చిన్న తేడా వచ్చినా సమస్య పెద్దదవుతుంది. హీరోయిన్ ఎందుకు అలా ప్రవర్తిస్తోంది అనే కారణం కథలో సరిగ్గా కనిపించకపోతే ప్రేక్షకుడు వెంటనే క్యారెక్టర్‌ను పట్టేస్తాడు. ముఖ్యంగా ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక్క సీన్ బయటకు వచ్చినా దానిపైనే తీర్పులు మొదలవుతాయి. బేబీలో వైష్ణవికి ఆ రిస్క్ కలిసి వచ్చింది. ఇప్పుడు ఎపిక్‌లో మళ్లీ అలాంటి గ్రే షేడ్ ఉన్న అమ్మాయిగా కనిపిస్తే పోలికలు కూడా తప్పవు. ఇక్కడ ఆదిత్య హాసన్‌కు అసలు ఛాలెంజ్ అదే. వంగా హీరోలాంటి హీరోయిన్ అని ముందే చెప్పేశాడు కాబట్టి ఆ పాత్ర మామూలుగా ఉంటే ఆ లైన్ పెద్దగా పని చేయదు. మరీ ఎక్కువ బోల్డ్‌గా రాస్తే ఆ క్యారెక్టర్ ప్రేక్షకులకు దూరమయ్యే ప్రమాదం ఉంటుంది. మధ్యలో సరైన బ్యాలెన్స్ పట్టుకోవాలి. పైగా ఎదురుగా కమ్ముల హీరోలాంటి సాఫ్ట్ క్యారెక్టర్‌లో ఆనంద్ దేవరకొండ ఉండటం వల్ల ఇద్దరి మధ్య కాంట్రాస్ట్ కూడా కథలో బలంగా కనిపించాలి. బేబీ తర్వాత వైష్ణవిని మళ్లీ ప్రేమకథలో చూస్తున్నారు కాబట్టి ఆమె పాత్రపై సహజంగానే ఎక్కువ ఫోకస్ ఉంటుంది. ఈసారి ఆమె చేసే నిర్ణయాలు ఎంత వరకు షాక్ ఇస్తాయి, ఆదిత్య వాటిని ఎంత వరకు ప్రేక్షకుడికి అర్థమయ్యేలా రాశాడు అనేది చూడాలి.

సాంప్రదాయ లుక్‌లో నభా నటేష్.. చూపు తిప్పుకోలేని ఎలిగెన్స్!



టాలీవుడ్ లో ఇస్మార్ట్ శంకర్' సినిమాతో 'ఇస్మార్ట్ బ్యూటీ'గా కోట్లాది మంది తెలుగు ప్రేక్షకుల మనసులను దోచుకున్న నటి నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఫోటోలతో నెటిజన్లను కట్టిపడేస్తోంది. మోడర్న్ డ్రెస్సుల్లోనే కాకుండా సంప్రదాయ దుస్తుల్లో కూడా తాను ఎంత అందంగా ఉంటానో నిరూపిస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఇప్పుడు ఇంటర్నెట్‌లో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. పద్ధతిగల చీరకట్టులో, బంగారు ఆభరణాలు ధరించి చందమామలా మెరిసిపోతున్న ఈ పిక్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. రస్ట్ ఆరెంజ్ శారీలో సాంప్రదాయ సౌందర్యం: తాజా ఫోటోషూట్ కోసం నభా నటేష్ రస్ట్ ఆరెంజ్ కలర్ బ్లౌజ్, దానికి తగ్గట్టుగా ఉన్న ఎంబ్రాయిడరీ డ్రేప్ట్ శారీని ఎంచుకుంది. బంగారం, పలు రంగులతో చేసిన డిజైనింగ్ వర్క్ ఆమె అవుట్‌ఫిట్‌కు రాయల్ లుక్‌ను తెచ్చిపెట్టింది. దీనికి మ్యాచింగ్‌గా ఉన్న బ్లాక్ పోల్కా-డాట్ గార్మెంట్ కూడా ఈ డ్రెసింగ్‌కు ప్రత్యేకమైన ఆకర్షణను జోడించింది. ఇక స్టూడియో బ్యాక్‌డ్రాప్‌లో నభా ఇచ్చిన పోజులు ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకుంటున్నాయి. లేయర్డ్ జ్యువెలరీ అండ్ క్లాసిక్ మేకప్: ఈ సంప్రదాయ దుస్తులకు మరింత అందాన్ని తీసుకొచ్చేలా నభా భారీ బంగారు ఆభరణాలను ధరించింది. మెడలో లేయర్డ్ గోల్డ్ నెక్లేస్, చెవులకు మెరిసే మోడల్ కమ్మలు, చేతులకు గాజులు వేసుకుని పూర్తి పండుగ కళను నింపుకుంది. ఫ్యాషన్ డిజైనర్ నిహా వర్మ స్టైలింగ్ చేసిన ఈ లుక్‌లో నభా చిందించిన ప్రశాంతమైన హావభావాలు, క్లాసిక్ మేకప్ ఆమె ఎలిగెంట్‌ను రెట్టింపు చేశాయి. 'ఇస్మార్ట్ శంకర్' నుంచి నేటి వరకు కెరీర్: కన్నడ చిత్రం 'వజ్రకాయ'తో రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన నభా, 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్'లో చాందిని పాత్రతో ఒక్కసారిగా టాప్ హీరోయిన్‌గా మారింది. ఇక ఆ తర్వాత 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', 'అల్లుడు అదుర్స్', 'మాస్ట్రో', 'డార్లింగ్' వంటి చిత్రాలతో ప్రేక్షకులను అలరించింది.

వీణ చేతిలో భారీ పాన్ ఇండియా ప్రాజెక్టులు: గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా వైవిధ్యమైన క్యారెక్టర్లు ఎంచుకుంటున్న నభా, ప్రస్తుతం 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' అనే పాన్ ఇండియా అడ్వెంచర్ ఫిల్మ్‌లో పార్వతి పాత్రలో నటిస్తోంది. దీనితో పాటు 'స్వయంభూ' అనే పీరియడ్ ఎపిక్ చిత్రంలోనూ కీలక పాత్ర పోషిస్తోంది. ఇక తమ అభిమాన నటి నభా నటేష్ ఇలాంటి సాంప్రదాయ ఫోటోషూట్లతో ఇంటర్నెట్‌ను మైమరపిస్తూ, రాబోయే రోజుల్లో పెద్ద ప్రాజెక్టులతో వెండితెరపై భారీ విజయాలు సాధించాలని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.



'టాక్సిక్' ఎఫెక్ట్... ఇక మీదట అలా జరగదు!



సినిమాలకు ఒకప్పుడు ప్రధాన ఆదాయం టికెట్ల ద్వారా వచ్చేది. ఆ తర్వాత శాటిలైట్ రైట్స్ ద్వారా బడ్జెట్‌లో కొంత భాగం వచ్చేది. పెద్ద హీరోల సినిమాలకు ఒకానొక సమయంలో సినిమా బడ్జెట్‌లో దాదాపుగా 50% శాటిలైట్ రైట్స్ ద్వారా వచ్చేది. ఇప్పుడు ఓటీటీ యుగం నడుస్తోంది. సినిమా బడ్జెట్‌లో మెజార్టీ భాగం ఓటీటీ రైట్స్ విక్రయించడం ద్వారా నిర్మాతలకు దక్కుతుంది. కొన్ని మీడియం రేంజ్, చిన్న బడ్జెట్ సినిమాలకు పెట్టిన బడ్జెట్‌కు మించి ఓటీటీ రైట్స్ రావడం మనం చూశాం. సినిమాకు దక్కిన క్రేజ్, ఆ సినిమాను జనాల్లోకి ఫిల్మ్ మేకర్స్ తీసుకు వెళ్లిన తీరును బట్టి ఓటీటీలు రేటు నిర్ణయిస్తున్నాయి. చిన్న సినిమాలకు మంచి బజ్ క్రియేట్ అయితే భారీ అమౌంట్ ఇచ్చేందుకు ఓటీటీలు సిద్ధంగా ఉంటాయి. స్టార్ హీరోల సినిమాలకు సైతం ఓటీటీలు పదుల కోట్ల రూపాయలు ఇచ్చేందుకు రెడీగా ఉంటాయి. ఓటీటీ బబుల్ బ్లాస్ట్ అయింది. రెండు మూడు ఏళ్ల పాటు ఓటీటీ సంస్థలు ఇచ్చే అమౌంట్స్‌తో నిర్మాతలు ఫుల్ ఖుషి అయ్యే వారు, మెల్ల మెల్లగా పరిస్థితి మారుతూ వచ్చింది. భారీ బడ్జెట్ సినిమాలకు ఓటీటీ రైట్స్... ఓటీటీలు ఇష్టానుసారంగా కంటెంట్‌పై ముఖ్యంగా సినిమాలపై ఖర్చు పెట్టేందుకు సిద్ధంగా లేరు. ఓటీటీ లు పెరగడంతో పాటు, ఇతర కారణాల వల్ల సినిమాలపై ఓటీటీ సంస్థలు పెద్ద మొత్తంలో పెట్టేందుకు వెనకాడుతున్నారు. ఇలాంటి సమయంలో కొందరు నిర్మాతలు ఓటీటీలతో పెద్ద మొత్తం కు బేరం ఆడటం, విడుదలకు ముందు బేరం కుదరక పోవడం తో.. రిలీజ్ తర్వాత ఓటీటీ డీల్ చేసుకోవాలి అనుకోవడం చేస్తున్నారు. లక్కీగా సినిమా సూపర్ హిట్ అయితే అనుకున్నంత రేటును ఓటీటీ వారు పెట్టేందుకు ముందుకు వస్తారు. కానీ సినిమా ఫ్లాప్ అయితే ముందుగా ఓటీటీ వారు కోట్ చేసిన మొత్తంలో కనీసం సగం అమౌంట్ కూడా ఇచ్చేందుకు ముందుకు రారు. అసలు కొన్ని సినిమాలను కనీసం కొనుగోలు చేసేందుకు కూడా ముందుకు రాని పరిస్థితి ఉంది. అలా చాలా సినిమాలు ఓటీటీ డీల్ కు నోచుకోకుండా ఉన్నాయి. యశ్ టాక్సిక్ సినిమా ఓటీటీ డీల్... తాజాగా టాక్సిక్ సినిమా ఓటీటీ డీల్ గురించి ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. యశ్ హీరోగా నటించిన టాక్సిక్ మూవీని ప్రముఖ ఓటీటీ విడుదలకు ముందు అన్ని భాషలకు కలిపి రూ.150 కోట్లకు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చింది. అయితే నిర్మాత భారీ మొత్తాన్ని డిమాండ్ చేశాడట. యశ్ టాక్సిక్ సినిమాకు రూ.150 కోట్ల ఓటీటీ డీల్ కరెక్ట్ కాదు, అంతకు మించి కావాల్సిందే అని పట్టుబట్టినట్లు తెలుస్తోంది. దాంతో విడుదల వరకు ఓటీటీ డీల్ క్లోజ్ కాలేదు. సినిమా విడుదల తర్వాత ఫలితం ఏంటో తెలిసిందే. ఇప్పుడు అదే ఓటీటీ సంస్థ రూ.150 కోట్లు కాదు కదా కనీసం రూ.100 కోట్లకు కూడా తీసుకునే పరిస్థితి కనిపించడం లేదు. విశ్వనీసంగా అందుతున్న సమాచారం ప్రకారం కేవలం రూ.30 కోట్లకు టాక్సిక్ డిజిటల్ రైట్స్ ను అడుగుతున్నారట. ఆ మొత్తానికి సరే అంటే తీసుకునేందుకు రెడీ, అంతకు మించి డిమాండ్ చేస్తే మరో ఓటీటీని చూసుకోమని అన్నారట. పెద్ద చిత్రాల నిర్మాతలు... టాక్సిక్ నిర్మాతకు ఓటీటీ రైట్స్ పడిపోవడంతో పెద్ద షాక్ తగిలినట్లు అయింది. కేవలం టాక్సిక్ నిర్మాతకు మాత్రమే కాకుండా చాలా మంది నిర్మాతలు ఇదే పరిస్థితి ఎదుర్కొన్నారు. అయితే టాక్సిక్ నిర్మాతకు రూ.100 కోట్లకు పైగా నష్టం రాబోతున్నట్లు చెబుతున్నారు. విడుదలకు ముందు ఓటీటీ డీల్ క్లోజ్ చేసుకోలేక పోతే, విడుదల విషయంలోనూ గందరగోళం ఉంటుంది. ఓటీటీతో ఎంతో కొంతకు డీల్ సెట్ చేసుకుంటే రిలీజ్ డేట్ వారు చెప్పినట్లు వెళ్లి పోవచ్చు. లేదంటే వాయిదా మీద వాయిదాలు వేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. కనుక ఇకపై అయినా ఫిల్మ్ మేకర్స్ తమ సినిమాపై ఓవర్ కాన్ఫిడెన్స్ పెట్టుకోకుండా రిలీజ్‌కి ముందే ఓటీటీ డీల్ క్లోజ్ చేసుకుంటే మంచిది అనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

సినిమా విడుదల తర్వాత ఫెయిల్ అయితే అప్పుడు ఇబ్బంది పడటం, నష్టపోవడం ఎందుకు అనేది విశ్లేషకుల మాట. కంటెంట్ పై నమ్మకంతో సినిమాను రిలీజ్ వరకు ఓటీటీ కి అమ్మకుండా చిన్న సినిమాలకు, మీడియం రేంజ్ బడ్జెట్ సినిమాలకు వర్కౌట్ కావచ్చు. కానీ భారీ బడ్జెట్ సినిమాల ఓటీటీ డీల్స్ రిలీజ్‌కి ముందే క్లోజ్ చేస్తే అన్ని విధాలుగా ఉత్తమం. టాక్సిక్ ఎఫెక్ట్‌తో ఇకపై రిలీజ్‌కి ముందే డీల్ క్లోజ్ చేసుకోవచ్చు.

Printed by M/s Sri Venkataramana Offset Printers Published by Syed Tajbaba on behalf of Syed Tajbaba,
Printed at Peddapalli and published at B-12 Ntpc Ramagundam,Editor SYED TAJBABA.